బుధవారం
4•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 249
• పేజీలు : 12 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE







# ఫికర్ మత్ కరోనా!

## కొవిడ్-19ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం

### వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రూ.100 కోట్లు

- సీఎం కేసీఆర్‌కు ఎప్పటికప్పుడు సమాచారం
- వివిధశాఖలతో సమన్వయానికి కమిటీ
- రాష్ట్రంలో మరిన్ని ఐసోలేషన్ వార్డులు
- వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి

**కొవిడ్-19పై అవగాహనకు విస్తృత ప్రచారం**

- వైరస్ వ్యాప్తిపై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు
- ముందస్తు చర్యలపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- హాజరైన మంత్రులు కేటీఆర్, ఈటల, ఎర్రబెల్లి



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

> కరోనా వైరస్ ఉష్ణోగ్రత తక్కువ ఉన్నచోట మాత్రమే జీవించే ఆస్కారం ఉంటుంది. మనవద్ద ఉష్ణోగ్రతలు అధికంకావడంతో అది వ్యాప్తిచెందే అవకాశం చాలా తక్కువ. ఈ వైరస్ సోకినవారిలో ఇప్పటివరకు 3 శాతం మరణాలు కూడా లేవు. వైరస్ పాజిటివ్‌గా తేలిన యువకుడిని గాంధీలో ప్రత్యేకవార్డులో ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అతడి పరిస్థితి నిలకడగా ఉన్నది.
>
> – మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

కరోనాను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. కొవిడ్-19 వైరస్‌ను గుర్తించిన నేపథ్యంలో ప్రభుత్వయంత్రాంగం అప్రమత్తమయిందని.. వైరస్ వ్యాప్తిచెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నారని.. కరోనాను ఎదుర్కొనేందుకు రూ.100 కోట్ల నిధులు మంజూరుచేశారని వివరించారు. కరోనావైరస్‌పై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. దీనిని ఎదుర్కొనేందుకు ఆయా శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయింది. ఎంసీఆర్‌హెచ్చార్డీలో మంత్రులు కే తారకరామారావు, ఈటల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు.. వివిధశాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్. వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ ఏ శాంతికుమారి, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణా, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాసరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, హైదరాబాద్ కలెక్టర్ శ్వేతామహంతి, వివిధ ఆరోగ్యసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కరోనా విస్తరించకుండా ప్రభుత్వశాఖల మధ్య సమన్వయానికి కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటుచేయాలని సమావేశంలో నిర్ణయించారు. కొవిడ్-19 వ్యాప్తిచెందకుండా తీసుకోవాల్సిన చర్యలు, అనుమానితులకు

మిగతా 2వ పేజీలో

**ఇవీ లక్షణాలు**




**ఇలా జాగ్రత్తలు**

- కరచాలనం వద్దు.. నమస్కారమే శ్రేయస్కరం.
- తుమ్మినా, దగ్గినా నోటికి రుమాలు అడ్డంపెట్టుకోవాలి.
- కండ్లు, ముక్కును నలుపకూడదు.
- బహిరంగ ప్రదేశాల్లో, జనాభా ఎక్కువగా ఉండే చోట్ల మూతికి మాస్కులు ధరించడం ఉత్తమం.
- జలుబు, దగ్గు, జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- చైనా, దుబాయ్, మలేషియా, హాంకాంగ్ తదితర దేశాల నుంచి వచ్చినవారు అప్రమత్తంగా ఉండాలి. కనీసం 14 రోజులపాటు ఇంటి నుంచి బయటకు రావద్దు.
- అనుమానిత లక్షణాలు ఉంటే కరోనా నోడల్ కేంద్రాన్ని ఆశ్రయించాలి.
- బీపీ, షుగర్, హార్ట్, కిడ్నీ, లంగ్స్, అస్తమారోగులు, గర్భిణులు ఈ వైరస్ సోకకుండా మరింత జాగ్రత్తగా ఉండాలి.





మహబూబాబాద్ జిల్లా మాధవాపురం గ్రామంలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, తాసిల్దార్ రంజిత్‌కుమార్‌ను భుజాలపై ఎత్తుకుని తీసుకొస్తున్న రైతులు

# మాధవాపురం మురిసింది

## 40 ఏండ్ల భూ సమస్యకు పరిష్కారం

- ఒకేసారి 957 మందికి పాస్‌పుస్తకాలు
- దారిచూపిన భూ రికార్డుల ప్రక్షాళన
- ఎమ్మెల్యే, తాసిల్దార్‌పై పూలవర్షం
- ఎత్తుకొని ఊరేగించిన అన్నదాతలు

సాగుచేస్తున్నా భూమిపై హక్కులేదు! పాస్‌పుస్తకాలు లేవు! అర్హత ఉన్నా.. రైతుబంధు, రైతుబీమా అందవు! దశాబ్దాల అపరిష్కృత సమస్యకు భూరికార్డుల ప్రక్షాళన మార్గంచూపెట్టింది. తాసిల్దార్ చొరవతో 957 మంది రైతులకు ఒకేసారి పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందాయి. రైతుపక్షపాతి సీఎం కేసీఆర్ వల్లే పాస్‌పుస్తకాలు అందాయంటూ చేతులెత్తి నమస్కరించారు అన్నదాతలు. కృతజ్ఞతగా ఎమ్మెల్యే, తాసిల్దార్‌పై పూలవర్షం కురిపించారు. ఈ అరుదైన దృశ్యానికి మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు మాధవాపురం వేదికైంది.

**మహబూబాబాద్ రూరల్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు మాధవాపురంలో 2,500 ఎకరాల్లో భూములు సాగుచేసుకుంటున్న రైతులకు 40 ఏండ్లుగా పట్టదార్ పాస్‌పుస్తకాలు లేవు. ఎవరి భూముల్లో వారు సాగుచేసుకుంటున్నప్పటికీ రికార్డుల్లేవు. దీంతో ఎవరికీ పాస్‌పుస్తకాలు, పహాణీ, 1బీ వంటి ఎలాంటి ఆధారం లేకపోవడంతో రైతుబంధు, రైతుబీమా పొందలేకపోతున్నారు. దశాబ్దాలుగా ఎవరికి మొరపెట్టుకున్నా వీరి సమస్య పరిష్కారంకాలేదు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూరికార్డుల ప్రక్షాళన దారిచూపింది. తాసిల్దార్ రంజిత్‌కుమార్

మిగతా 4వ పేజీలో

# పశువులకూ యునిక్ ఐడీ



**వరంగల్ రూరల్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

ఇప్పటివరకు మనుషులకు మాత్రమే ఉన్న ఆధార్ తరహా నంబర్‌ను రాష్ట్ర ప్రభుత్వం పశుసంపదకూ కేటాయిస్తున్నది. పన్నెండు అంకెలతో కూడిన యునిక్ ఐడీ ట్యాగ్‌ను ప్రతి పశువు చెవికి అమర్చుతున్నది. పశుసంవర్ధకశాఖ అధికారులు కొన్నిరోజులుగా పశువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి పశువులకు రిజిస్ట్రేషన్ చేసి, యజమానులకు పశు గుర్తింపు, హెల్త్‌కార్డులను అందజేస్తున్నారు.

**ప్రత్యేక బృందాలతో కార్యాచరణ**

పశువులకు యునిక్ ఐడీ కేటాయించేందుకు పశు వైద్యులు, గోపాలమిత్ర, పశుమిత్ర, రిటైర్డ్ ఉద్యోగులతో పశుసంవర్ధకశాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసింది. కొన్నినెలల కిందట పూర్తయిన పశుగణన జాబితాను ఈ బృందాలకు అందజేసింది. గత ఫిబ్రవరి ఒకటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బృందం సభ్యులు ఇంటింటికీ వెళ్లి ఆవులు, ఎద్దులు, బర్రెలు, దున్నలను గుర్తించి పన్నెండు అంకెల యునిక్ ఐడీతో కూడిన ట్యాగ్‌ను పశువు

మిగతా 4వ పేజీలో

### పన్నెండు నంబర్లతో ప్రత్యేక ఐడీ ట్యాగ్

- ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాలు నమోదు
- యజమానులకు పశువుల హెల్త్‌కార్డులు
- దేశంలోనే తొలిసారి రిజిస్ట్రేషన్
- మరో నెల రోజుల్లో ప్రక్రియ పూర్తి

# మరో లక్ష టన్నులు

### కందుల కొనుగోలుకు కేంద్రం అనుమతి

**సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి తోమర్‌కు రాష్ట్ర మంత్రి నిరంజన్‌రెడ్డి కృతజ్ఞతలు**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో కనీస మద్దతు ధరకు మరో లక్ష టన్నుల కందుల కొనుగోలుకు కేంద్రం అనుమతిచ్చింది. రాష్ట్రంలో సాగునీటి వసతి పెరుగడంతో ఈ ఏడాది కందుల దిగుబడి గణనీయంగా పెరిగింది. దీంతో ప్రస్తుత సీజన్‌లో తొలివిడుత 47,500 టన్నుల కొనుగోలుకు అనుమతిచ్చిన కేంద్రం.. ఆ తర్వాత రాష్ట్ర వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు రెండో విడుతలో మరో 4,500 టన్నుల కొనుగోలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయినప్పటికీ మార్కెట్లకు భారీగా కందులు తరలిరావడంతో మరో 56,000 టన్నుల కొనుగోలుకు అనుమతివ్వాలని మంత్రి నిరంజన్‌రెడ్డి మరోసారి కేంద్రానికి లేఖ రాయడంతోపాటు రాష్ట్రంలో 2 లక్షల టన్నులకుపైగా కందుల దిగుబడి వస్తున్నందున కొనుగోలు కోటాను పెంచాలని ఢిల్లీలో జరిగిన ఐకార్ సదస్సులో కేంద్రానికి వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్‌తోమర్.. అదనపు కందుల కొనుగోలు కోసం లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ లేఖ రాయడంతో రాష్ట్రంలో గత కోటాకు అదనంగా మరో లక్ష టన్నుల కందుల కొనుగోలుకు కేంద్ర వ్యవసాయశాఖ అనుమతిచ్చింది. ఈ విషయంలో ముందుచూపుతో కేంద్రానికి లేఖ రాసి అనుమతి లభించేలా చూసిన సీఎం కేసీఆర్‌కు తెలంగాణ రైతుల తరపున మంత్రి నిరంజన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ విజ్ఞప్తిని మన్నించిన కేంద్ర మంత్రి తోమర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు

- 4.02 శాతం పెంచుతూ సీఎండీ ఉత్తర్వులు
- జనవరి 1 నుంచి అమలు
- 40 వేల మంది ఉద్యోగులు, ఆర్టిజన్లకు లాభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలోని విద్యుత్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లకు కరవుభత్యాన్ని 4.02 శాతం పెంచుతూ ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఇప్పటివరకు 8.866 శాతంగా ఉన్న డీఏ 12.886 శాతానికి పెరిగింది. దీనివల్ల టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న దాదాపు 40 వేల మంది ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లకు లబ్ధి చేకూరనున్నది. ఈ నాలుగు సంస్థల

మిగతా 4వ పేజీలో

## నేటినుంచి ఇంటర్ పరీక్షలు

- ఉదయం తొమ్మిదింటి నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా
- హాజరుకానున్న 9.65 లక్షల మంది విద్యార్థులు
- ఆత్మవిశ్వాసంతో రండి: మంత్రి సబిత

3

## అతివా అందుకో..

- మహిళా దినోత్సవంనాడు స్ఫూర్తిదాయక మహిళలకు సోషల్ మీడియా ఖాతాలు
- నారీమణుల కథనాలు పంపండి
- ట్విట్టర్‌లో ప్రధాని మోదీ పిలుపు

5

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 57.00 | రిటైల్ లైవ్ | 79.00 |
| డ్రెస్‌డ్ | 115.00 | స్కిన్‌లెస్ | 130.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 295.00 | రంగారెడ్డి | 295.00 |
| మెదక్ | 295.00 | కరీంనగర్ | 298.00 |
| వరంగల్ | 298.00 | డజన్ ధర | 54.00 |

# బ్రాండ్ తెలంగాణ!

## కల్తీలేని ఆహార పదార్థాల తయారీ కేంద్రాల ఏర్పాటు

- అంతర్జాతీయ ప్రమాణాలతో సరుకుల తయారీ
- దేశ, విదేశాలకు ఎగుమతి
- రేషన్ డీలర్ల ద్వారా రాష్ట్రంలో సరఫరా
- పంటలవారీగా జిల్లాల్లో పరిశ్రమల స్థాపన
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో క్రయవిక్రయాలు
- రైతులకు గిట్టుబాటు ధర
- యువతకు ఉపాధి అవకాశాలు
- ప్రాథమిక నివేదికలు, ప్రణాళికలు సిద్ధం



సిద్దిపేట జిల్లా ఇర్కోడులో పచ్చళ్లు ప్యాక్‌చేస్తున్న మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

మార్కెట్‌లో ఏం కొందామన్నా కల్తీ.. ఏం తిందామన్నా కల్తీ. పసుపు, కారం, నూనె, అల్లం.. సర్వం కల్తీమయం. కల్తీకాటుకు జనం అలవిగాని రోగాలబారిన పడుతున్నారు. మరోవైపు రైతులు కొన్నిసార్లు తమ పంటకు సరైన గిట్టుబాటు ధర రాక నష్టపోతుండగా, మరికొన్నిసార్లు టమాట వంటి పంటలను కొనేవారులేక నేలపాలు చేస్తున్నారు. ఇటు వినియోగదారులకు, అటు రైతులకు లబ్ధిచేకూర్చడంతోపాటు మహిళలు, యువతకు ఉపాధి కల్పించే బృహత్ కార్యక్రమం 'బ్రాండ్ తెలంగాణ'కు సీఎం కేసీఆర్ రూపకల్పన చేశారు. బ్రాండ్ తెలంగాణ పేరిట ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించేందుకు ఆహార తయారీకేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకొన్నది. వీటివల్ల ప్రజలకు కల్తీలేని ఆహారపదార్థాలు అందుబాటులోకి వస్తాయి. రైతులు తమ పంటను కిలోమీటర్ల దూరం వెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండదు. గ్రామాల్లో ఉండే మహిళా సంఘాలే పంటను కొనుగోలు చేసి పరిశ్రమలకు తరలిస్తాయి. అక్కడ వాటిని శుద్ధిచేసి వివిధరకాల ఆహార పదార్థాలను తయారుచేస్తాయి. ఉదాహరణకు రైతుల వద్ద కొనుగోలు

మిగతా 4వ పేజీలో

# ఢిల్లీ అల్లర్లపై చర్చించాలి


- రాజ్యసభలో టీఆర్ఎస్ ఎంపీ కేకే డిమాండ్
- చర్చ అంటే కేంద్రానికి భయం: అసదుద్దీన్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈశాన్య ఢిల్లీలో ఇటీవల సంభవించిన అల్లర్లపై సమగ్రంగా చర్చించాలని రాజ్యసభలో టీఆర్ఎస్ పక్ష నేత కే కేశవరావు డిమాండ్ చేశారు. ఢిల్లీ అమానుష ఘటనలపై చర్చించాలని, దోషులను శిక్షించాలని మంగళవారం రాజ్యసభలో విపక్షాలు పట్టుబట్టాయి. సమయం లేనందున మరోసారి చర్చ చేపడుతామని రాజ్యసభ చైర్మన్ పేర్కొనగా, ప్రతిపక్ష నాయకులు సమ్మతించలేదు. దీంతో సభలో గందరగోళం నెలకొన్నది. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ చర్చను హడావుడిగా కాకుండా సమగ్రంగా చర్చించాలని డిమాండ్ చేశారు. సమయం లేకపోతే బుధవారం ప్రత్యేక చర్చ జరుపాలని కోరారు.

**ఉభయ సభల్లోనూ చర్చించాలి: అసదుద్దీన్ ఒవైసీ**

ఢిల్లీలో అల్లర్లపై అన్ని పార్టీల సమావేశం ఏర్పాటుచేస్తున్న కేంద్రం ఉభయసభల్లో చర్చలకు అనుమతినివ్వడం లేదని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. చర్చ జరిగితే శాంతిభద్రతలపై ప్రభావం పడుతుందంటున్నారని ఢిల్లీలో జాతీయమీడియాతో అన్నారు. ఢిల్లీ అల్లర్లపై ఉభయ సభలలో చర్చ జరుపాల్సిందేనని డిమాండ్ చేశారు.





# పోప్‌కు సోకలేదు!

## కరోనా పరీక్షల్లో నెగెటివ్

**వాటికన్ సిటీ:** జలుబుతో బాధపడుతున్న పోప్ ఫ్రాన్సిస్‌కు కరోనా వైరస్ సోకలేదని, పరీక్షల్లో నెగెటివ్ అని వచ్చిందని ఇటలీకి చెందిన ఓ పత్రిక మంగళవారం వెల్లడించింది. పోప్ అన్ని బహిరంగ సమావేశాలను ఉపసంహరించుకోవడమేగాక, తన పదవీకాలంలో తొలిసారిగా ఉపవాస విందును కూడా రద్దుచేసుకున్నారు. దీంతో ఆయన కరోనాతో బాధపడుతున్నారనే ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే పోప్‌కు నిర్ధారణ పరీక్ష ఎప్పుడు జరిగిందనే విషయమై వార్తాకథనంలో వెల్లడించలేదు.

# ఇంటి వద్ద ఉండే పనిచేయండి



**శాన్‌ఫ్రాన్సిస్కో, మార్చి 3:** కరోనా వ్యాప్తి నేపథ్యంలో తన సిబ్బందిని ఇంటి వద్ద నుంచే పనిచేయాలని ట్విట్టర్ కోరింది. ఈ సంస్థకు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఉద్యోగులున్నారు. కరోనా వైరస్‌ను నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ హెచ్చార్ విభాగం అధిపతి జెన్నిఫర్ క్రిస్టే సోమవారం తన ట్విట్టర్ బ్లాగ్‌లో పోస్ట్‌చేశారు. ఇప్పటికే దక్షిణ కొరియా, హాంకాంగ్, జపాన్‌లోని తమ ఉద్యోగులను ఇంటి వద్ద నుంచే పని చేయడం తప్పనిసరి చేసింది ట్విట్టర్.

# మన వాతావరణమే మనకు రక్ష!

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ ప్రపంచదేశాలను బెంబేలెత్తిస్తున్నది. భారత్‌లోనూ కేసులు నమోదయ్యాయి. అయితే మనదేశ వాతావరణ పరిస్థితులే మనకు రక్ష అని వైద్యనిపుణులు చెప్తున్నారు. భారత్‌లోని అధిక ఉష్ణోగ్రత, తేమ పరిస్థితుల కారణంగా వేగంగా వ్యాప్తిచెందలేదని పేర్కొంటున్నారు. భారత్‌లో అధిక ఉష్ణోగ్రత, తేమ ఉండ టంవల్ల వైరస్ మనుగడ కష్టమని హార్ట్‌కేర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ కేకే అగర్వాల్ తెలిపారు. తక్కువ ఉష్ణోగ్రతలు ఉండే ప్రదేశాల్లో వైరస్ వేగంగా ప్రబలుతుందని, అందుకే ఆగ్నేయాసియా దేశాల్లో కరోనా వేగంగా సంక్రమిస్తున్నదని వివరించారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.46 గంటలకు

సూర్యాస్తమయం: 6.08 గంటలకు

సూర్యోదయం: ఉదయం 6:32, సూర్యాస్తమయం: సాయంత్రం 6:17, వికారినామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం నవమి మధ్యాహ్నం 2.01 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: మృగశిర ఉదయం 11.24 వరకు, తదుపరి ఆరుద్ర, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 12.25 నుంచి 1.52 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.01 నుంచి 12.48 వరకు, వర్జ్యం: రాత్రి 7.49 నుంచి 9.25 వరకు.

### లోకం పోకడ






కరోనా వైరస్ భయాందోళనల నేపథ్యంలో కొలంబియాలోని సైమన్ బొలివార్ ఇంటర్నేషనల్ వంతెన వద్ద మాస్కులు ధరించి ప్రయాణికుల పత్రాలను పరిశీలిస్తున్న వలస విభాగ అధికారులు



# కరోనా సైరన్!

**కొత్త కేసులతో అప్రమత్తమైన కేంద్రం**
**నియంత్రణ చర్యలు ముమ్మరం**

- మరో నాలుగు దేశాలవారికి వీసాలు రద్దు
- ఉన్నతాధికారులతో ప్రధాని మోదీ సమీక్ష
- రాజస్థాన్‌లో ఇటలీ దంపతులకు వైరస్ నిర్ధారణ

**న్యూఢిల్లీ, మార్చి 3:** దేశంలో కరోనా కేసులు వెలుగుచూడడంతో భారత్ అప్రమత్తమైంది. నియంత్రణ చర్యలను ముమ్మరం చేసింది. ఇటలీ, ఇరాన్, దక్షిణ కొరియా, జపాన్ దేశాల నుంచి వచ్చే వారి వీసాలను రద్దు చేసింది. కరోనా పాజిటివ్‌గా తేలిన ఢిల్లీ వ్యక్తికి చెందిన కుటుంబ సభ్యులు సహా ఆరుగురిని ప్రత్యేక వైద్య కేంద్రంలో ఉంచింది. ఆయన కుమారుడు విద్యనభ్యసిస్తున్న నోయిడాలోని పాఠశాలతోపాటు మరో పాఠశాలను కూడా మూసివేశారు. మరోవైపు, రాజస్థాన్ జైపూర్‌లో ఇటలీ పర్యాటకుడికి కరోనా సోకినట్లు నిర్ధారణ అయిందని అధికారులు తెలిపారు. 20 మంది పర్యాటకుల బృందంలో ఒకరైన ఆయనను ఎస్‌ఎంఎస్ దవాఖానలోని ప్రత్యేక వార్డులో ఉంచినట్లు వెల్లడించారు. ఆయన భార్యకు కూడా కరోనా వైరస్ సోకినట్టు తేలింది. దీంతో ఇప్పటివరకు దేశంలో ఏడు కేసులు నమోదయ్యాయి. సోమవారం ఇద్దరికి కరోనా సోకినట్లు నిర్ధారణ కావడంతో, ప్రధాని మోదీ మంగళవారం వైరస్ నియంత్రణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కూడా అన్ని విమానాశ్రయ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. నూతన మార్గదర్శకాలను జారీచేసింది. కరోనా అనుమానంతో ఆగ్రాకు చెందిన ఇద్దరు షూ ఎగుమతిదారులతో పాటు వారి కుటుంబానికి చెందిన నలుగురిని మంగళవారం ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ దవాఖానకు తరలించారు.



ఆగ్రాలోని తాజ్‌మహల్ వద్ద మాస్కులు ధరించిన పర్యాటకులు

### అమెరికాలో ఆరుకు చేరిన మృతులు

అమెరికాలో కరోనా బారిన పడి ఇప్పటివరకు ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ తెలిపారు. వైరస్ సోకిన వారి సంఖ్య 90 దాటినట్లు వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నతస్థాయి వైద్య అధికారులు, ఫార్మారంగ దిగ్గజాలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం అమెరికాకు కరోనా ముప్పు ఇప్పటికీ తక్కువేనని పెన్స్ చెప్పారు. వేసవి నాటికి చికిత్స అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నదన్నారు. కాగా, కరోనా నియంత్రణకు ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీలో భారత సంతతికి చెందిన హెల్త్ పాలసీ కన్సల్టెంట్ సీమా వర్మకు చోటుదక్కింది.

### చైనా వెలుపల విజృంభణ

చైనా వెలుపల కరోనా అంతకంతకూ విజృంభిస్తున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. చైనా వెలుపల కేసుల నమోదు ఎనిమిదిరెట్లు పెరిగినట్లు తెలిపింది. దక్షిణ కొరియాలో కొత్తగా 851 కేసులు నమోదవడంతో మొత్తం కేసుల సంఖ్య 5 వేలను దాటింది. మృతుల సంఖ్య 28కి పెరిగింది. మరోవైపు, చైనాలో కరోనా తగ్గుముఖం పట్టింది. మంగళవారం 125 కొత్త కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు ఆ దేశంలో 2,943 మంది ప్రాణాలు కోల్పోగా.. 80 వేల మందికికరోనా సోకింది.

### ఇరాన్‌లో మరో 11 మంది బలి

కరోనా వైరస్‌తో ఇరాన్‌లో మరో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలో మృతుల సంఖ్య 77కు పెరిగింది. కొత్తగా 835 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా ఇరాన్‌లో 2,336 మందికి వైరస్ సోకింది.



### వీసాలు రద్దు..

ఇటలీ, ఇరాన్, దక్షిణ కొరియా, జపాన్ దేశీయులకు ఈ నెల 3 కంటే ముందు జారీచేసిన వీసాలను రద్దుచేస్తున్నట్లు కేంద్ర వైద్యశాఖ తెలిపింది. ఈ నెల కంటే ముందు జపాన్, దక్షిణ కొరియా దేశీయులకు జారీచేసిన వీసా ఆన్ అరైవల్స్‌ను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

### నోయిడాలో రెండు పాఠశాలలు మూసివేత..

ఇటీవల ఇటలీలో పర్యటన నుంచి వచ్చిన ఢిల్లీ మయూర్ విహార్‌కు చెందిన వ్యక్తికి కరోనా నిర్ధారణ కావడంతో ఆయనను ఆదివారం రాత్రి సఫ్దర్‌జంగ్ దవాఖానకు తరలించినట్లు సమాచారం. ఆయన కుమారుడు చదువుతున్న నోయిడాలోని పాఠశాలను శుక్రవారం వరకు మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. నోయిడాలోని మరో పాఠశాలను శనివారం వరకు మూసివేయనున్నారు. ఢిల్లీ వ్యక్తి తమ కుమారుడి పుట్టినరోజు వేడుకను ఇటీవల నిర్వహించడంతో, ఆ పార్టీకి హాజరైన విద్యార్థులు, బంధువులకు కరోనా సోకి ఉండొచ్చనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.



నోయిడాలోని పాఠశాలకు సెలవు ప్రకటించడంతో ఇంటికి వెళ్లిపోతున్న ఉపాధ్యాయులు



గాంధీలో కరోనా మాస్కులు ధరించి విధులు నిర్వర్తిస్తున్న మెడికల్ దుకాణం సిబ్బంది

### ■ మాస్కులకు మస్తు డిమాండ్

కరోనా కలకలంతో హైదరాబాద్‌లో మాస్కులకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో రోగులు, వారి సహాయకులు, వైద్యసిబ్బంది మాస్కులు ధరిస్తున్నారు. జనసాంద్రతగల ప్రదేశాలు, కళాశాలలు, పాఠశాలలు, జాతర్లలో మాస్కులు ధరిస్తున్నారు. కరచాలనం వద్దు.. నమస్కారమే శ్రేయస్కరమంటూ అన్ని ఉద్యోగ, వ్యాపార, పారిశ్రామికసంస్థలు ఉద్యోగులకు, తమ కస్టమర్లకు పోస్టర్లద్వారా అవగాహన కల్పిస్తున్నాయి.

### ■ కరోనా బులెటిన్..

గాంధీ దవాఖానలో మంగళవారం వరకు 155 మందికి కరోనా వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపారు. వారిలో ఒకరికి పాజిటివ్ అని నిర్ధారణ కాగా, 118 మందికి లక్షణాల్లేవని తేలింది. మరో 36 మందికి సంబంధించిన రిపోర్టులు రావాల్సి ఉన్నది. కొవిడ్-19ను ముందస్తుగా గుర్తించే ప్రక్రియలో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 18,224 మందికి థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించినట్టు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక బులెటిన్‌లో వెల్లడించింది.

### ■ 15% తగ్గిన విమానయానం

కరోనా వైరస్ ప్రభావం శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంపై పడింది. రెండురోజులుగా విమాన ప్రయాణికులు 15% తగ్గినట్టు విమానాశ్రయవర్గాలు తెలిపాయి. విమానాలు రద్దుకాకపోయినా ప్రయాణికులు కొంతవరకు తగ్గారని ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి. కాగా, కరోనా కేసు వెలుగుచూడటంతో ఎయిర్‌పోర్ట్‌లోని విదేశీ టర్మినల్‌లో థర్మల్ స్క్రీనింగ్ సెంటర్లను ఒకటి నుంచి నాలుగుకు పెంచారు. కరోనా వైరస్ నేపథ్యంలో ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ తన సిబ్బందిని నెల రోజులు వేతనం లేని సెలవు తీసుకోవాలని కోరింది.

## కామారెడ్డిలో కరోనా అనుమానితుడు?

**కామారెడ్డి, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ సోకిందనే అనుమానంతో కామారెడ్డి నుంచి ఓ వ్యక్తిని గాంధీ దవాఖానకు తరలించారు. ఇటీవల దుబాయ్ నుంచి వచ్చిన అతడు 20రోజులపాటు కామారెడ్డిలోని ఓ దవాఖానలో చికిత్స పొందాడు. అయినా జ్వరం తగ్గకపోవడంతో కరోనా వైరస్ సోకిఉండవచ్చనే అనుమానంతో మంగళవారం గాంధీకి వైద్యులు రెఫర్ చేశారు. అతడి వివరాలను వైద్యులు గోప్యంగా ఉంచారు. ఈ విషయమై డీఎంహెచ్‌వోను వివరణ కోరగా అలాంటిదేదీ తమదృష్టికి రాలేదని తెలిపారు.

# ఔషధ ఎగుమతులు బంద్

**పారాసిటమాల్, మరో 25 రకాల ఉత్పత్తులపై ఆంక్షలు**

**కరోనా వైరస్ కేసులతో కేంద్రం అప్రమత్తం**

**న్యూఢిల్లీ:** దేశంలోనూ కరోనా వైరస్ కేసులు నమోదవుతుండటంతో మోదీ సర్కారు అప్రమత్తమైంది. పారాసిటమాల్, మరో 25 ఇతర ఔషధాల ఎగుమతులపై మంగళవారం ఆంక్షలు పెట్టింది. ఎక్కడా, ఎటువంటి మందుల కొరత రాకుండా కనీస ఔషధాల ఎగుమతుల్నీ ఆపేయాలని నిర్ణయించింది. అలాగే మెట్రోనిడజోల్ వంటి యాంటీబయాటిక్స్, బ్యాక్టీరియా, వివిధ ఇన్ఫెక్షన్ల బారినపడకుండా వినియోగించే పలు రకాల మందులు, విటమిన్ బీ1, బీ6, బీ12 ఆధారిత ఔషధాలపైనా తక్షణమే ఆంక్షలు అమల్లోకి వస్తాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ప్రకటించింది. టినిడజోల్, సైక్లోవియర్, ప్రొజెస్టిరాన్, క్లోరాఫెనికాల్, ఆర్నిడజోల్, నియోమైసిన్, సిలిండమైసిన్ సాల్ట్స్ ఫార్ములేషన్లపైనా ఆంక్షలు వర్తిస్తాయి. కరోనా తీవ్రత దృష్ట్యా ఫిబ్రవరిలోనే 12 ఏపీఐలు, ఫార్ములేషన్ల ఎగుమతులపై ఆంక్షలు విధించాలని డీజీఎఫ్‌టీని ఔషధశాఖ కోరింది. పరిస్థితులు మరింత దిగజారుతున్న సంకేతాలు రావడంతో ఇప్పుడు ఏకంగా 26 రకాల ఏపీఐలు, ఫార్ములాలపై ఆంక్షల్ని తెచ్చారు.



### తయారీలో మనమే టాప్ అయినా..

నిజానికి జనరిక్ ఔషధాల తయారీలో భారత్‌దే అగ్రస్థానం. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న జనరిక్ ఔషధాల సరఫరాలో భారత్ వాటా 20 శాతంగా ఉన్నది. అయితే వీటి తయారీకి కావాల్సిన ముడి పదార్థాల్లో మూడింటా రెండు వంతులు చైనా నుంచే వస్తున్నాయి. కానీ కరోనా వైరస్ గుప్పిట్లో ఉక్కిరిబిక్కిరి అవుతున్న చైనా.. ఇప్పుడు వీటిని ఇతర దేశాలకు సరఫరా చేయలేని దుస్థితిలో ఉన్నది. కర్మాగారాలన్నీ మూతబడటంతో అక్కడ ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ క్రమంలో దేశంలో నమోదవుతున్న కరోనా కేసులు.. కేంద్ర ప్రభుత్వాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. అందుకే ఔషధ ఎగుమతులపై ఆంక్షలను తెచ్చారు.

# ఫికర్ మత్ కరోనా!

మొదటిపేజీ తరువాయి...

పరీక్షలు, ముందుజాగ్రత్త చర్యలు, ప్రజల్లో అవగాహన కల్పించడంవంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. కరోనా వైరస్ సోకితే చనిపోతారన్న ప్రచారంలో వాస్తవం లేదని, గతంలో వ్యాపించిన వైరస్‌లతో పోల్చితే.. కొవిడ్ వైరస్ ద్వారా మరణాలరేటు చాలా తక్కువ అని వివరించారు. వ్యాధి లక్షణాలున్న వారి సహాయార్థం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించారు. ప్రజలను చైతన్యం చేసేలా సమాచార, ప్రసారశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని.. తెలుగు, ఆంగ్ల, ఉర్దూ భాషల్లో కరోనా వైరస్‌పై అవగాహన కల్పించే సమాచారం అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర పట్టణాల్లో కరోనాపై అవగాహన కల్పించేందుకు హోర్డింగులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. వైరస్‌పై ఎవరైనా దుష్ప్రచారం చేస్తే కఠినచర్యలు తీసుకోవాలని కేటీఆర్, ఈటల, ఎర్రబెల్లి సూచించారు.



కరోన్ వైరస్ నేపథ్యంలో ఎంసీఆర్‌హెచ్చార్డీలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు ఎర్రబెల్లి, ఈటల, సీఎస్ సోమేశ్‌కుమార్ కూడా ఉన్నారు.

### అధిక ఉష్ణోగ్రతలో వైరస్ వ్యాపించదు

కరోనా వైరస్ ఉష్ణోగ్రత తక్కువ ఉన్నచోట మాత్రమే జీవించే ఆస్కారం ఉంటుందని.. మనవద్ద ఉష్ణోగ్రతలు అధికంకావడంతో అది వ్యాప్తిచెందే అవకాశం చాలా తక్కువ ఉంటుందని మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. ఈ వైరస్ సోకినవారిలో ఇప్పటివరకు 3 శాతం మరణాలు కూడా లేవని వివరించారు. మంత్రివర్గ ఉపసంఘం సమావేశం అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. వైరస్ పాజిటివ్‌గా తేలిన యువకుడికి గాంధీలో చికిత్స అందిస్తున్నారని.. అతడి పరిస్థితి నిలకడగా ఉన్నదని తెలిపారు. యువకుడు తిరిగిన ప్రదేశాల్లో 88 మంది వ్యక్తులను గుర్తించామని.. వారిలో 45మందిని గాంధీకి రప్పించి నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నామని వెల్లడించారు. మిగిలినవారికి కూడా పరీక్షలు చేయిస్తామన్నారు. ఈ వైరస్‌పై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్, ఆ శాఖ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, మాస్కులు సరఫరా చేయాలని కోరామని ఈటల వెల్లడించారు.

### రాష్ట్రవ్యాప్తంగా 3 వేల బెడ్లు..

కొవిడ్-19 ఐసోలేషన్ సేవల ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 3 వేల బెడ్లను అందుబాటులోకి తెస్తున్నట్టు మంత్రి ఈటల చెప్పారు. ఫీవర్, చెస్ట్ దవాఖానలతోపాటు మిలిటరీ, వికారాబాద్ దవాఖానల్లో ఐసోలేషన్ వార్డుల్లో 800 బెడ్లను అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని పలు బోధనా సుపత్రుల్లో 2,200 బెడ్లు సిద్ధం చేస్తామన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్టు అనుమానం వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని ప్రజలకు మంత్రి సూచించారు.

### గాలిద్వారా వ్యాపించదు

కొవిడ్-19 గాలిద్వారా వ్యాపించదని మంత్రి ఈటల స్పష్టంచేశారు. కరోనావైరస్ ఉన్నవారు మాట్లాడుతున్నప్పుడు తుంపర్లు ఇతరులపై పడితే వైరస్ వ్యాప్తిచెందే అవకాశం ఉంటుందని.. బస్సులు, రైళ్లలో ప్రయాణిస్తే ఇతరులకు వ్యాపించదని తెలిపారు. కొవిడ్-19 హెల్ప్‌లైన్ నంబర్ 104 ఏర్పాటుచేసినట్టు చెప్పారు. కొంతకాలం షేక్‌హ్యాండ్స్ ఇవ్వొద్దని.. సన్నిహితులు, బంధువులు కలిస్తే నమస్కారం మాత్రమే చేయాలని సూచించారు. ఇతరదేశాల్లో అనుసరిస్తున్న జాగ్రత్తచర్యలపై అధ్యయనం చేస్తున్నామని.. కేరళకు ప్రత్యేక వైద్యబృందాన్ని పంపనున్నామని తెలిపారు. కొవిడ్‌పై భయాందోళనలు తొలగించే బాధ్యత మీడియాపై ఉన్నదన్నారు. కొవిడ్-19 విస్తరించే అవకాశం ఉన్నందున బహిరంగప్రదేశాల్లో తిరిగేవారు చాలా జాగ్రత్తగా ఉండాలని, చేతిలో దస్తీ, ముఖానికి మాస్కులు ధరిస్తే మంచిదని చెప్పారు. ఈ సమయంలో విదేశీ ప్రయాణాలను సాధ్యమైనంతవరకు వాయిదా వేసుకోవడమే ఉత్తమమని ప్రజలకు మంత్రి సూచించారు.



రాష్ట్రంలో కరోనా వైరస్ కేసు వెలుగు చూడటంతో కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు ముఖాలకు మాస్కులు ధరించిన యువత



గాంధీ దవాఖానలో ఏర్పాటుచేసిన కరోనా హెల్ప్ డెస్క్

### గాంధీలో మరో 32 మందికి పరీక్షలు

కరోనా వైరస్‌ను కట్టడిచేసేందుకు గాంధీ దవాఖానతోపాటు నల్లకుంట ఫీవర్, ఎర్రగడ్డ చెస్ట్, ఉస్మానియా దవాఖానల్లో ప్రభుత్వం వైద్యులను అప్రమత్తంచేసింది. వైద్య సిబ్బంది సెలవులను రద్దుచేసింది. ప్రత్యేక ఐసోలేషన్ వార్డుల్లో మరిన్ని అత్యాధునిక సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. కేంద్ర వైద్య బృందంతోపాటు ప్రత్యేకశిక్షణ పొందిన నగర వైద్యబృందాలు 24 గంటలు ఆయా దవాఖానల్లో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్టు గాంధీ దవాఖాన కరోనా విభాగం నోడల్ అధికారి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మరో 34 మంది అనుమానితులు ముందు జాగ్రత్తగా ఆశ్రయించగా.. పరీక్షలు నిర్వహించినట్టు వెల్లడించారు. ఫీవర్ హాస్పిటల్‌లో 40, గాంధీలో 40, ఎర్రగడ్డ ఛాతి దవాఖానలో 20, ఉస్మానియాలో 10 పడకల సామర్థ్యంగల ఐసోలేషన్ వార్డులను ఏర్పాటుచేసినట్టు వైద్యశాఖాధికారులు తెలిపారు. గాంధీ వైద్య కళాశాలలోని వైరాలజీ విభాగంలో నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని, 5 నుంచి 8 గంటల్లోనే రిపోర్టులను వెల్లడిస్తున్నామని వివరించారు.

### బాధితుడి ఇంటి పరిసరాలు శుభ్రం

హైదరాబాద్‌లో కరోనా పాజిటివ్ నమోదుతో అది వ్యాప్తిచెందకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నది. గాంధీలో చేరిన బాధితుడి ఇంటి పరిసరాలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది శుభ్రంచేశారు. ఆ కాలనీకి ఆరు కిలోమీటర్ల పరిధిలో అన్ని కాలనీలను శుభ్రంచేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఫాగింగ్ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మూడురోజులు దాటి జలుబు, జ్వరం ఉంటే వెంటనే గాంధీ దవాఖానలో పరీక్షలు చేయించుకోవాలని వైద్యఅధికారులు సూచించారు.

# యాదాద్రిలో ఘనంగా ఎదుర్కోలు



మంగళవారం రాత్రి యాదాద్రిలో స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామికి వరపూజ, వధువు లక్ష్మీదేవికి పూలుపండ్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టువస్త్రాలు.. వజ్రవైఢూర్యాలు ధరించిన పంచనారసింహుడు అశ్వవాహనంపై మండపానికి చేరుకున్నారు. అప్పటికే లక్ష్మీదేవి ముగ్ధమనోహర రూపంతో ముత్యాల పల్లకీపై ఆసీనురాలై ఉంది. ఎదురెదురుగా కూర్చున్న శ్రీవారు, లక్ష్మీ అమ్మవార్ల పెండ్లిచూపుల తంతును అర్చక బృందం, వేదపండితులు నిర్వహించారు. ఈ వేడుకలో కలెక్టర్ అనితారామచంద్రన్, ఆలయ ఈవో ఎన్ గీత, అనువంశిక ధర్మకర్త బీ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**నేడు కల్యాణోత్సవం**

బుధవారం తిరుకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఉదయం బాలాలయంలో జరిగే కల్యాణోత్సవానికి హాజరై స్వామివారు, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

**టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ**

టీటీడీ పంపించిన పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను టీటీడీ బోర్డు సభ్యులు కే శివకుమార్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఈవో హరినాథ్ సమర్పించారు. కాగా మంగళవారం ఉదయం స్వామివారు జగన్మోహిని అలంకారంలో దర్శనమిచ్చారు.



యాదాద్రీశుడికి టీటీడీ పట్టువస్త్రాలను ఈవో గీత, అనువంశిక ధర్మకర్త బీ నర్సింహమూర్తిలకు అందజేస్తున్న బోర్డు సభ్యులు శివకుమార్, డిప్యూటీ ఈవో హరినాథ్ తదితరులు



## నేటినుంచి ఇంటర్ పరీక్షలు

- ఆత్మవిశ్వాసంతో రండి: మంత్రి సబిత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 9.65 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఇంటర్‌బోర్డు కార్యదర్శి తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 8.45 గంటలకు తమకు కేటాయించిన సీట్లో కూర్చోవాలి. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షలకు అనుమతి ఉండదు. ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి విద్యార్థులకు సూచించారు. భయం, ఆందోళన, ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు.. ఇంటర్‌బోర్డు నియమించిన సైకాలజిస్టులను ఫోన్‌లో సంప్రదించి తగిన సలహాలు తీసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

## 8 నుంచి జేఈఈ దరఖాస్తుల సవరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా ఏప్రిల్‌లో జరిగే జేఈఈ మెయిన్ పరీక్షల దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఈ నెల 8 నుంచి 12 వరకు గడువు విధించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని జేఈఈ మెయిన్ అధికారిక వెబ్‌సైట్‌లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది

## గవర్నర్‌తో కాళోజీ వర్సిటీ వీసీ భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టీ వెంకటేశ్వర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే ప్రవీణ్‌కుమార్ మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను కలిశారు. వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలతోపాటు విద్యావ్యాప్తి కోసం చేపడుతున్న చర్యలను వారు గవర్నర్‌కు వివరించారు. వర్సిటీ తరపున రాజ్‌భవన్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం 4,000 నోట్‌బుక్‌లను గవర్నర్‌కు అందజేశారు.

**గవర్నర్‌ను కలిసిన మహిళా నాయకులు**

మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం పలువురు మహిళా నాయకులు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 'జనని' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి, కార్యదర్శి శైలజ, టీఆర్‌ఎస్ నాయకురాలు కాంచన పద్మ తదితరులు గవర్నర్‌ను కలిసినవారిలో ఉన్నారు.

# సాగర్ ఎడమకాల్వకు పునర్జీవం

**1700 కోట్లతో 96 టీఎంసీల కృష్ణా, గోదావరిజలాల వినియోగానికి ప్రణాళిక**

సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వ ఆధారంగా అలైన్‌మెంట్ ■ ప్రభుత్వానికి విశ్రాంత ఇంజినీర్ల సంఘం నివేదిక



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాగార్జునసాగర్ ఎడమకాల్వ పునర్జీవానికి తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం (ట్రీ) రూ.1700 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. దాదాపు 6.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు శాశ్వత నీటి భరోసా కల్పించేలా రూపొందించిన నివేదికను ప్రభుత్వానికి ట్రీ సమర్పించింది. సీతారామ ఎత్తిపోతల పథకంలోని ప్రధాన కాల్వను ఆధారం చేసుకొని ఈ పునర్జీవ పథకానికి రూపకల్పనచేసిన దరిమిలా తక్కువ ఖర్చుతోనే బహుళ ప్రయోజనాలు పొందవచ్చని నివేదికలో ట్రీ పేర్కొన్నది. ఈ పథకంతో మున్నేరు జలాల్ని కూడా వినియోగంలోకి తీసుకురావచ్చని చెప్తున్నారు. కృష్ణానదిపై ఎగువన కర్ణాటక ఇతర పలు ప్రాజెక్టులు నిర్మించడం, శ్రీశైలంపై ఏపీ పలు సాగునీటి ప్రాజెక్టులు రావడంతో కృష్ణాజలాల వినియోగం భారీస్థాయికి చేరింది. దీంతో నాగార్జునసాగర్ ఆయకట్టు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో సాగర్ ఎడమకాల్వ కిందున్న ఆయకట్టుకు గోదావరిజలాలతో శాశ్వత భరోసా కల్పించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. ఇందుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరిజలాల తరలింపును చేపట్టారు. ఖమ్మం జిల్లా దుమ్ముగూడెం నుంచి గోదావరి జలాలను తరలించి పాలేరు దిగువన ఉన్న సాగర్ ఎడమకాల్వ కింద ఆయకట్టును స్థిరీకరించనున్నారు. మూడుదశల్లో గోదావరిజలాలను ఎత్తిపోసేలా రూపొందించిన ఈ ప్రాజెక్టుపనులు వేగంగా సాగుతున్నాయి. సీతారామ ప్రాజెక్టులోని పంప్‌హౌజ్‌లు, ప్రధానకాల్వలను వినియోగించుకొని సాగర్ ఎడమకాల్వకు పునర్జీవం కల్పించేందుకు విశ్రాంత ఇంజినీర్లు ఒక నివేదికను రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించారు.

**96 టీఎంసీల జలాల వినియోగం**

సీతారామ ప్రధానకాల్వ నుంచి పాలేరు జలాశయానికి గోదావరిజలాలను తరలించేందుకు టన్నెల్‌సహా 208 కిలోమీటర్లకుపైగా కాల్వనిర్మాణం చేపట్టాల్సి ఉన్నది. అయితే ట్రీ నివేదిక ప్రకారం, 21ఎల్ కాల్వను 4.70 కిలోమీటర్ వద్దనే ముగించి 5500 క్యూసెక్కుల గోదావరిజలాల్ని నేరుగా నాగార్జునసాగర్ ఎడమకాల్వ (21వ ఎంబీసీ)లో 41.390 కిలోమీటర్ వద్ద నిర్మించే క్రాస్ రెగ్యులేటర్ వద్ద పోస్తారు. అనంతరం 21వ ఎంబీసీ ఎగువలోనే మూడుదశల్లో నీటిని వెనుకకు ఎత్తిపోయడం ద్వారా జలాలు పాలేరు రిజర్వాయర్‌లోకి చేరుతాయి. తిరిగి పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ ఎడమకాల్వలోనే మరో మూడుదశల్లో ఎత్తిపోతలద్వారా నల్లగొండ జిల్లాలోని దేవులపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీటిని తరలిస్తారు. అదేవిధంగా మున్నేరు మీద ఒక బరాజ్‌ను నిర్మించి మరో లిఫ్టుద్వారా ఆ జలాల్ని కూడా 21వ ఎంబీసీలో పోయడంవల్ల 72 టీఎంసీల గోదావరి జలాలతోపాటు 24టీఎంసీల మున్నేరు నీటిని కూడా వినియోగించుకోవచ్చని ట్రీ ప్రతినిధులు ఆ నివేదికలో పేర్కొన్నారు.

**వాస్తవ అంచనా రూ.2700 కోట్లు**

సీతారామ ఎత్తిపోతల పథకం అలైన్‌మెంట్ ప్రకారం ప్రధానకాల్వ నుంచి పాలేరు జలాశయానికి గోదావరి జలాలు తరలించేందుకు టన్నెల్‌తో సహా 104 కిలోమీటర్లకుపైగా కాల్వలను, ఇతర నిర్మాణాలను చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు రూ. 2700 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా. కానీ తాజా ప్రతిపాదనవల్ల వాటి నిర్మాణాల అవసరం ఉండదు. సీతారామ కింద చేపట్టాల్సిన నిర్మాణాలను మినహాయించడం వల్ల రూ.వెయ్యి కోట్లు ఆదా అవుతాయి. దీంతో సాగర్ పునర్జీవన పథకానికి రూ.1700 కోట్ల వరకు ఖర్చుకాగలదని ట్రీ తన నివేదికలో తెలిపింది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని ట్రీ ప్రధాన కార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి చెప్పారు.

## రేపు తేలికపాటి వానలు

- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వాయవ్య మధ్యప్రదేశ్ దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. బంగాళాఖాతం మీదుగా తుఫాన్ వ్యతిరేక గాలులు వీస్తున్నాయి. గాలుల ప్రభావంతో వచ్చే 24 గంటల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. రాష్ట్రంలో ప్రధానంగా దక్షిణ, నైరుతి దిశలనుంచి గాలులు వీస్తున్నాయని, తద్వారా గురువారం ఉత్తర తెలంగాణలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వానలు కురిసే అవకాశమున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆదిలాబాద్, హైదరాబాద్, జగిత్యాల, భద్రాద్రి-కొత్తగూడెం, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని పలుప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 35.5 నుంచి 37 డిగ్రీల వరకు నమోదైనట్టు టీఎస్‌డీపీ ప్లానింగ్ విభాగం తెలిపింది.

**గ్రేటర్‌లో స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు**

ఉపరితల ఆవర్తన ద్రోణి కొనసాగుతుండటంతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. సోమవారం నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 33.6 డిగ్రీలుండగా.. మంగళవారం 0.2 డిగ్రీలు తగ్గి 33.4 డిగ్రీలుగా రికార్డయింది. కనిష్ఠ ఉష్ణోగ్రత 21.7 డిగ్రీలు ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## 13 జిల్లాల్లో అధికవర్షపాతం

- రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం 9.70
- జనవరితోపోలిస్తే 0.15 మీటర్లు తగ్గుదల
- భూగర్భ జలవనరులశాఖ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఫిబ్రవరి ముగిసేనాటికి సాధారణం కంటే 14 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. ఈ మేరకు భగర్భజలవనరులశాఖ మంగళవారం ఫిబ్రవరి నెల వర్షపాతం, భూగర్భజల మట్టాల వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలోని వనపర్తి, కామారెడ్డి, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, నారాయణపేట, సిద్దిపేట, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్ (అర్బన్) జిల్లాల్లో సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్రసరాసరి భూగర్భ నీటిమట్టం 9.70 మీటర్లుగా నమోదైంది. గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే భూగర్భ జలమట్టం 4.86 మీటర్ల పెరుగుదల నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 0.15 మీటర్ల భూగర్భజలాల పెరుగుదల నమోదైంది. అదే విధంగా జనవరితో పోలిస్తే 0.82 మీటర్ల తగ్గుదల నమోదైంది. భూగర్భజలాల తగ్గుదలలో వరంగల్ గ్రామీణ జిల్లాలో -0.05, అత్యధికంగా జోగులాంబ గద్వాల జిల్లాలో -2.34 మీటర్లుగా నమోదైంది.

# సమస్యలపై శాఖలవారీ నివేదిక

- మంత్రి తలసాని ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జిల్లాలవారీగా పశుసంవర్ధకశాఖలో నెలకొన్న సమస్యలపై సమగ్ర నివేదికను రూపొందించాలని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. నివేదికను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుచేయించేందుకు కృషిచేస్తానని చెప్పారు. పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖల కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనితా రాజేంద్ర మంగళవారం మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి తలసాని మాట్లాడుతూ.. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని కార్యదర్శికి సూచించారు. కేంద్ర పశుసంవర్ధకశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను అభినందించినట్టు తెలిపారు.

**గొర్రె పిల్లల విలువ రూ.3,189 కోట్లు**

2017 జూన్‌లో ప్రారంభించిన ఈ పథకం కింద 76.92 లక్షల గొర్రెలను పంపిణీ చేయగా.. వాటికి 70.88 లక్షల పిల్లలు జన్మించాయని మంత్రి తెలిపారు. వీటి విలువ సుమారు రూ.3,189 కోట్లు ఉంటుందన్నారు. పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు రైతులకు పాడిగేదెలను పంపిణీచేయడంతోపాటు లీటర్ పాలకు రూ.4 చొప్పున ప్రోత్సాహకం అందిస్తున్నట్టు చెప్పారు. విజయ డెయిరీకి పాల సేకరణను పెంచడంపై ప్రత్యేకంగా దృష్టిసారించడంతోపాటు విజయ డెయిరీ ఉత్పత్తుల విక్రయాలను మరింత పెంచేందుకు తగిన చర్యలు చేపట్టాలని, మరిన్ని ఔట్‌లెట్ల ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో 150 మొబైల్ ఫిష్ ఔట్‌లెట్లు మత్స్యకారుల సంక్షేమం కోసం ఈ ఏడాది 64 కోట్ల చేపపిల్లలు, 3.5 కోట్ల మంచి నీటి రొయ్య పిల్లలను ఉచితంగా విడుదలచేశామని, మత్స్యసంపదను విక్రయించుకోవడానికి సబ్సిడీపై వాహనాలు, వలలు అందజేశామని చెప్పారు. సమావేశంలో మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, సీఈవో మంజువాణి, పశుసంవర్ధకశాఖ అదనపు డైరెక్టర్ రాంచందర్, విజయ డెయిరీ అధికారులు మల్లయ్య, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

## అగ్గితెగులుపై అప్రమత్తం

- శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి: వ్యవసాయశాఖ కార్యదర్శి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరిపంటకు సోకిన అగ్గితెగులును అరికట్టేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలు సిఫారసుచేసిన నివారణ చర్యలను పాటించాలని వ్యవసాయశాఖ రైతులను సూచిస్తున్నది. అగ్గితెగులు నివారణపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి మంగళవారం విస్తరణ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా యాసంగిలో రైతులు 37,42,588 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగుచేశారు. ఈ పంట వివిధ దశలో ఉన్నది. రాష్ట్రంలోని కొన్నిజిల్లాలో వరికి అగ్గితెగులు సోకినట్టు వ్యవసాయాధికారులు గుర్తించారు. ఇతర ప్రాంతాలకు ఈ తెగులు వ్యాపించే అవకాశం ఉండటంతో.. వ్యవసాయ విస్తరణాధికారులు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అందుబాటులోఉండి రైతులకు చీడపీడల యాజమాన్యంపై అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.

**అగ్గితెగులును అరికట్టేందుకు శాస్త్రవేత్తల సూచనలు**

- పంటలో కొంతకాలంపాటు నైట్రోజన్ ఎరువులను వేయడం ఆపాలి. తెగులును పూర్తిగా నివారించాక సిఫారసుచేసిన మోతాదులో మాత్రమే వాడాలి.
- పొలంలో, గట్లపైన గడ్డిజాతుల కలుపు మొక్కలను తీసేయాలి.
- మొక్కల్లో రోగనిరోధకశక్తిని పెంచేందుకు పొలం దమ్ము సమయంలో ఓ సారి, చిరుపొట్టదశలో మరోసారి పొటాష్ ఎరువును మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరానికి 10-15 కిలోలు రెండుదఫాలుగా వాడాలి.
- తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్, మాంకోజెట్ మిశ్రమ మందును 2.5 మిల్లీలీటర్లు, లీటరు నీటికికలిపి పిచికారి చేయాలి. లేదా కసుగామైసిన్ లీటరునీటిలో 2.5 మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేసుకోవాలి. తెగులు ఉధృతిని గుర్తించి ఏడు నుంచి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు ఈ మందులు పిచికారి చేయాలి.

## చిన్నారి శరీరం నుంచి సూదులు తొలిగింపు



శస్త్రచికిత్స ద్వారా తొలిగించిన సూదులు.. బాలుడు లోకనాథ్

**వనపర్తి వైద్యం:** మూడేండ్ల చిన్నారి శరీరం నుంచి ఎనిమిది సూదులను వైద్యులు తొలిగించారు. మొత్తం పది సూదులు ఉండగా .. ఎనిమిందింటిని శస్త్రచికిత్సచేసి తీశారు. వనపర్తి జిల్లా వీపనగండ్లకు పెబ్బేటి అశోక్‌కుమార్, అన్నపూర్ణ దంపతుల కుమారుడు లోకనాథ్.. తీవ్రనొప్పితో ఏడుస్తుండగా సోమవారం కుటుంబసభ్యులు వనపర్తిలోని దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఎక్స్‌రేతీసి శరీరంలో 10 సూదులు ఉన్నట్టు గుర్తించారు. మంగళవారం వనపర్తిలోని సుధ నర్సింగ్ హోంలో వైద్యులు బాలుడికి శస్త్రచికిత్సచేసి ఎనిమిది సూదులను తొలిగించారు. బాలుడి శరీరంలో ఇంకా రెండు సూదులు ఉన్నాయని, అవి మలం ద్వారా బయటకు వచ్చే అవకాశం ఉన్నదని వైద్యులు చెప్పారు. చిన్నారి శరీరంలోకి ఎవరన్నా బలవంతంగా సూదులు గుచ్చారేమోనన్న అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## కాంట్రాక్టరు బాధ్యతపై మోటర్ భాగాల దిగుమతి

- ప్రభుత్వాన్ని అనుమతి కోరిన సీతారామ ప్రాజెక్టు అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చైనాలో కరోనా వ్యాధి స్వైరవిహారం చేస్తున్న నేపథ్యంలో ఆ దేశానికి వెళ్లేందుకు ఇంజినీర్లు జంకుతున్నారు. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టులోని మోటర్ల విడిభాగాలను పరీక్షించేందుకు ఏజెన్సీ ప్రతినిధులు, ఇంజినీర్లు చైనా వెళ్లే పరిస్థితులు లేవు. దీంతో పరీక్షలు లేకుండానే నేరుగా విడిభాగాలను దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా ప్రాజెక్టు అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్టరు బాధ్యతపై నేరుగా విడిభాగాలను దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సీఈ నాగేశ్వరరావు తెలిపారు.



అబ్కారీశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో మంగళవారం తెలంగాణ గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) నూతన కార్యవర్గం కలిసింది. వినతిపత్రం సమర్పించింది. మంత్రిని కలిసినవారిలో మోకుదెబ్బ అధ్యక్షుడు నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములుగౌడ్, సత్యగౌడ్, సురేశ్‌గౌడ్, మమత, దేవేందర్‌గౌడ్ ఉన్నారు.

## ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి

- పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి
- ఆర్థికసంఘం చైర్మన్ రాజేశంగౌడ్ సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవాలని, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ రాజేశంగౌడ్ సూచించారు. పంచాయతీరాజ్, పట్టణ సంస్థల బలోపేతం, నిధుల వినియోగంపై మంగళవారం ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశంగౌడ్ మాట్లాడుతూ 2020-2021 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. పంచాయతీరాజ్ సంస్థలకు రూ.1847 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.889 కోట్లు, జీహెచ్‌ఎంసీ మిలియన్ ప్లస్ పట్టణాల కింద రూ. 468 కోట్లు కేటాయించారని వివరించారు. 14వ ఆర్థిక సంఘం లోపాలను 15వ ఆర్థిక సంఘానికి సమగ్రంగా వివరించామని, పూర్తిస్థాయి నివేదిక ఇచ్చామని తెలిపారు. ఈ నివేదికను పరిగణలోకి తీసుకొని జిల్లాలు, మండలాలకు నిధులు కేటాయించారని వివరించారు. సమావేశంలో కమిషన్ సభ్యుడు చెన్నయ్య, మెంబర్ సెక్రటరీ సురేశ్‌చందా ఉన్నారు.

# అనుమతిలేని ప్లాట్లకు నో రిజిస్ట్రేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్టవేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణాభివృద్ధి సంస్థల నుంచి అనుమతి తీసుకోకుండా అభివృద్ధిచేసే లేఅవుట్లలో ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయొద్దని మున్సిపల్ కమిషనర్లు స్పష్టంచేస్తున్నారు. ఈ మేరకు స్థానిక రిజిస్ట్రేషన్‌శాఖలకు లేఖలు రాస్తున్నారు. అక్రమ లేఅవుట్ల జాబితాను కూడా సిద్ధంచేస్తున్నారు. ఎవరైనా తప్పుడు వివరాలతో అనుమతులు తీసుకున్నా.. వాటిని తక్షణమే రద్దుచేసేలా కొత్త చట్టంలో నిబంధనలను పొందుపరిచారు. అనుమతుల్లేకుండా లేఅవుట్లను అభివృద్ధిచేసే డెవలపర్లకు మూడేండ్లు జైలుశిక్ష విధిస్తారు. రిజిస్ట్రేషన్‌శాఖ ప్రకారం లేఅవుట్ విలువలో ఇరవైఐదుశాతం జరిమానా వసూలుచేస్తారు. ఇప్పటికే అక్రమ లేఅవుట్లను అభివృద్ధి చేసినవారు.. కొత్త మున్సిపల్ చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోపు సంబంధిత కమిషనర్లకు దరఖాస్తుచేసుకొని అందులో మౌలిక వసతులను అభివృద్ధి చేయాలి. లేదంటే కమిషనర్లే రంగంలోకిదిగి అందులో అభివృద్ధి పనులు చేపడతారు. దీనికయ్యే ఖర్చును డెవలపర్ నుంచి వసూలుచేస్తారని కొత్త చట్టంలో పేర్కొన్నారు.





గ్రీన్‌ఇండియా చాలెంజ్‌లో భాగంగా నల్లగొండ ఎస్పీ ఏవీ రంగనాథ్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో మూడు మొక్కలు నాటారు. అదనపు ఎస్పీ సీ నర్మద, డీటీసీ అదనపు ఎస్పీ సతీశ్ చొడగిరి, నల్లగొండ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డిలకు గ్రీన్‌చాలెంజ్ విసిరారు.



గ్రీన్‌ఇండియా చాలెంజ్‌లో భాగంగా మంగళవారం ఏపీ గుంటూరు జిల్లాలోని తన నివాసంలో మొక్క నాటుతున్న చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజని

## ఫాస్టాగ్ లేన్‌లోకి వస్తే వడ్డనే!

స్టిక్కర్ లేకుండా వస్తే రెట్టింపు రుసుం ■ చర్యలకు హెచ్‌జీసీఎల్ సిద్ధం





**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఔటర్ రింగ్‌రోడ్డుపై నిబంధనలను అతిక్రమించే వాహనదారుల నుంచి రెట్టింపు రుసుం వసూలుచేయాలని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్/ఔటర్ విభా గం) అధికారులు నిర్ణయించారు. ఇక నుంచి కచ్చితంగా నిర్దేశించిన (డెడికేటెడ్) లేన్‌లోనే వాహనదారుడు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఔటర్‌పై నిత్యం 1.25 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇందులో 50 శాతానికిపైగా ఫాస్టాగ్‌తోనే ప్రయాణిస్తున్నాయి. ఫాస్టాగ్ లేన్‌లోకి మాన్యువల్‌గా నగదు చెల్లిస్తామంటూ వస్తున్న వాహనదారుల సంఖ్య ఇటీవల పెరిగింది. నిర్దేశించిన లేన్‌లోనే వాహనదారులు ప్రయాణించాలని, లేదంటే రెట్టింపు చార్జీలు వసూలుచేస్తామని ఔటర్ విభాగం అధికారులు టోల్‌గేట్ కేంద్రాల వద్ద హెచ్చరిక నోటీసులు అంటించారు. ఈ నెల 15వ తేదీ తర్వాత నుంచి ఫాస్టాగ్ లేన్‌లోకి వచ్చే ఇతరులు కచ్చితంగా అధికరుసుం చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఈ అంశంపై ఒకటి, రెండురోజుల్లో మరింత స్పష్టత ఇవ్వనున్నారు.


**OSMANIA UNIVERSITY, HYDERABAD**
**TSPGECET-2020 NOTIFICATION**
(POST GRADUATE ENGINEERING COMMON ENTRANCE TEST CONDUCTED ON BEHALF OF TSCHE)

Applications are invited for appearing for Post-Graduate Engineering Common Entrance Test (TSPGECET) for admission into M.E/M.Tech./M.Pharm./M. Arch./Graduate Level Pharm. D (P.B.), Full Time courses in University, constituent and Affiliated Engineering, Pharmacy and Architecture Colleges in Telangana State for the Academic Year 2020-2021.

Eligible candidates who wish to apply for TSPGECET-2020 may submit their applications through **online mode only.** Online submission of application will commence from **12-03-2020**. The related information regarding eligibility, syllabi, instructions, procedure for online application and detailed time-table will be available on the website:**https://pgecet.tsche.ac.in/or http://www.tsche.ac.in/**

**Registration Fee:** Rs.1000/- (Rs. 500/- for SC/ST/PH candidates) per candidate per test. In case the candidate wants to appear for more than one test, separate registration fee has to be paid accordingly.

**Examination Dates: 28-05-2020 to 31-05-2020.**

**Mode of Exam:** The Exam will be conducted online only i.e., Computer Based Test (CBT).

The Registration fee should be paid **through payment gateway (Credit Card/Debit Card/Net Banking/TS Online/AP Online).**

Hyderabad, **Sd/-**
Date:04-03-2020 **CONVENER, TSPGECET-2020**

DIPR R.O.No. 772 PP/CL/Advt/1/2019-20 తేది: 03-03-2020



**(రి.నెం. TFD 003 (2014)**
**మహాత్మాగాంధీ మార్క్‌ఫెడ్ భవనము జామ్‌బాగ్, హైదరాబాద్-95**
**ఎన్నికల నోటీసు**
**(రూలు 22 (8ఎ) (VII)**


మార్క్‌ఫెడ్ సభ్యులందరికి ఇందు మూలముగా తెలియపరుచునది ఏమనగా రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ వారిచే మార్క్‌ఫెడ్ పాలకవర్గమునకు ఎన్నికలు తేది: 10-03-2020న జరుపుటకు ఉత్తర్వులు జారీచేయబడినవి ఎన్నికల కార్యక్రమము ఈ క్రింది విధముగా ఉన్నది.

| క్ర.సం. | తేది మరియు సమయం | కార్యక్రమము | స్థలము |
|---|---|---|---|
| 1 | 07-03-2020 ఉ. 8.00 గం. నుండి మ. 1.00 గం. వరకు | నామినేషన్ల స్వీకరణ | బోర్డ్ మీటింగ్ రూం తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లి. (మార్క్‌ఫెడ్) |
| 2 | 07-03-2020 మ. 1.30 గం. నుండి మ. 3.00 గం. వరకు | నామినేషన్ల పరిశీలన | బోర్డ్ మీటింగ్ రూం తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లి. (మార్క్‌ఫెడ్) |
| 3 | 07-03-2020 మ. 3.30 గం. నుండి సా. 5.00 గం. వరకు | నామినేషన్ల ఉపసంహరణ | బోర్డ్ మీటింగ్ రూం తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లి. (మార్క్‌ఫెడ్) |
| 4 | 10-03-2020 ఉ. 8.00 గం. నుండి మ. 1.00 గం. వరకు | పోలింగ్ | పి.జి. లా కాలేజి బషీర్‌బాగ్, హైదరాబాద్-01 |
| 5 | 10-03-2020 మ. 2.00 నుండి | ఓట్ల లెక్కింపు | పి.జి. లా కాలేజి బషీర్‌బాగ్, హైదరాబాద్-01 |
| 6 | 10-03-2020 ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తరువాత | ఫలితముల ప్రకటన | పి.జి. లా కాలేజి బషీర్‌బాగ్, హైదరాబాద్-01 |

**నోటు:** నామినేషన్ పత్రములు (ఫారమ్-II) ఎన్నికల అధికారి నుండి పొందవచ్చును. ఇతర వివరములకు ఎన్నికల అధికారిని సంప్రదించగలరు.

తేది: 04-03-2020 **సం/- బి. అరుణ, జాయింట్ రిజిస్ట్రార్/ఎన్నికల అధికారి**
సెల్: 8639352782

DIPR R.O.No. 779 PP/CL/Advt/1/2019-20 తేది: 03-03-2020



మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నరేందర్‌సింగ్ తోమర్‌ను కలిసి రోడ్ల నిర్మాణానికి నిధులివ్వాలని వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్


## రోడ్ల నిర్మాణానికి నిధులు

### కేంద్రమంత్రి తోమర్‌కు రాష్ట్రమంత్రి కొప్పుల వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జగిత్యాల జిల్లాలోని పలు రోడ్లకు నిధులు మంజూరుచేయాలని కోరుతూ రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్.. కేంద్రమంత్రి నరేందర్‌సింగ్‌తోమర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఢిల్లీలో మంగళవారం కేంద్రమంత్రిని కలిసిన కొప్పుల ఇందుకు సంబంధించిన వివరాలను అందజేశారు. జగిత్యాల జిల్లా నుంచి పెద్దపల్లి జిల్లా వరకు 157.90 కిలోమీటర్ల పరిధిలో 44 రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని కోరారు. ఈ విషయాన్ని త్వరలోనే పరిశీలిస్తామని తోమర్ హామీ ఇచ్చినట్టు మంత్రి కొప్పుల తెలిపారు. మంత్రి కొప్పుల ఈశ్వర్.. ఢిల్లీ పర్యటనలో భాగంగా హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ నాగరాజును కూడా కలిసి నిధులు మంజూరుచేయాలని విజ్ఞప్తిచేశారు.

## గల్ఫ్‌లో గొర్రెల కాపరి మృతి

### మంత్రి కేటీఆర్ చొరవతో సొంతూరుకు భౌతికకాయం



దేవయ్య(ఫైల్)

**ముస్తాబాద్:** కుటుంబపోషణ కోసం ఎడారి దేశం వెళ్లి అక్కడే గుండెపోటుతో మృతిచెందిన దేవయ్య మృతదేహం మంత్రి కేటీఆర్ చొరవతో మంగళవారం స్వగ్రామానికి చేరింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన తాడెపు దేవయ్య సౌదీ అరేబియాలో గొర్రెలకాపరిగా పనిచేస్తున్నాడు. ఫిబ్రవరి 11న గొర్రెలు కాస్తూనే గుండెపోటుతో మృతి చెందగా, సహ ఉద్యోగులు సమాచారం ఇచ్చారు. దేవయ్య బంధువైన స్థానిక ప్రజాప్రతినిధి చిప్పలపల్లి సర్పంచి తాడెపు జ్యోతి యెల్లం మంత్రి కేటీఆర్‌కు విషయం తెలిపి సహకరించాలని కోరారు. స్పందించిన మంత్రి అక్కడి రాయబార కార్యాలయం సిబ్బందితో మాట్లాడగా, సోమవారం అర్ధరాత్రి మృతదేహం స్వగ్రామానికి చేరుకున్నది. దేవయ్య భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు సహకరించిన నాయకులు జనగామ శరత్‌రావు, తాడెపు యెల్లం, సురేందర్‌రావు, అంజన్‌రావు, కొమ్ము బాలయ్య, శ్రీనివాస్‌రావు ఇతర నాయకులకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

## క్లోరోపైరిఫాస్‌పై నిషేధం

### ప్రకటించిన పురుగుమందుల పరీక్షా కేంద్రం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మెసర్స్ పీఆర్ ఆగ్రో కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన క్లోరోపైరిఫాస్ 50 శాతం ఈసీ క్రిమిసంహారక పురుగుమందును నిషేధిస్తున్నట్టు రాజేంద్రనగర్‌లోని పురుగుమందుల పరీక్షా కేంద్రం ప్రకటించింది. మంగళవారం ఈ పురుగుమందును పరీక్షించిన అధికారులు నాసిరకంగా ఉన్నట్టు తేల్చారు. ఈ మేరకు సీఏఎస్ 001 బ్యాచ్ నంబర్ కలిగిన (ట్రేడ్ నేమ్ క్లోరోపైరిఫాస్ 50) క్రిమిసంహారక పురుగుమందును నిలువచేయడం, విక్రయించడాన్ని నిషేధించింది.



# బ్రాండ్ తెలంగాణ!

మొదటిపేజీ తరువాయి...

చేసిన టమాటాలు మార్కెట్‌లో విక్రయించగా మిగిలినవాటితో సాస్ తయారుచేస్తారు. మిర్చి పంటను కారంపొడి చేస్తారు. ఏ జిల్లాల్లో ఎటువంటి పంటలు పండుతాయి, తాము ఏ పంటలు వేయాలి అనే విషయం రైతులకు ముందుగానే తెలిసిపోతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో తయారుచేసిన సరుకులను దేశ, విదేశాలకు చెందిన మార్కెటింగ్ ఏజెన్సీలతో విక్రయాలు జరుపుతారు. ఈ ప్రక్రియలో రేషన్ డీలర్లను కూడా భాగస్వాములను చేయనున్నారు. రేషన్‌షాపుల ఈ ఆహార ఉత్పత్తులను పంపిణీ చేస్తారు. ఆయా జిల్లాల్లో పండే పంటల ఆధారంగా స్థానికంగా పరిశ్రమలను నెలకొల్పనున్నారు. దీంతో ఎంతోమందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

రాష్ట్రంలో ఆహార తయారీ కర్మాగారాల ఏర్పాటుతోపాటు వాటిద్వారా దేశ, విదేశాలకు మన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖతో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు ప్రాథమిక నివేదికలను సిద్ధం చేశారు. ఆయా జిల్లాల్లో సాగుచేసే పంటలు, వాటిపై ఆధారపడి నెలకొల్పడానికి అవకాశం ఉన్న పరిశ్రమల జాబితాను సిద్ధంచేశారు. ఏయే జిల్లాల్లో ఎటువంటి ఆహార తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందో ఓ నివేదికను రూపొందించారు.

### పంటలు అమ్ముకునేదెలా?

రాష్ట్రంలో సాగునీటి వనరులు పుష్కలంగా అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో లక్షలాది ఎకరాల్లో లక్షల టన్నుల్లో పంట దిగుబడి జరుగుతున్నది. అయితే ఆశించినస్థాయి కంటే అధిక దిగుబడి వస్తే.. ధర తగ్గుతుంది. ఉల్లి, టమాటా, పసుపు వంటి పంటల విషయంలో అనేకసార్లు ఇది ఉత్పన్నమయింది. రైతులకు అన్ని సమయాల్లో గిట్టుబాటు ధర కచ్చితంగా రావాలనే ఉద్దేశంలో నుంచి వచ్చిందే ఆహార తయారీ కర్మాగారాల (ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు) ఆలోచన. రైతులు పండించిన పంట ఆన్ డిమాండ్ అమ్ముడయ్యేలా ఓ అద్భుత వ్యవస్థను రూపొందిస్తున్నారు.



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మన్నెగూడెంలో నిర్మాణంలో ఉన్న లిపిడ్స్ ప్లాంట్

### మహబూబాబాద్‌లో ప్లాంట్ లిపిడ్స్ పరిశ్రమ

మహబూబాబాద్ జిల్లా కురవి మండల పరిధిలో భారీ ప్లాంట్ లిపిడ్స్ పరిశ్రమ ఏర్పాటవుతున్నది. సుమారు 60 ఎకరాల్లో నెలకొల్పనున్న ఈ ప్లాంట్ లిపిడ్స్ సంస్థ నుంచి రెడ్‌రెజీనా మిర్చిపౌడర్, వంటనూనె, మిరప విత్తనాలు తయారు చేయనున్నారు. దీనికి మహిళా సంఘాలతో ఒప్పందం చేసుకుని రెజీనాకు సంబంధించిన ముడిసరుకును అందించనున్నారు. మహిళా సంఘాలు సాగు చేసిన మిర్చిని ఈ పరిశ్రమకు సరఫరా చేయనున్నారు. దీనికి సంబంధించిన ఒప్పందంలో ప్రీమియంను కూడా ప్రభుత్వమే భరించనుంది.

### పాలమూరు, పాలకుర్తిలో మిల్లెట్స్ పరిశ్రమలు

మహబూబ్‌నగర్ జిల్లాలో చిరుధాన్యాల పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారు. వనపర్తి, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఈ మిల్లెట్స్ పరిశ్రమలను ఏర్పాటుచేసేందుకు ఆయా సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. అదే విధంగా పాలకుర్తిలో కూడా ఇవే పరిశ్రమల ఏర్పాటుకు పలువురు ముందుకొచ్చారు. దీనిని పూర్తిచేసేందుకు మంత్రి ఎర్రబెల్లి దృష్టి సారించారు. ఈ ప్రాంతాల్లో మల్టీపర్పస్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు.

### ఆహార ఉత్పత్తులపై 'తెలంగాణబ్రాండ్'

రాష్ట్రంలో తయారుచేసి, ఎగుమతిచేసే ఆహార ఉత్పత్తులకు బ్రాండ్‌తెలంగాణ ఇమేజ్ రానున్నది. రైతుల నుంచి పంట కొనుగోలు, పరిశ్రమలకు తరలింపు, మార్కెటింగ్, ఆ తర్వాత ఉత్పత్తులను బ్రాండ్ తెలంగాణ పేరుతో విక్రయించడం, ఈ పనులన్నింటినీ మహిళా సంఘాలే నిర్వహించనున్నాయి. అలాగే మన దగ్గర ఏర్పాటు చేసే ఆహార శుద్ధికేంద్రాల నుంచి వచ్చే ఉత్పత్తులను బ్రాండ్ తెలంగాణ పేరుతోనే మార్కెటింగ్ చేయనున్నారు. అంటే టమాట నుంచి సాస్, మిరప నుంచి మిర్చి పౌడర్, మొక్కజొన్న నుంచి బేబీ కార్న్, స్వీట్ కార్న్, ఎండు అల్లం, సీతాఫలాలు, ఇలా పలు యూనిట్లను ఏర్పాటు చేసి, వాటిని బ్రాండ్ తెలంగాణ ఉత్పత్తులను విక్రయించనున్నారు.

### కూరగాయల్లో సక్సెస్

కూరగాయల వ్యాపారంలో మహిళా సంఘాలు ఇప్పటికే విజయం సాధించాయి. రాష్ట్రంలోని 8 జిల్లాల నుంచి కూరగాయలను హైదరాబాద్ కేంద్రంగా విక్రయిస్తున్నారు. దీనితో గత ఆరు నెలల్లో రూ. 1.3 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ కూరగాయలను వాల్‌మార్ట్, మెట్రో సంస్థలకు విక్రయిస్తున్నారు.

### పంటల ఆధారంగా పరిశ్రమలు

ఆయా జిల్లాల్లో సాగుచేస్తున్న పంటలు, దిగుబడి, వాటి నిల్వ, గోదాముల సామర్థ్యంపై అంచనా వేసిన అధికారులు ప్రాథమికంగా ప్రతిపాదనలు రూపొందించారు. పంటకు వస్తున్న గిట్టుబాటు ధర, మార్కెటింగ్ అంశాలను పరిశీలించారు. మొత్తంగా ఆయా ప్రాంతాల్లో సాగుచేస్తున్న వ్యవసాయ ఉత్పత్తులపై ఒక అంచనాకు వచ్చారు. ఆ అంచనాల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో ఆహార తయారీ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు పూనుకుంటున్నారు. జిల్లాల వారీగా ప్రధానంగా పండుతున్న పంటలు, వాటి ఆధారిత పరిశ్రమలపై ప్రాథమిక నివేదికను జిల్లాల వారీగా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు సిద్ధం చేశారు. ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో సంబంధిత పరిశ్రమలను ఏర్పాటుచేసేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని నివేదికల్లో పేర్కొన్నారు. అక్కడ పండించే పంటలు, ఏర్పాటుచేయాల్సిన పరిశ్రమలను ఈ కింది విధంగా సూచించారు.

**మిర్చి ఆధారిత పరిశ్రమలు:** జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, నల్గొండ, పెద్దపల్లి, వరంగల్ రూరల్.
**వేరుశనగ ఆధారిత పరిశ్రమలు:** జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్.
**జొన్నలు:** ఆసిఫాబాద్
**సీతాఫలం:** మహబూబ్‌నగర్
**ఎండుఅల్లం(డ్రై జింజర్):** సంగారెడ్డి
**బత్తాయి:** నల్లగొండ
**చింతపండు:** వికారాబాద్
**కాటన్‌సీడ్ ఆయిల్:** రాజన్న సిరిసిల్ల
**పప్పుదినుసులు:** ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి.
**మామిడి:** జగిత్యాల, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, పెద్దపల్లి.
**మామిడి పచ్చళ్ల పరిశ్రమలు:** నాగర్‌కర్నూల్, జగిత్యాల.
**వివిధరకాల పచ్చళ్ల పరిశ్రమ:** మేడ్చల్ మల్కాజ్‌గిరి
**మామిడి పౌడర్(ఆమ్‌చూర్):** వికారాబాద్
**చిరుధాన్యాల పరిశ్రమలు :** మహబూబ్‌నగర్, వికారాబాద్, ఆదిలాబాద్.
**మొక్కజొన్న ఆధారితం:** వరంగల్ అర్బన్, నిర్మల్, రంగారెడ్డి, సిద్దిపేట
**స్వీట్‌కార్న్, బేబీకార్న్:** కరీంనగర్
**పసుపు ఆధారిత పరిశ్రమలు:** నిజామాబాద్, మహబూబాబాద్, పెద్దపల్లి, వరంగల్ రూరల్
**కూరగాయల ఆధారితం:** కుమ్రంభీం ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి.
**టమాటా ఆధారితం:** కరీంనగర్
**టమాటా సాస్ పరిశ్రమ:** యాదాద్రి భువనగిరి
**సోయాబీన్ ఆధారితం:** నిర్మల్, కామారెడ్డి.
**గోధుమ:** ఆదిలాబాద్
**గోధుమ పిండి పరిశ్రమ:** జనగామ.
**బియ్యం:** యాదాద్రి భువనగిరి
**ముడి బియ్యం:** మెదక్
**రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమలు:** కరీంనగర్, మెదక్.

### ఆరోగ్యం... ఆదాయం

'బ్రాండ్ తెలంగాణ'తో ఇంకా ఎన్నో ఉపయోగాలున్నాయి.

- మన భూమిలో.. మన వాతావరణంలో పండిన పంటలు తింటే ఆరోగ్యం బాగుంటుంది.. ఇది స్వయంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన వాస్తవం.
- మన దగ్గర పండించిన ఉత్పత్తులతోనే మనం తినే ఆహారం తయారు కానున్నది.
- కల్తీలేని ఆహారం అందుతుంది. రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది.
- మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడుతాయి. రేషన్ డీలర్లకు కమీషన్ పెరుగుతుంది.
- ఐకేపీ ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకుంటారు.
- స్థానికంగా ఉద్యోగ అవకాశాలు, వ్యాపార అవకాశాలు పెరుగుతాయి.

## చట్టానికిలోబడే క్యాబినెట్ నిర్ణయం

- చట్టవిరుద్ధమైతేనే న్యాయసమీక్షకు అవకాశం
- విధాన నిర్ణయాల్లో కోర్టు జోక్యానికి అవకాశం లేదు
- సెక్రటేరియట్ అంశంపై ఏజీ బీఎస్ ప్రసాద్ వాదనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ నిర్ణయం చట్టానికి విరుద్ధంగా ఉంటేనే న్యాయసమీక్షకు అవకాశం ఉంటుందని అడ్వకేట్ జనరల్ బండా శివానందప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వం చట్టానికి లోబడి ప్రస్తుత సచివాలయ పాత భవనాలను కూల్చి అదే చోట నూతన సమీకృత భవనాన్ని నిర్మించాలని నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుత భవనాల కూల్చివేతను అడ్డుకోవాలని దాఖలైన పిటిషన్లపై చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ఏజీ వాదనలు వినిపిస్తూ.. నూతన సచివాలయాన్ని నిర్మించాలన్న క్యాబినెట్ నిర్ణయంలో చట్టవిరుద్ధమైన అంశాలు ఏమున్నాయో పిటిషనర్లు నిరూపించలేకపోయారని తెలిపారు. ప్రజాప్రయోజన వ్యాజ్యం ముసుగులో సొంతప్రయోజనాలను నెరవేర్చుకోవాలనుకొనే ఉద్దేశాన్ని కోర్టు గుర్తించాలని కోరారు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వమే ఏ భవనాలు సరైనవి, ఎన్ని నిధులు ఖర్చు చేయాలనే అంశాలను నిర్ణయిస్తుందని తెలిపారు. అశోక్‌కుమార్ పాండే, ఎస్సీ గుప్తా, పాల్కో, తమిళనాడు సచివాలయ తరలింపు కేసు, జల్‌మహల్ రిసార్ట్ వర్సెస్ కేపీ శర్మ, నర్మదా బచావో ఆందోళన్ తదితర కేసుల్లో తీర్పులను ఏజీ హైకోర్టు ముందుంచారు.

### ప్రస్తుత భవనాలు పనికిరావు

ఆధునిక పాలనా విధానానికి అనుగుణంగా భవనాలు లేవని నలుగురు ఈఎన్సీల టెక్నికల్ కమిటీని నిర్ధారించిందని ఏజీ తెలిపారు. మంత్రులు, కార్యదర్శులకు వేర్వేరు భవనాలుండటంతో రహస్య అధికారిక పత్రాల కదలిక ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. 33 జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించేందుకు సరైన వేదిక లేదని పేర్కొన్నారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ సైతం అనుగుణంగా లేవని పేర్కొన్నదని తెలిపారు. సాంకేతిక అంశాలను నిర్ధారించడానికి తాము ఇంజినీర్లమో, ఆర్కిటెక్టులమో కాదని ధర్మాసనం స్పష్టంచేసింది. ఈఎన్సీల కమిటీ రిపోర్ట్‌పై పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి అనుమానం వ్యక్తం చేయగా హైకోర్టు పైవిధంగా వ్యాఖ్యానించింది. సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ, కేంద్ర ఏజెన్సీ లేదా స్వతంత్ర సంస్థలతో భవనాల స్థితిని తేల్చాలని కోరారు. పిటిషనర్లు వాదనలకు సరిపోయినంత సమయం ఇస్తామని పేర్కొన్న ధర్మాసనం, విచారణను గురువారానికి వాయిదావేసింది.

## విభజన సమస్యలపై త్వరలో భేటీ!

### అసెంబ్లీ సమావేశాల తర్వాత సమావేశం

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తర్వాత ఉమ్మడిరాష్ట్ర విభజన సమస్యలపై ఇరురాష్ట్రాల అధికారులు మరోసారి సమావేశం అయ్యే అవకాశం ఉన్నది. సంక్రాంతి ముందు రెండురాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్‌మోహన్‌రెడ్డి ప్రగతిభవన్‌లో భేటీ అయి సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికారులస్థాయిలో సమావేశాలు నిర్వహించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించగా, ఇరు రాష్ట్రాల సీఎస్‌లు జనవరి నెలాఖరున బీఆర్కేభవన్‌లో సమావేశమమై మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. రెండురాష్ట్రాల్లో బడ్జెట్ సమావేశాలు ఉండటంతో అధికారులంతా ఆ పనిలోనే ఉన్నారు. దీంతో బడ్జెట్ సమావేశాల తర్వాత మరోసారి సమావేశమవుదామని అధికారులు నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.



రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ పనులను మంగళ వారం హోంమంత్రి మహమూద్ అలీ పరిశీలించారు. ఆయనతోపాటు డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ అంజనీకుమార్, జాయింట్ సీపీ ఏఆర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. - హైదరాబాద్ నమస్తే తెలంగాణ

## ఏసీబీ కోర్టుకు రేవంత్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఓటుకు నోటు కేసులో ఎంపీ రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్ ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. తమకు ఓటు వేయాలని ప్రలోభానికి గురిచేసేందుకు నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు ఇస్తూ దొరికిపోయిన కేసులో ఎంపీ రేవంత్‌రెడ్డి ఏ-1గా ఉన్నారు. ఈ వ్యవహారంలో మరికొందరిపై కూడా కేసులు నమోదయ్యాయి. 2015 నాటి ఈ కేసులో రేవంత్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్‌చేయగా, ప్రస్తుతం కేసు విచారణకు వచ్చింది. రేవంత్‌రెడ్డి హాజరును నమోదు చేసుకున్న కోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.

# మాధవాపురం మురిసింది

మొదటిపేజీ తరువాయి...

ప్రత్యేకచొరువ తీసుకొని మూడునెలలపాటు భూములను సర్వేచేశారు. రైతులవద్ద భూమికి సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో వాంగ్మూలం తీసుకొన్నారు. చుట్టుపక్కల రైతులను విచారించి నిర్ధారించుకొన్నారు. గ్రామంలోరైతుల సమక్షంలో ఎవరికి ఎంతభూమి ఉన్నట్టు తేలిందో చదివి వినిపించారు. రైతుల వివరాలను కంప్యూటర్‌లో నమోదుచేసి పహాణీలు, 1బీలు వచ్చేలా కృషిచేశారు. రెండురోజుల కిందట 957 మంది రైతుల పాస్‌పుస్తకాలు జిల్లాకు చేరాయి. మంగళవారం వాటిని రైతులకు అందజేసేందుకు ఎమ్మెల్యే శంకర్‌నాయక్, తాసిల్దార్ రంజిత్‌కుమార్ గ్రామానికి వెళ్లారు. రైతులు వారికి ఎదురెళ్లి పూలవర్షం కురిపించారు. భుజాలపై ఎత్తుకొని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం తాసిల్దార్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా 957 మంది రైతులకు పాస్‌పుస్తకాలు అందజేశారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన భూరికార్డుల ప్రక్షాళనతోనే పాస్‌పుస్తకాలు అందాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

### రైతులకు న్యాయం చేశా



పట్టదార్ పాస్‌పుస్తకాలను రైతులకు అందించేందుకు సిబ్బందితో కలిసి నిరంతరం పనిచేశాం. భూములన్నీ సర్వేచేసి రైతుల వాంగ్మూలం తీసుకున్నాం. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగానే పాస్‌పుస్తకాలను అందించాం. ఒకేసారి ఇంతమందికి పాస్‌పుస్తకాలు అందించినందుకు సంతోషంగా ఉంది. నా జీవితంలో ఇదొక మైలురాయిగా నిలిచిపోతుంది.

- రంజిత్‌కుమార్, తాసిల్దార్, మహబూబాబాద్

### సీఎం కేసీఆర్ వల్లే పట్టాలు



సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన భూరికార్డుల ప్రక్షాళనలో వల్లే రైతులకు పాస్‌పుస్తకాలు అందాయి. ఎన్నో ఏండ్లుగా పాస్‌పుస్తకాలు లేక ఇబ్బందులు పడ్డాం. తాసిల్దార్ రంజిత్ కుమార్‌కు రుణపడి ఉంటాం.

- ఇస్లావత్ హర్యా, మాధవాపురం

### చాలా సంతోషం



రైతులపై టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నది. పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నది. సీఎం కేసీఆర్ చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనతోనే పాస్‌పుస్తకాలు అందాయి. చాలా సంతోషంగా ఉన్నది.

-భూక్యా దేవ్లీ, ఇస్లావత్‌తండా

# రేవంతు.. అక్రమతంతు

- భూదందాపై ప్రాథమిక దర్యాప్తు పూర్తి
- ప్రభుత్వ భూమితోపాటు పేదల ప్లాట్లు గల్లంతు
- 18 పేజీలతో సమగ్ర నివేదిక
- క్రిమినల్ చర్యలకు ఆర్డీవో చంద్రకళ సిఫారసు

**హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుల భూదందాలు తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. అధికారుల ప్రాథమిక దర్యాప్తులో రేవంతుడి అక్రమాలు తేటతెల్లమయ్యాయి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి సర్వే నం.127 భూదందాపై రాజేంద్రనగర్ ఆర్డీవో కే చంద్రకళ ప్రాథమిక దర్యాప్తు పూర్తిచేశారు. ఆ సర్వేనంబరును వివాదాల సుడిగుండంగా తేల్చారు. ప్రతి ఉత్తర్వు, ప్రతి పేరు మార్పు వెనుక లోపాలు వెల్లడయ్యాయి. అప్పటి అధికారులు ఆర్వోఆర్ చట్టాలను, నియమాలను పాటించకుండానే రికార్డుల్లో కొనుగోలుచేసిన వారి పేర్లను మార్చినట్టు తేలింది. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల పరిశీలన, ప్రభుత్వ భూములు, బండ్లబాట ఆక్రమణలు, కోమటికుంట బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌ను పరిశీలించి దర్యాప్తుచేసిన ఆర్డీవో.. 18 పేజీల నివేదిక రూపొందించారు. సర్వే నం.127, 128లో లేఅవుట్ చేసి విక్రయించిన ప్లాట్లను తీసుకొంటే మరింత వివాదాస్పదంగా మారే అవకాశం కనిపిస్తున్నది.

### పహాణీల పరిశీలనతో దర్యాప్తు

1954-55 ఖాస్రా పహాణీ, 1955-58 సెస్లా పహాణీ మొదలుకొని ప్రస్తుత పహాణీల వరకు అన్ని విషయాలను ఆర్డీవో పరిశీలించారు. వడ్డె హనుమయ్య నుంచి శ్రీరామజయసింహ వరకు పట్టాదారులతోపాటు అక్రమార్కులను గుర్తించారు. మార్పు,చేర్పులను అధ్యయనం చేశారు. మొన్నటి భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం వరకు ప్రతి ఫైల్‌ను క్షుణ్ణంగా చూసిన తర్వాతే నివేదికను రూపొందించారు. వడ్డె మల్లయ్య పేరు దబ్బా మల్లయ్యగా మార్చి.. జనాన్ని ఏమార్చిన బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు.

- 1998-99, 1999-2000 పహాణీల్లో పట్టాదారు కాలమ్‌లో ఆర్ కళావతి పేరును రౌండప్‌చేసి సంతకం పెట్టారు. ఎలాంటి రిమార్కులు పేర్కొనలేదు. 2001-02లో మళ్లీ చేర్చారు. కారణాలు చూపలేదు.
- 2005లో అప్పటి డిప్యూటీ కలెక్టర్ జారీచేసిన ప్రొసీడింగ్స్ బీ785/2005 ప్రకారం 2.21 ఎకరాలకు ఇ లక్ష్మయ్య తండ్రి మల్లయ్యకు వారసత్వ ధ్రువీకరణ చేశారు. కానీ, వడ్డె మల్లయ్యకు వారసుడిగా ఇ లక్ష్మయ్య ఎలా అయ్యారనే అంశం తేలలేదు. సక్సెషన్ (వారసత్వం) పొందిన ఇ లక్ష్మయ్య నుంచి కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి డాక్యుమెంట్ నం.15504/05 ప్రకారం కొనుగోలు చేశారు. ఆయనకు అప్పటి అధికారులు మ్యుటేషన్ చేసేశారు. ముందుగా రికార్డులు పరిశీలించలేదు. ఇ లక్ష్మయ్య నుంచి కొనుగోలు చేసిన మిగతా వారందరికీ మ్యుటేషన్ చేస్తూ రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.
- ప్రొసీడింగ్స్ నం.బి/222/2011 ప్రకారం ఇ అనిల్‌కుమార్ తండ్రి గాలయ్యకు వారసత్వం కింద 2.30 ఎకరాలు చేశారు. సర్వే నం.127/ఇ గా పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల తర్వాత సర్వే నం.127లో విస్తీర్ణం 13.11 ఎకరాలకు చేరింది. అంటే అసలు కంటే పట్టాదారుల విస్తీర్ణం ఎక్కువైంది.
- 2005, 2011లో పనిచేసిన డిప్యూటీ కలెక్టర్లు ఏ రాజేశ్వర్‌రెడ్డి, జీ సుబ్బారావుతో పాటు 2015 నుంచి 2016 వరకు పనిచేసిన డీ శ్రీనివాస్‌రెడ్డి వరకు ఆర్వోఆర్ చట్టాన్ని, గైడ్‌లైన్స్‌ను పాటించకుండానే మ్యుటేషన్ ఉత్తర్వులు జారీచేసినట్టు తాజా నివేదికలో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే శ్రీనివాస్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటుపడింది.
- సక్రమంగా క్లెయిమ్ చేయని 5.21 ఎకరాలను బోనావెకెన్షియా పరిధిలోకి తీసుకురావాలని నివేదిక స్పష్టంచేసింది.
- సర్వే నం.34లో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమి 1.11 ఎకరాలను, బండ్లబాటను ఆక్రమించుకొని కలిపేసిన 10 గుంటల భూమిని తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్ సర్వే నం. 126లోని 32 గుంటలు, బఫర్ జోన్ కింద 22 గుంటల్లోని నిర్మాణాలను తొలగించనున్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి ప్రహరీ నిర్మించి.. దానిపై ఏ రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి పేర్లు కూడా రాసుకున్నారు.

### ప్లాట్ల యజమానుల పాట్లు

గోపన్‌పల్లిలో రాజోలు నియోజకవర్గ ఎస్సీ మ్యుచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా ప్లాట్ నం.42, 43, 44 (మొత్తం విస్తీర్ణం 643 గజాలు), ప్లాట్ నం.24, 25, 26, 27 (మొత్తం విస్తీర్ణం 1000 గజాలు) కళ్లెం పేరిరెడ్డి కొనుగోలు చేశారు. డాక్టర్ ఓ నాగేశ్వర్‌రావు, రామారావు, కోలా అరుణ తదితరులు 337 గజాలు, 1044 గజాలు, 400 గజాలు, 1781 గజాలు వంతున కొనుగోలు చేశారు. ఇవన్నీ సర్వే నం.127(పార్ట్), 128(పార్ట్)లో ఉన్నట్టు వారి సేల్‌డీడ్స్‌లో ఉన్నాయి. పలువురు ఈ సొసైటీ పేరిట ఉన్న వెంచర్‌లో ప్లాట్లను కొనుగోలు చేశారు. వీరు కొనుగోలు చేసిన ప్లాట్లను రేవంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఆక్రమించారని, ప్లాట్ల కోసం వేసిన హద్దు రాళ్లను తొలగించారని ఫిర్యాదుచేశారు. తుపాకులు గురిపెట్టి, అసభ్యంగా మాట్లాడారన్న అభియోగాలు బాధితుల ద్వారా తెలిశాయని నివేదికలో పేర్కొన్నారు. సర్వేనం.127(పార్ట్), 128 (పార్ట్)లోని రాజోలు ఎస్సీ మ్యుచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీలో ఎస్పీ రాజు, కొప్పినేని రామకృష్ణ, సిరిగినిధి నర్సింహారావు, జాగృతిషా, జీ ప్రవీణ్‌కుమార్, అడబాల నాగేశ్వర్‌రావు, బీఎస్ ప్రకాశ్‌కుమార్, ఎస్ బెంజిమెన్‌బాబు 9 ప్లాట్లు(విస్తీర్ణం 2706 గజాలు) కొనుగోలు చేశారు. 1987లోనే కొన్నట్టు డాక్యుమెంట్లు ఉన్నాయి. ఈ మేరకు సేల్‌డీడ్లను సమర్పించినట్టు నివేదికలో పేర్కొన్నారు. వారి ప్లాట్ల రాళ్లను తొలిగించి ఆక్రమించుకున్నట్టు బాధితులు 2014 ఫిబ్రవరిలోనే చందానగర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ కేసు కోర్టులో ఉన్నది. ప్లాట్లను ఆక్రమించుకున్నారంటూ ఆర్డీవో చంద్రకళకు పలువురు ఫిర్యాదు చేశారు. అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆర్డీవో సిఫారసు చేశారు.

## వడ్డీలేని రుణాలపై కమిటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అభయహస్తం, వడ్డీరహిత రుణ పథకాలపై సమీక్షించేందుకు ఆర్థికమంత్రి టీ హరీశ్‌రావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి, పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారని ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తెలిపారు.

## నేటినుంచి 52 ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రయాణికుల సంఖ్య పెరిగిన దృష్ట్యా 52 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటించింది. హైదరాబాద్- రామేశ్వరం- హైదరాబాద్ మధ్య 26 సర్వీసులు, హైదరాబాద్- కొచువెలి- హైదరాబాద్ మధ్య మరో 26 సర్వీసులు బుధవారం నుంచి మే 29 వరకు నడుస్తాయని రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. హోలీకి ప్రత్యేక రైలు మార్చి 7న సికింద్రాబాద్ నుంచి బయల్దేరి పాట్నాకు చేరుతుందని, మరోరైలు మార్చి 11న పాట్నా నుంచి ప్రారంభమై 13న అర్ధరాత్రి 12.40 గంటలకు సికింద్రాబాద్ చేరుతుందని పేర్కొన్నది.

## విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు

మొదటిపేజీ తరువాయి...

నుంచి రిటైరైన పింఛనుదారులకు కూడా ఇదేస్థాయిలో డీఆర్ (డియర్‌నెస్ రిలీఫ్)ను పెంచుతున్నామని, ఇది ఈ ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వు ప్రకారం విద్యుత్ ఉద్యోగులకు మార్చినెల జీతంతో పాటు, పింఛనర్లకు మార్చినెల పింఛన్‌తోతో పాటు డీఏ బకాయిలను చెల్లించనున్నారు.

# పశువులకూ యునిక్ ఐడీ

మొదటిపేజీ తరువాయి...

చెవికి అమర్చుతున్నారు. యజమానికి గుర్తింపుకార్డు అందజేస్తున్నారు. ట్యాగ్ నంబరు, పశువు వయసు, ఆడ, మగ, ఊరిపేరు యజమాని పేరు, మొబైల్ నంబరు, ఆధార్ నంబరు, వ్యాక్సినేషన్ చేసిన తేదీ తదితర వివరాలు సేకరిస్తున్నారు. పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేస్తూ పశు హెల్త్‌కార్డు అందజేస్తున్నారు.

### ఆన్‌లైన్‌లో పశువుల హెల్త్‌ప్రొఫైల్

ఇన్నాళ్లు రాష్ట్రంలో పశుగణన చేపట్టగా, రిజిస్ట్రేషన్ ఇదే తొలిసారి. ప్రతి పశువు వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తుండటంతో హెల్త్‌ప్రొఫైల్ అందుబాటులో ఉంటుంది. దీంతో పశువుకు వ్యాధినిరోధక టీకాలు వేసిన తేదీ, మళ్లీ ఎప్పుడు వేయాలనే వివరాలను గుర్తించి ఆరు నెలలకు ఒకసారి టీకాలు వేయటం, ఎదకొచ్చినపుడు కృత్రిమ గర్భధారణ వ్యాక్సినేషన్ చేసేందుకు వీలు కలుగుతుంది. హెల్త్‌కార్డు, పశు ఆధార్ నంబరు ఆధారంగా క్రమంతప్పకుండా వ్యాక్సినేషన్ ఇస్తూ పశువుల ఉత్పత్తి, పునరుత్పత్తి తగ్గకుండా జాగ్రత్తలు తీసుకొనేందుకు అవకాశం ఏర్పడింది.

### నల్లగొండ నంబర్‌వన్

పశుగణన ప్రకారం రాష్ట్రంలో 84,58,845 పశువులు ఉన్నాయి. వీటిలో గోజాతి 42,32,539, బర్రె జాతివి 42,26,306. జిల్లాలవారీగా 5,12,591 పశువులతో తొలిస్థానంలో నల్లగొండ, 4,55,911 పశువులతో భద్రాద్రికొత్తగూడెం జిల్లా రెండో స్థానంలో, 4,07,844 పశువులతో రంగారెడ్డి జిల్లా మూడోస్థానంలో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 84,58,845 పశువుల రిజిస్ట్రేషన్ పూర్తి కావడానికి మరో నెలరోజులు పట్టే అవకాశం ఉన్నదని పశుసంవర్ధక శాఖ అధికారులు పేర్కొన్నారు.

### పశు ప్రొఫైల్‌లో సమగ్ర సమాచారం


పశుప్రొఫైల్‌లో వాటి సమగ్ర సమాచారం ఉంటుంది. పశువులకు రిజిస్ట్రేషన్ ఇదే మొదటిసారి. ప్రతి ఒక్కరూ పశువుల వివరాలు పశుసంవర్ధకశాఖ అధికారులకు తెలియజేసి, కార్డులు పొందాలి. ప్రతి పశువుకు యూనిక్ ఐడీ ట్యాగ్ ఇస్తున్నాం. దీనిద్వారానే భవిష్యత్‌లో పశువులకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు జరుగుతాయి. ఇప్పటివరకు మొత్తం పశువుల్లో 18 శాతం వ్యాక్సినేషన్, రిజిస్ట్రేషన్ పూర్తయింది. మరో నెలరోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉన్నది.

-డాక్టర్ రవికుమార్, జేడీ, పశుసంవర్ధకశాఖ, వరంగల్ రూరల్

## మహిళా ఉద్యోగుల భద్రతే లక్ష్యం

### సాట్స్ చైర్మన్ అల్లీపురం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళా ఉద్యోగుల భద్రతకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకొంటున్నారని సాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎన్జీవో ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలను ఎల్బీస్టేడియంలో మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ పాల్గొన్నారు. మరోవైపు టీజీవో ఆధ్వర్యంలో 6వ తేదీ నుంచి మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు టీజీవో అధ్యక్షురాలు మమత తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.




మంగళవారం కొండాపూర్‌లో యశోద దవాఖాన ఆధ్వర్యంలో రూపొందించిన హెచ్‌పీవీ డీఎన్‌ఏ పరీక్షను అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అభిలాష బిష్త్ ప్రారంభించారు. కార్యక్రమంలో యశోద దవాఖాన వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ లలితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్పర్శ వెనుక ఉద్దేశాన్ని తెలుసుకోగలరు

**మహిళలకు అది సహజం.. బాంబే హైకోర్టు వ్యాఖ్య**



**ముంబై:** ఒక పురుషుడు తనను తాకినా లేదా చూసినా దాని వెనకున్న ఉద్దేశమేంటో మహిళలు సులభంగా గుర్తించగలరని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. 'మహిళలకు తక్కువ తెలుసుండొచ్చు. కానీ వారు ఎక్కువ అర్థం చేసుకోగలరు. తాకడం లేదా చూడడం వెనుక ఉద్దేశాన్ని సులభంగా అర్థం చేసుకుంటారు. ఇది వారికి సహజంగా లభించిన గిఫ్ట్' అని పేర్కొంది. 2017లో ఒక మాజీ నటిని వేధించిన కేసులో దోషిగా తేలిన వ్యాపారవేత్త పృథ్వీరాజ్ చవాన్ అభ్యర్థనపై మంగళవారం విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆయన కేసుపై విచారణ జరిగే వరకు శిక్షను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో సెషన్స్ కోర్టు ఆయనకు మూడేండ్ల జైలు శిక్ష విధించింది. అదే రోజు బెయిల్ కూడా మంజూరు చేసింది.

## సీఏఏపై సుప్రీంకోర్టులో ఐరాస పిటిషన్

- ముస్లింలను మినహాయించడంపై అభ్యంతరం
- జోక్యం కూడదన్న భారత్



**న్యూఢిల్లీ, మార్చి 3:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అంశానికి సంబంధించి ఐక్యరాజ్యసమితి (ఐరాస) మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అంతర్జాతీయ మానవ హక్కుల చట్టంపై భారత్ బాధ్యతల నేపథ్యంలో భారత రాజ్యాంగం ప్రకారం సీఏఏను పరిశీలించేందుకు కోర్టుకు సహకరిస్తామని పేర్కొంది. ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో మతపర వివక్షను ఎదుర్కొంటున్న హిందువులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రిస్టియన్లకు భారత పౌరసత్వం కల్పించాలన్న సీఏఏ ఉద్దేశాన్ని స్వాగతించింది. అయితే ఇస్లాం మతానికి చెందిన వారిని మినహాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో 12 పేజీల పిటిషన్‌ను తమ కార్యాలయం దాఖలు చేసినట్లు ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ మిచెల్ బాచెలెట్ జెనీవాలోని భారత శాశ్వత మిషన్‌కు సోమవారం తెలియజేశారు.

**సీఏఏ భారత సార్వభౌమ అంశం : రవీశ్‌కుమార్**

సీఏఏపై ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ జోక్యంపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడాన్ని తప్పుపట్టింది. సీఏఏ భారత సార్వభౌమ అంశమనిస్పష్టం చేసింది.

## కవలల అనంతర కాన్పుకు..
## 'ప్రసూతి ప్రయోజనాలు వర్తించవు'



**చెన్నై:** ఉద్యోగం చేసే మహిళకు తొలి కాన్పులో కవలలు జన్మించిన పక్షంలో తర్వాతి కాన్పునకు ప్రసూతి ప్రయోజనాలు వర్తించవని మద్రాసు హైకోర్టు తెలిపింది. అది రెండో కాన్పు అయినప్పటికీ పుట్టిన బిడ్డను మూడో సంతానంగానే పరిగణించాలని పేర్కొంది. ఓ మహిళా ఉద్యోగినికి తమిళనాడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 180 రోజుల సెలవును వర్తింపజేస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను కేంద్ర హోంమంత్రిత్వశాఖ సవాల్ చేసింది. దీనిపై న్యాయమూర్తులు ఏపీ సాహి, సుబ్రమణ్యంలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. 'తొలి కాన్పులో కవలలు జన్మిస్తే, వారు పుట్టిన సమయం మధ్య వ్యత్యాసాన్ని బట్టి రెండు కాన్పులుగా గుర్తించాలి' అని ధర్మాసనం స్పష్టం చేసింది.



ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మంగళవారం ప్రధాని మోదీతో సమావేశం అయ్యారు. ఢిల్లీలో హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కరోనా వైరస్ నియంత్రణ చర్యలపైనా ప్రధానితో చర్చించారు.

# అతివా.. అందుకో

**మహిళా దినోత్సవం నాడు స్ఫూర్తిదాయక మహిళలకు సోషల్ మీడియా ఖాతాలిచ్చేస్తా**

**అలాంటి నారీమణుల కథనాలు పంపండి: ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ, మార్చి 3:** సమాజానికి స్ఫూర్తినిచ్చే మహిళలకు తన సోషల్‌మీడియా ఖాతాలను అప్పగిస్తానని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. 'మనకు ఏ మహిళ జీవితం, పని స్ఫూర్తినిస్తున్నదో ఆమెకు ఈ మహిళా దినోత్సవాన (ఈ నెల 8వ తేదీ) సోషల్‌మీడియా ఖాతాలను ఇచ్చేస్తా. ఇది లక్షలమందిలో ప్రేరణ కలిగించేందుకు వారికి తోడ్పడుతుంది. మీరు అలాంటి మహిళా? లేదా అలాంటి స్ఫూర్తిదాయక మహిళలు మీకు తెలుసా? స్ఫూర్తినిచ్చే అతివల కథనాలను షేర్ చేయండి' అంటూ మంగళవారం ట్వీట్ చేశారు. 'ఈ ఆదివారం.. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ ఖాతాల నుంచి వైదొలగాలని భావిస్తున్నా' అని మోదీ సోమవారం చేసిన ట్వీట్ చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.

**ఆటలొద్దు.. కరోనా వైరస్‌పై దృష్టిపెట్టండి: రాహుల్‌గాంధీ**

దేశంలో మరో రెండు కరోనా కేసులు నమోదుకావడంతో ప్రధాని మోదీపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. 'దేశం అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటుండగా.. ప్రధాని మోదీ సోషల్‌మీడియా ఖాతాలతో పరిహాసమాడుతూ దేశ సమయాన్ని వృథా చేయడం ఆపాలి. దేశంలోని ప్రతి పౌరుడు కరోనా వైరస్‌ను ఎదుర్కొనేలా సిద్ధంచేయడంపై దృష్టిపెట్టండి' అని ట్వీట్ చేశారు. కరోనా వైరస్‌ను ఎలా ఎదుర్కోవాలో సూచిస్తూ సింగపూర్ ప్రధాని లీ హెచ్‌సీన్ లూంగ్ ఆ దేశ ప్రజలకు చేసిన వీడియో సందేశాన్ని సైతం రాహుల్ ట్వీట్ చేస్తూ.. 'ఇక్కడ ఇది ఎలా జరిగింది' అని పేర్కొన్నారు. 'ప్రతి దేశంలో అక్కడి నాయకులను పరీక్షించే కొన్ని సందర్భాలు వస్తాయి. అసలైన నాయకుడు.. దేశాన్ని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తూ భారీ సంక్షోభాన్ని సృష్టిస్తున్న వైరస్‌ను అరికట్టడంపై దృష్టిపెడతారు' అని ట్వీట్‌చేశారు.

**ప్రశంసనీయం.. కాదు జిమ్మిక్కు!**

స్ఫూర్తిదాయక మహిళలకు తన సోషల్ మీడియా ఖాతాలను ఇచ్చేస్తానన్న ప్రధాని నరేంద్రమోదీ ప్రకటనపై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. కొందరు మహిళా కార్యకర్తలు ప్రశంసించగా, మరికొందరు ఇది జిమ్మిక్కు అని వ్యాఖ్యానించారు. స్ఫూర్తిదాయక మహిళలకు సోషల్ మీడియా ఖాతాలను అప్పగించడానికి బదులు వారికి నిజమైన సాధికారత కల్పించడంపై మోదీ దృష్టి పెట్టాలని సూచించారు.

# సోషల్ మీడియాకు 'నై'

- బెదిరింపులు, దూషణల నేపథ్యంలో.. సామాజిక మాధ్యమాలకు దూరమవుతున్న ప్రముఖులు
- ఇష్టంలేక దాని జోలికిపోని మరికొందరు..
- జాబితాలో సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు



**సామాజిక** మాధ్యమాల్లో చురుగ్గా ఉండే ప్రధాని నరేంద్ర మోదీ.. వచ్చే ఆదివారం వాటి నుంచి వైదొలుగుతున్నట్టు పేర్కొనడం చర్చనీయాంశం అయింది. సోషల్ మీడియాకు దూరం కావొద్దంటూ వేలాది మంది నెటిజన్లు మోదీకి విజ్ఞప్తులు చేస్తున్నారు. మరోవైపు, ప్రధాని నిర్ణయంపై విపక్షాలు మండిపడుతున్నాయి. 'సోషల్ మీడియాను కాదు.. విద్వేషాన్ని వదిలేయాలి' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మోదీపై విరుచుకుపడగా.. దేశంలో సోషల్ మీడియాను నిషేధించాలన్న ఉద్దేశంతోనే ముందస్తుగా మోదీ ఈ హెచ్చరిక చేసి ఉంటారని మరో కాంగ్రెస్ నేత శశిథరూర్ పేర్కొన్నారు. అయితే, 'ఆదివారం రోజు.. మహిళా దినోత్సవం. మనకు స్ఫూర్తినిస్తున్న మహిళలకు నేను నా సోషల్ మీడియా అకౌంట్లను అప్పగిస్తా' అంటూ మోదీ మంగళవారం మరో ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాకు వివిధ కారణాలతో దూరమైనవాళ్లు, అసలు సోషల్ మీడియానే ఉపయోగించని ప్రముఖుల గురించి ఆసక్తికర వివరాలు..

**అనలిటికాతో దూరం**

2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయానికి, ఐరోపా యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగాలని తీర్పు ఇచ్చిన ప్రజాభిప్రాయ సేకరణను(బ్రెగ్జిట్‌కు).. 'కేంబ్రిడ్జ్ అనలిటికా' అనే సంస్థ ఫేస్‌బుక్ ఖాతాదారుల సమాచారాన్ని వినియోగించుకుని 'ప్రభావితం చేసింద'న్న ఆరోపణల నేపథ్యంలో 'స్పేస్ ఎక్స్' సంస్థ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్, బాలీవుడ్ దర్శకుడు ఫరాన్ అక్తర్ తమ ఫేస్‌బుక్ ఖాతాల్ని నిలిపివేశారు. ఫేస్‌బుక్ నియంతృత్వంతో వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ వాళ్లు తమ ఖాతాల్ని నిలిపేశారు.

**ఒక్క ఫొటోతో..**

2018లో గుజరాత్‌లోని సర్దార్ పటేల్ ఐక్యతా విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ ఆ విగ్రహం కాలి దగ్గర మోదీ నిల్చున్న ఫొటోను ఉద్దేశిస్తూ.. 'అది ప్రధానేనా, పక్షి రెట్టా?' అంటూ కన్నడ నటి, కాంగ్రెస్ సోషల్ మీడియా సెల్ హెడ్ దివ్య స్పందన వివాదాస్పదమైన ట్వీట్ చేశారు. దీనిపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఫలితంగా సోషల్ మీడియాకు ఆమె దూరం కావాల్సి వచ్చింది.

**అది నాకోసం కాదు..**

తాను సోషల్ మీడియాకు దూరంగా ఉంటానని భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఆరంభంలో ఫేస్‌బుక్ వాడాలని ఎంతో ఉత్సాహాన్ని చూపానని, ఆ మాధ్యమం తన కోసం కాదన్నవిషయం ఆ తర్వాత అర్థమైందని ఆయన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

**- నేషనల్ డెస్క్**



### ఫోన్ కూడా లేదు

రక్షణ దళాల అధిపతి జనరల్ బిపిన్ రావత్ సోషల్‌మీడియాకు దూరంగా ఉంటారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..సోషల్‌మీడియాతోపాటు తాను మొబైల్‌ను కూడా వాడనన్నారు. ఎవరైనా ఫోన్ నంబర్ అడిగితే.. గుర్తొచ్చిన నంబర్ చెప్తానని సరదాగా చెప్పారు.



### అధికారిక ఖాతా లేదు

కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఖాతాలు లేవు. పార్టీకి సంబంధించిన ప్రకటనల్ని పార్టీ అధికారిక ఖాతా ద్వారానే వెల్లడించేందుకు ఇష్టపడే ఆమె.. పార్టీ కార్యకర్తల్ని ప్రత్యక్షంగా కలుసుకొని మాట్లాడటమే తనకు ఇష్టంగా చెబుతారు.



### బెదిరింపులతో..

కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై తన వైఖరిని కుండబద్దలు కొట్టేలా చెప్పే వ్యక్తుల్లో ఒకరైన బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ తన ట్విట్టర్ ఖాతాను నిలిపివేస్తున్నట్టు గతేడాది ప్రకటించారు. ఒక వర్గం బెదిరింపులతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన ప్రకటించారు.



### ట్రోలింగ్ భరించలేక..

రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలపై తాను చేస్తున్న విశ్లేషణలపై ఒక వర్గం ఎదురు దాడులకు దిగడం, ట్రోలింగ్ చేస్తూ దూషణలకు పాల్పడటంతో ట్విట్టర్ నుంచి నిష్క్రమిస్తున్నట్టు కాంగ్రెస్ నాయకురాలు, నటి ఖుష్బూ ప్రకటించారు. గతేడాది నవంబర్‌లో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు.



బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రధాని మోదీ, ఆ పార్టీ అధ్యక్షుడు నడ్డా మాటామంతీ


## దేశాభివృద్ధికి శాంతి, సామరస్యం తప్పనిసరి

**న్యూఢిల్లీ, మార్చి 3:** దేశాభివృద్ధి జరుగాలంటే శాంతి, సామరస్యం, ఐక్యత తప్పనిసరని, సమాజంలో స్నేహపూర్వక వాతావరణం కోసం పార్టీ నేతలు కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఢిల్లీలో ఇటీవల చెలరేగిన మతఘర్షణలపై ప్రతిపక్షాలు కేంద్రంపై విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం పార్లమెంటు సమావేశాలకు ముందు బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీ అయ్యింది. ప్రధాని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు. ఎంపీలకు ఈ సందర్భంగా మోదీ దిశానిర్దేశం చేస్తూ.. సమాజంలో శాంతి పునరుద్ధరణకు, స్నేహపూర్వక వాతావరణం నెలకొనేందుకు పాటుపడాలని కోరారు. ఈ క్రమంలో.. 'భారత్ మాతా కీ జై' అన్న నినాదం ఇటీవలి కాలంలో దుర్వినియోగం అవుతుందని ఆరోపించిన మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్‌పై మోదీ విమర్శలు గుప్పించారు. 'భారత్ మాతా కీ జై' వంటి నినాదాల్ని కూడా అనుమానంగా చూస్తూ.. దాంట్లోనూ దుర్వాసనను వెతుకుతున్నారని ధ్వజమెత్తారు.

# చర్చకు సిద్ధమే



- రాజ్యసభ చైర్మన్ ఎప్పుడు అనుమతిస్తే అప్పుడు చర్చ
- ఢిల్లీ ఘర్షణలపై సభలో ప్రభుత్వం ప్రకటన
- హోళీ తర్వాత చర్చిద్దామన్న లోక్‌సభ స్పీకర్
- ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం
- పేపర్లు చించి వెల్‌లోకి విసిరివేత



**న్యూఢిల్లీ, మార్చి 3:** పార్లమెంట్ ఉభయ సభలు మంగళవారం కూడా దద్దరిల్లాయి. ఓ వైపు దేశ రాజధాని ఢిల్లీని కుదుపేసిన మత ఘర్షణలపై చర్చించాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తూ సభ కార్యకలాపాలను అడ్డుకోవడం.. మరోవైపు అధికార పక్షం సభ్యులు దీటుగా వ్యవహరించడంతో పార్లమెంట్ పలుసార్లు వాయిదా పడింది. చివరికి ఓ మెట్టు దిగిన ప్రభుత్వం ఢిల్లీ హింసాకాండపై చర్చించడానికి తాము సిద్ధమేనని తెలిపింది. అయితే ఎప్పుడు చర్చిస్తామన్న విషయాన్ని స్పష్టంగా చెప్పలేదు. ఉదయం రాజ్యసభ, లోక్‌సభ ప్రారంభంకాగానే ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఢిల్లీ మత ఘర్షణలపై వెంటనే చర్చించాలని పట్టుబట్టారు. రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ ఢిల్లీ అల్లర్ల విషయం చాలా తీవ్రమైనదని, దీనిపై వెంటనే చర్చించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఈ హింసాకాండపై ప్రపంచమంతా మాట్లాడుతుంటే మనం మాత్రం చర్చించకపోవడం సరికాదన్నారు. దీంతో రాజ్యసభలో అధికార పక్షనేత థావర్‌చంద్ గెహ్లాట్ స్పందిస్తూ ఢిల్లీ హింసపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు ఎప్పుడు సమయం కేటాయిస్తే అప్పుడు చర్చిద్దామన్నారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ స్పందిస్తూ చైర్మన్‌తో మాట్లాడిన తర్వాతే సమయాన్ని నిర్ధారిస్తామన్నారు.

**రణరంగంగా మారిన లోక్‌సభ**

లోక్‌సభ ఉదయం ప్రారంభంకాగానే ఢిల్లీ హింసాకాండపై చర్చించాలని ప్రతిపక్ష పార్టీల సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో హోళీ తర్వాత మార్చి 11న చర్చిద్దామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈ ప్రకటనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. దీనిని నిరసిస్తూ అధికార పక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి అధికార పక్ష సభ్యుల స్థానాలవైపు వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో చౌదరికి, పశ్చిమబెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీ లాకెట్ ఛటర్జీ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో స్పీకర్ స్పందిస్తూ.. సభ నియమావళి ఉల్లంఘించిన వారిని ఈ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అయినా శాంతించని ప్రతిపక్ష సభ్యులు 'డౌన్ డౌన్ బీజేపీ', 'సేవ్ ఇండియా' అంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. వీరిలో కొందరు పేపర్లను చించి వెల్‌లోకి విసిరారు. కాగా, వీసా నిబంధనలను ఉల్లంఘించి సీఏఏ వ్యతిరేక నిరసనలో పాల్గొన్న ఐదుగురు విదేశీయులను భారత్ వదిలివెళ్లాలని సూచించినట్లు కేంద్రమంత్రి నిత్యానంద్ రాయ్ లోక్‌సభలో తెలిపారు. సహకార బ్యాంకుల నియంత్రణకు ఆర్బీఐకి మరిన్ని అధికారాలు కల్పించే బిల్లును ఆర్థికమంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఎన్ఐఏ ఇప్పటివరకు 319 కేసులు నమోదుచేయగా, వాటిలో 237 కేసుల్లో ఇప్పటికే అభియోగపత్రాలను దాఖలుచేసినట్టు కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

## పుల్వామా ఉగ్రదాడి
# తండ్రీకూతుళ్ల అరెస్ట్

- పుల్వామా జిల్లాలోని హక్రిపొరాలో అదుపులోకి తీసుకొన్న ఎన్ఐఏ
- ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించినట్టు వెల్లడి



తారిక్ అహ్మద్‌షా, ఇన్షాజాన్

**శ్రీనగర్:** పుల్వామా ఉగ్రదాడి దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక ముందడుగు వేసింది. ఈ దాడి ఘటనతో సంబంధమున్న తండ్రీకూతుళ్లను అరెస్ట్ చేసింది. జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో గత ఏడాది ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్రదాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు దుర్మరణం పాలయ్యారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ.. తాజాగా పుల్వామా జిల్లాలోని హక్రిపొరా గ్రామానికి చెందిన తారిక్ అహ్మద్‌షా, ఆయన కూతురు ఇన్షాజాన్ (23)ను అదుపులోకి తీసుకొంది. సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడికి పాల్పడిన జైషే మహ్మద్ ఉగ్రవాది ఆదిల్ మహ్మద్ దార్.. ఇదే తారిక్ అహ్మద్‌షా నివాసం వద్ద దాడికి ముందు ఒక వీడియోను షూట్ చేశారు. దాడి అనంతరం ఈ వీడియోను పాకిస్థాన్ విడుదల చేసింది. ట్రక్ డ్రైవర్ అయిన తారిక్ అహ్మద్‌షా.. తన ఇంటిని పాక్ ఉగ్రవాది దార్, మహ్మద్ ఉమర్ ఫారుఖ్, ఐఈడీ తయారీ నిపుణుడు కమ్రాన్, మరో ఉగ్రవాది (ఇద్దరూ తర్వాత ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు), పుల్వామాకు చెందిన జైష్ ఉగ్రవాది సమీర్ అహ్మద్ దార్, పాక్‌కు చెందిన ఉగ్రవాది ఇస్మాయిల్ అలియాస్ ఇబ్రహీం తదితరులకు ఆశ్రయం కల్పించాడు. తారిక్ కూతురు ఉగ్రవాదులకు ఆహారం, ఇతర సౌకర్యాలు సమకూర్చినట్టు గుర్తించారు.



### కమల్‌ను ప్రశ్నించిన పోలీసులు

**చెన్నై:** 'ఇండియన్-2' సినిమా సెట్స్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంపై ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్‌హాసన్‌ను పోలీసులు ప్రశ్నించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నిరోధించేందించే మార్గాలపై తాను పోలీసులతో మాట్లాడినట్టు కమల్ చెప్పారు.కాగా ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించారు.

aap

### నిలిచిపోనున్న 85 ఏండ్ల సేవలు

**మెల్‌బోర్న్:** 85 ఏండ్లపాటు సేవలందించిన ఆస్ట్రేలియా జాతీయ వార్తా సంస్థ 'ఆస్ట్రేలియన్ అసోసియేటెడ్ ప్రెస్ (ఏఏపీ)' మూతపడనున్నది. ఈ ఏడాది జూన్‌లో వార్తా సంస్థ సేవలు, సబ్ ఎడిటింగ్ బిజినెస్ పేజీ మాస్టర్ల విభాగం సేవలు ఆగస్టునాటికి నిలిచిపోనున్నాయని ఏఏపీ మంగళవారం ప్రకటించింది.



### అనుమతి లేని నిరసనలకు దిగితే జైలుకే

**మాస్కో:** అనుమతి లేకుండా నిరసనలకు దిగే వారు జైలు పాలవుతారని, వారికి గుండు కొట్టడం ఖాయమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విపక్షాలను హెచ్చరించారు. రష్యా అధ్యక్షుడిగా 20 ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా దేశ అధికార వార్తా సంస్థ టాస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా చట్టాల ప్రకారం అనుమతి లేకుండా నిరసనకు దిగేవారికి జైలుశిక్ష విధిస్తారు. అయితే, నిరసనలకు ఎటువంటి కారణం లేకుండానే అధికారులు అనుమతులు నిరాకరిస్తున్నారని విపక్షాలు చెబుతున్నాయి.

## హీరో పేరిట
## 'ఫేక్'బుక్

- యువతులకు సైబర్ చీటర్ వల
- రంగంలోకి విజయ్ దేవరకొండ
- సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాలు సృష్టించి.. యువతులకు వల వేస్తున్న సైబర్ మోసగాడిని పట్టించేందుకు ప్రముఖ సినీనటుడు విజయ్ దేవరకొండ స్వయంగా రంగంలోకి దిగా రు. తన సహాయకుడి సాయంతో నిందితుడి కూపీ లాగారు. మంగళవారం సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్‌చీటర్ పదిహేను మంది యువతులను ట్రాప్‌చేసినట్టు సమాచారం. విజయదేవర కొండ పేరిట ఓ సైబర్ నేరగాడు నకిలీ ఫేస్‌బుక్ ఖాతా తెరిచి మోసగించాడు. ఈ విషయం దృష్టికి రావడంతో విజయ్.. నిందితుడి వివరాలు తెలుసుకొనేందుకు తన వద్ద పనిచేసే గోవింద్ వ్యాస్‌ను రంగంలోకి దింపాడు. వ్యాస్ అమ్మాయి ఫొటో పెట్టి నకిలీ ఫేస్‌బుక్ ఐడీ క్రియేట్ చేశాడు. గుర్తుతెలియని వ్యక్తితో పరిచయం చేసుకున్నాడు. అమ్మాయిగా భావించిన సైబర్‌చీటర్.. గోవింద్ వ్యాస్‌తో చాటింగ్ మొదలుపెట్టాడు. తన డబ్బింగ్ ఆర్టిస్ట్ మాట్లాడుతాడంటూ మరో కల్పితపాత్ర సృష్టించి చాటింగ్‌చేశాడు. కలుద్దాం, సహజీవనం చేద్దాం, పెండ్లి చేసుకుందామని ట్రాప్‌లోకి దింపాడు. నకిలీ ఫేస్‌బుక్ సృష్టించారని నిర్ధారించుకున్న విజయ్ దేవరకొండ పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

# జగిత్యాలలో కశ్మీర్ పోలీసులు

- అదుపులోకి కుస్తాపూర్ యువకుడు లింగన్న
- ఉగ్రవాద కేసులో అరెస్టయిన వ్యక్తికి మనీ ట్రాన్స్‌ఫర్



**మల్లాపూర్:** కశ్మీర్‌లో ఐఎస్ఐ ఉగ్రవాదులకు సాయం చేశాడన్న అనుమానంతో అక్కడి పోలీసులు మంగళవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం కుస్తాపూర్‌కు చెందిన సరికెల లింగన్నను అదుపులోకి తీసుకున్నారు. జమ్ముకశ్మీర్‌కు చెందిన రాకేశ్‌కుమార్ అక్కడి అర్నియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఆర్మీ క్యాంప్‌లో కూలీ. అతడికి ఫేస్‌బుక్‌లో అనిత పేరుతో ఉన్నవారితో పరిచయమైంది. తాను జర్నలిస్టునని,భారత సైనిక శిబిరంలోని వస్తువులు, వాహనాలు, ఆ ప్రాంత ఫొటోలు పంపితే వార్తలుగా రాస్తానని అనిత చెప్పడంతో రాకేశ్ ఆ పనులు చేశాడు. దీనికోసం అనిత నుంచి రూ.27 వేలు రాకేశ్ ఖాతాలో జమయ్యాయి. రాకేశ్ ఫొటోలను తీసి ఫేస్‌బుక్‌లో పోస్ట్‌చేయడంతో స్థానిక పోలీసులు జనవరి 5న అరెస్టుచేశారు. రాకేశ్ ఖాతాలు పరిశీలించగా లింగన్న గూగుల్‌పే ద్వారా గతనెల 13న రూ.5 వేలు, 25న రూ.4 వేలు పంపినట్టు తేలింది. దీని ఆధారంగా అర్నియా పోలీసులు లింగన్న విచారించారు. దుబాయ్‌లో ఉన్న బంధువైన శ్రీనివాస్ ఓ బ్యాంకు ఖాతాకు నగదు పంపాలని సూచించడంతో డబ్బు పంపానని తెలిపాడు. దీంతో లింగన్నను విచారణకు తీసుకెళ్లేందుకు అర్నియా పోలీసులు మెజిస్ట్రేట్‌ను సంప్రదించగా అనుమతిచ్చారు.

**దుబాయ్ టు కశ్మీర్ వయా కుస్తాపూర్**

లింగన్నకు బంధువైన శ్రీనివాస్ కొన్నేండ్లుగా దుబాయ్‌లో ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. అదేదుకాణంలో పాకిస్థాన్ వ్యక్తి కూడా పనిచేస్తుండటంతో ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి భారత్‌లో తమ బంధువు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని, గూగుల్‌పే ద్వారా రూ.9 వేలు పంపే ఏర్పాటుచేయాలని శ్రీనివాస్‌ను కోరినట్టు తెలిసింది. దీంతో శ్రీనివాస్ ఫోన్‌లో బ్యాంకు ఖాతాను లింగన్నకు పంపగా, ఆ ఖాతాకు లింగన్న రూ.9 వేలు పంపినట్టు తెలుస్తున్నది.



అన్ని ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం సాధించడంపై హర్షం వ్యక్తంచేస్తూ రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, ఆర్టీఐ కమిషనర్ అమీర్ భాయ్, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ నేత గుడాల భాస్కర్ - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## కరీం తుండా నిర్దోషి

**నాంపల్లి కోర్టు తుది తీర్పు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ వరుస బాంబుపేలుళ్ల కేసులో ఆధారాలు నిరూపితం కాకపోవడంతో నిందితుడు అబ్దుల్ కరీం తుండాను నాంపల్లి కోర్టు నిర్దోషిగా తేల్చింది. ఈ మేరకు మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. 1998లో వినాయకచవితి సందర్భంగా నగరంలో పలుచోట్ల బాంబుపేలుళ్లకు కుట్రపన్నినట్టు తుండాపై కేసు నమోదైన విషయం తెలిసిందే.

## 79 ఇండ్లు, 327 దుకాణాలు బూడిద



దాడులు జరిగిన ప్రాంతంలో పర్యటిస్తున్న సిసోడియా

**ఢిల్లీ డిప్యూటీ సీఎం సిసోడియా వెల్లడి**

**న్యూఢిల్లీ:** ఈశాన్య ఢిల్లీలో జరిగిన మత ఘర్షణల్లో 79 ఇండ్లు, 327 దుకాణాలు పూర్తిగా దహనమయ్యాయని ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా వెల్లడించారు. 79 ఇండ్లు పూర్తిగా, 168 ఇండ్లు గణనీయ స్థాయిలో, 40 ఇండ్లు స్వల్పంగా దెబ్బ తిన్నాయని ఆయన సోమవారం సాయంత్రం మీడియాకు చెప్పారు. హింసాకాండలో అధికారిక పత్రాలను కోల్పోయిన వారు సమీప ఎస్డీఎంలను సంప్రదించాలని, వారికి తగిన సాయం అందుతుందన్నారు. మరోవైపు, ఢిల్లీలోని మౌజిపూర్‌లో అల్లర్ల సందర్భంగా నిరాయుధుడైన పోలీసుపైకి తుపాకీ ఎక్కుపెట్టిన వ్యక్తిని షారూఖ్‌గా పోలీసులు గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అతడ్ని అరెస్ట్ చేసి ఢిల్లీకి తరలించారు. పోలీసుల ముందే ప్రజలపై అతడు ఎనిమిది రౌండ్ల కాల్పులు జరిపాడు. కాగా, 'ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవస్థీకృత హింసకు పాల్పడడం ఖండనార్హం' అని ఇరాన్ విదేశాంగ మంత్రి జావద్ జరీఫ్ చేసిన వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ ఖండించింది. ఇరాన్ స్పందన అవాంఛనీయమని పేర్కొంది. భారత్‌లోని ఇరాన్ రాయబారిని పిలిపించి నిరసన తెలియజేసింది. ఇరాన్ నుంచి ఇలాంటి వ్యాఖ్యలు ఊహించలేదని వ్యాఖ్యానించింది.

## అమెరికాలో టోర్నడోల బీభత్సం

**22 మంది మృతి.. వందల సంఖ్యలో దెబ్బ తిన్న భవనాలు**

**నాష్‌విల్లే, మార్చి 3:** అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రంలో టోర్నడోలు బీభత్సం సృష్టించాయి. దీంతో వందల సంఖ్యలో భవనాలు దెబ్బతిన్నాయి. భవంతుల శిథిలాలు, బేస్‌మెంట్ల కింద చిక్కుకొని కనీసం 22 మంది మృత్యువాత పడ్డారు. రాష్ట్రంలోని నాష్‌విల్లే తదితర ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున టోర్నడోలు విరుచుకుపడ్డట్టు అధికారులు తెలిపారు. దీంతో కనీసం 140 భవనాలు దెబ్బతిన్నాయని, 22 మంది చనిపోయారని వెల్లడించారు. భవంతుల శిథిలాల కింద ఇంకా చాలా మంది చిక్కుకున్నారని, వారిని వెలికితీయాల్సి ఉందని తెలిపారు.



అభివృద్ధి మన మంత్రం. శాంతి, ఐక్యత, సామరస్యం అభివృద్ధికి అవసరమైనవి. కానీ కొంతమంది, పార్టీలు బతుకడానికి రాజకీయాలు చేస్తారు. మనం దేశం కోసం బతుకుతున్నాం.

**నరేంద్రమోదీ, ప్రధాని**

ఎవరైతే బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారో, వారు పౌరసత్వం పొందారు. వారు మరోసారి పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రధానిని, ముఖ్యమంత్రిని ఎన్నుకోవడానికి మీ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు మీరు ఈ దేశ పౌరులు కాదని అంటున్న వారి మాటలను నమ్మకండి.

**మమతాబెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**




1974

బ్రిటన్ ప్రధానిగా హెరాల్డ్ విల్సన్.

1977

రొమేనియాలో భూకంపం. 1500 వందల మందికి పైగా మృతి.





1997

ప్రభుత్వ నిధులతో సాగే మానవ క్లోనింగ్ పరిశోధనను నిషేధించిన అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్.

హాంకాంగ్‌లో ఒకవైపు కరోనావైరస్ కలవరపెడుతుంటే మరోవైపు వీధుల్లో నిరసనలు మొదలయ్యాయి. గతంలో ప్రదర్శనలకు దారితీసిన కారణాలను ప్రభుత్వం గుర్తించడం లేదు. ఈలోగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి మరిన్ని నిధులు, అదనపు బలగాలు కావాలని పోలీసుశాఖ కోరడంతో ఉద్రిక్తత మొదలైంది. పోలీసుశాఖకు బడ్జెట్‌ను భారీగా పెంచడంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. కానీ కరోనావైరస్‌ను అరికట్టడమే ప్రాధాన్యం కావాలి. ఈ మహమ్మారిని అరికట్టిన తరువాత ప్రజలలో నెలకొన్న అసంతృప్తి విషయమై స్వతంత్ర విచారణ జరగాలి.

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**

కెనడా బ్యాంక్ నోట్లపై చక్రవర్తులు, ప్రధానుల బొమ్మలే ఎక్కువకాలంగా ఉంటున్నాయి. మొదటిసారిగా పౌరహక్కుల కార్యకర్త వయోలా డెస్మండ్ బొమ్మను పది డాలర్ల నోటుపై ముద్రించడం విశేషం. ఆమె మహారాణి కాదు, ప్రధాని కూడా కాదు. బ్యాంక్ నోట్లపై ఎవరి బొమ్మలు ముద్రించాలనే విషయమై ప్రజల సూచనలు గమనించదగినవి. ఈ సూచనల్లో కళలు, శాస్త్ర విజ్ఞానం, వ్యాపారం, క్రీడల వంటి భిన్నరంగాల వారున్నారు. దేశాధినేతలవే కాకుండా అన్నిరంగాలలో సమాజాన్ని ప్రభావితం చేసినవారి బొమ్మలు ముద్రించడం మంచిదే.

**టొరంటో స్టార్**



# స్వీయ నియంత్రణ

ప్రధాని నరేంద్రమోదీ ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లను వీడాలని ఆలోచిస్తున్నట్టు ట్విటర్ ద్వారా తెలుపడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆధునిక టెక్నాలజీని అద్భుతంగా వినియోగించుకునే నేతల్లో ఒకరిగా పేరుగాంచిన మోదీ అకస్మాత్తుగా వాటిని వీడాలనుకోవడం ఆలోచింపచేస్తున్నది. ఆయన తన నిర్ణయాన్ని ట్విటర్‌లో పోస్ట్ చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే లక్షలాదిమంది వీక్షకులు స్పందించారు. సోమవారం అర్ధరాత్రి వరకే 35 వేల మందికి పైగా రీ ట్వీట్ చేశారు. లక్షా పదివేల మంది లైక్ చేశారు. 2009 జనవరిలో ట్విటర్‌లో చేరిన మోదీకి ప్రస్తుతం ఐదున్నర కోట్లమంది ఫాలోవర్స్ ఉన్నారు. ఫేస్‌బుక్‌లో 4.4 కోట్ల మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో మరో మూడు కోట్ల మందికి పైగా ఆయన్ను అనుసరిస్తారు. ఇంతటి ప్రభావశీలమైన సోషల్ మీడియాను వీడాలనే నిర్ణయాన్ని మోదీ కాకతాళీయంగా తీసుకున్నారని అనుకోలేం. సామాజిక మాధ్యమం కారణంగా సమాజంలో అనేక విపరీతాలు చోటు చేసుకుంటున్నాయి. హింసా ప్రవృత్తులు, పెడధోరణులు పెరుగుతున్నాయి. సోషల్ మీడియాలో కాలక్షేపం చేయటం, అదొక వ్యసనంగా మారటం కూడా జరుగుతున్నది. సోషల్ మీడియా కారణంగా పుస్తకాలు చదువటం తగ్గిపోయిందని ఈ మధ్యనే మోదీ వాఖ్యానించారు. ఈ నేపథ్యంలో మోదీ సోషల్ మీడియాకు దూరంగా ఉంటానన్న నిర్ణయం అందరినీ ఆలోచింపచేస్తుందనటంలో సందేహం లేదు.

ప్రపంచవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల విప్లవం ప్రజల జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్లు అందరికీ అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలో ప్రపంచం అరచేతిలో ఇమిడిపోతున్నది. సోషల్ మీడియాను వాడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నది. ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియా ఖాతాదారుల సంఖ్య 302 కోట్లకు చేరుతుందని నిపుణులు చెబుతున్నారు. 2021నాటికి భారత్, చైనా దేశాల నుంచే 110 కోట్ల మంది సోషల్ మీడియా ఖాతాదారులుంటారు. మన దేశంలో 35 కోట్ల మంది దాకా ఉంటారని అంచనా. అభివృద్ధి చెందిన అమెరికా, యూరప్ దేశాలతో పోలిస్తే, భారత్‌లో సెల్‌ఫోన్ వినియోగం ఎక్కువ స్థాయిలో ఉండటం విశేషం. అయితే ఇంటర్నెట్, సోషల్ మీడియా అందరికీ అందుబాటులోకి వచ్చిన తర్వాత మనుషుల మధ్య సంబంధాలు పెరిగిపోయాయి. సమాచారం, విజ్ఞానం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం కారణంగా జ్ఞానం పరివ్యాప్తం అయ్యింది. కుగ్రామంలోని వ్యవసాయదారుడు మొదలు, విద్యార్థి దాకా అవసరమైన విజ్ఞానాన్ని పొందుతూ జీవితాన్ని తీర్చిదిద్దుకుంటున్నారు. సామాజిక మాధ్యమాన్ని సద్వినియోగం చేసుకొని ఎదుగుతున్నారు.

**రోజుకు రెండు గంటలకు మించి సోషల్ మీడియాలో గడిపితే మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. చిన్నపిల్లలు మందబుద్ధులవుతున్నారు. పెద్దవారు మానసిక ఒత్తిడులకు లోనవుతున్నారు. అవసరాలను తీర్చడానికే పరిమితం కాకుండా సోషల్ మీడియా దారి మళ్లి అనేక అకృత్యాలకు హేతువు అవుతున్నది. దీనివల్ల కుటుంబాలు కూడా కూలుతున్నాయి. మనిషి సమూహంలోనే ఒంటరివాడై మానసిక రుగ్మతలకు గురవుతున్నాడు.**

ఇవ్వాళ సోషల్ మీడియా లేకుండా ఒక్క రోజును ఊహించలేం. మానవానుబంధాలనుంచి, ఉత్పత్తుల దాకా సకల సామాజిక, ఆర్థిక జీవనం సోషల్ మీడియాపై ఆధారపడి ఉన్నది. మార్క్ జూకర్ బర్గ్ ఫేస్‌బుక్‌ను ఆవిష్కరిస్తూ విశ్వమానవ స్నేహసబంధాలకు పెద్దపీట వేశాడు. అలాగే ఫేస్‌బుక్ ఆశయాన్ని వివరిస్తూ– ఈ ప్రపంచం తెరిచిన పుస్తకంగా ఉండాలి. ప్రతిఒక్కరూ తమ ఇష్టాయిష్టాలను స్వేచ్ఛగా పంచుకోగలుగాలి. స్నేహ సంబంధాలు ఖండాలు దాటాలి. స్నేహ సామ్రాజ్యం విస్తరించాలి అని ఆకాంక్షించాడు. జూకర్‌బర్గ్ ఆశించిన విధంగానే సామాజిక మాధ్యమం ప్రపంచ ప్రజలను చేరువ చేసింది. కానీ ఇదంతా నాణానికి ఒక పార్శ్వమే.

ప్రపంచవ్యాప్తంగానూ, దేశంలోనూ పెరుగుతున్న సామాజిక హింసలో సోషల్ మీడియా పాత్ర, ప్రమేయం చర్చనీయాంశం అవుతున్నది. సోషల్ మీడియా ఎప్పుడైతే ఆధునిక మానవుని జీవితంలో భాగమైపోయిందో, నాటి నుంచి ఏదీ గోప్యం కాకుండా పోయింది. వ్యక్తిగతానికి, సామాజికానికి మధ్య ఉన్న సన్నని హద్దు చెరిగిపోయింది. పిల్లల నుంచి పెద్దల దాకా, విద్యావంతుల నుంచి నిరక్షరాస్యుల వరకు అందరికీ స్మార్ట్ ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత సామాజిక మాధ్యమం పెద్ద మహమ్మారిగా మారిపోయింది. గంటలకు గంటలు సెల్‌పోన్లలో గడుపటం ద్వారా విలువైన పనిగంటలు నష్టపోతున్నాం. రోజుకు రెండు గంటలకు మించి సోషల్ మీడియాలో గడిపితే మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. చిన్నపిల్లలు మందబుద్ధులవుతున్నారు. పెద్దవారు మానసిక ఒత్తిడులకు లోనవుతున్నారు. అవసరాలను తీర్చడానికే పరిమితం కాకుండా సోషల్ మీడియా దారి మళ్లి అనేక అకృత్యాలకు హేతువు అవుతున్నది. దీనివల్ల కుటుంబాలు కూడా కూలుతున్నాయి. మనిషి సమూహంలోనే ఒంటరివాడై మానసిక రుగ్మతలకు గురవుతున్నాడు. ఏదైనా మితిమీరితే విషమే, విపత్కరమే. బహుశా ఈ సామాజిక వాస్తవ స్థితిలోంచే మోదీ వాటికి దూరంగా ఉంటున్నట్లు ప్రకటించి ఉంటారని ఊహించటం కష్టం కాదు. ఇప్పటికైనా సామాజిక మాధ్యమాల్లో పొద్దుపుచ్చకుండా ఎవరికి వారు నియంత్రించుకోవాల్సిన అవసరం ఉన్నది.

**జనగళం**

### మన చేతుల్లోనే పరిశుభ్రత

గ్రామ పంచాయతీల్లో, పట్టణాల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా పారిశుధ్యంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యల కంటే ప్రజల చైతన్యంతోనే గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటాయి. మన ఇంటితో పాటు మన పరిసర ప్రాంతాల పరిశుభ్రత మన చేతుల్లోనే ఉంటుందనే వాస్తవాన్ని ప్రజలు గమనిస్తున్నారు. అందుకే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేసుకుంటున్నారు. పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారు.గతంలో పోలిస్తే చాలా గ్రామాల్లో, పట్టణాలలో మార్పు కనిపిస్తున్నది. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలి. పరిశుభ్రతతో పాటు పచ్చదనానికి ప్రాధాన్యమివ్వాలి.

**- జి. అనిల్‌కుమార్, భద్రాచలం**

### తగిన తోడ్పాటు అందించాలి

ఆర్థిక సంక్షోభం ఉన్నా సంక్షేమ పథకాల అమలుకు ఎలాంటి లోటు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల కోసం ఏటా బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తున్నది. అందుకే ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరినట్టు వివిధ పథకాలు, ప్రాజెక్టుల కోసం తగిన నిధులు కేటాయించి రాష్ట్రాభివృద్ధికి తమవంతు తోడ్పాటును అందించాలి.

**- పి. లక్ష్మణ్, సిరిసిల్ల**

### అప్రమత్తంగా ఉండాలి

కరోనా వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే తగిన సూచనలు, సలహాలు ఇచ్చాయి. వైరస్‌ను ఎదుర్కొవడానికి అన్నివిధాలుగా సిద్ధంగా ఉన్నామని ప్రకటించాయి. వైరస్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలంతా తప్పకుండా పాటించాలి.

**- జనగాని సత్యం, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

సామాజికం



**సకినాల భవాని**

# మహిళాభివృద్ధిలోనూ ఆదర్శం

మహిళ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ. ఈ పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించడం ద్వారా మన కేసీఆర్ గారు తెలంగాణ ఆడబిడ్డలకు సుమున్నత గౌరవం ఇచ్చారు. ఆడపిల్ల పుడితేనే భారంగా భావించే సమాజం లో కేసీఆర్ కిట్‌తో పాటుగా రూ. 13,000ల నగదు ప్రోత్సాహకంగా ఇస్తున్నది రాష్ట్ర ప్రభుత్వం. ఈ పథకం వల్ల సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరగడమే కాకుండా, మాతా శిశు మరణాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందంటూ నీతిఆయోగ్ పేర్కొనడం తెలంగాణ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నది.

ఎక్కడ మహిళలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని నానుడి. మన సమాజంలో దాదాపు 6000 సంవత్సరాల పూర్వం నుంచి అనగా సింధూ నాగరికత కాలం నుంచి భారతీయులు స్త్రీలను గౌరవిస్తూ, స్త్రీలను దేవతలుగా పూజిస్తారు. మన దేశాన్ని కూడా భారతమాతగా గౌరవిస్తూ, పూజిస్తూ ఉండటం మన దేశంలో స్త్రీల పట్ల గౌరవాన్ని సూచిస్తుంది.

దుర్భర పని పరిస్థితులకు వ్యతిరేకంగా తమ హక్కుల సాధన కోసం మహిళా కార్మికులు చేసిన పోరాటాలు అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి నాంది పలికాయి. మహిళల డిమాండ్లను ముందుకు తెస్తూ ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని జరపాలనే నిర్ణయాన్ని 1910 ఆగస్టు 26న కోపెన్‌హేగెన్‌లో జరిగిన రెండవ అంతర్జాతీయ సోషలిస్ట్ మహిళా సదస్సులో తీసుకున్నారు. మొట్టమొదటి ఈ ప్రతిపాదనను సోషలిస్టు నాయకురాలు క్లారాజట్కిన్ ప్రవేశపెట్టింది. ఆ తర్వాత మహిళల సమస్యలపై దృష్టి పెట్టేందుకు అన్నిదేశాల్లోనూ ఒక దినోత్సవం జరపాలని 1977లో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 150 దేశాలు ఆ తీర్మానానికి మద్దతునిచ్చాయి. తమ దేశాలలో మహిళల పట్ల వివక్షను తొలిగిస్తామని, మహిళా దినోత్సవం తమ ఎజెండాలో ప్రాధాన్యాంశంగా ఉంటుందని ప్రకటించాయి. అప్పటి నుంచి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాము.

మహిళల సర్వతోముఖాభివృద్ధితో దేశాభివృద్ధి ముడిపడి ఉన్నది. మన దేశం లింగ వివక్షలో 114వ స్థానంలో, ఆర్థిక స్వావలంబనలో 134 స్థానంలో, వైద్యంలో 141వ స్థానంలో ఉన్నది. ప్రపంచదేశాలలో స్త్రీ, పురుష వ్యత్యాసం గతంలో (108) కంటే నాలుగు స్థానాలు దిగజారి 112వ స్థానానికి చేరింది. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. హింస అనేది ఏ రూపంలో ఉన్నా అది మానవ హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుందని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. మహిళలపై హింస అంటే అది భౌతిక, మానసిక, లైంగిక వేధింపులు, స్త్రీ వ్యక్తిగత జీవితానికి భంగం కల్గించే ప్రవర్తన. వాటిలో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు, పెంపకంలో వ్యత్యాసం చూపించడం, అవకాశాలలో అసమానతలు, బాల్య వివాహాలు, అక్రమ తరలింపులు వంటివి వస్తాయి.

మన సమాజంలో స్త్రీ శ్రామికురాలిగా, పౌరురాలిగా వివక్షకు గురవుతున్నది. ఇంటాబయటా మహిళలకు రక్షణ కరువైంది. ప్రపంచవ్యాప్తంగా మానవ అక్రమ రవాణాలో 71శాతం బాలికలు, మహిళలే బలవుతున్నారు. ప్రపంచంలో ప్రతి ముగ్గురు మహిళలో ఒకరు తమ జీవిత కాలంలో శారీరక లేదా లైంగికహింసకు గురవుతున్నారని ఒక అధ్యయనంలో వెల్లడైంది.

దేశంలో జనాభా గణాంకాలను పరిశీలిస్తే పురుషుల సంఖ్య కంటే స్త్రీల సంఖ్య తక్కువగా ఉండటమే కాకుండా క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. 2015 ప్రపంచబ్యాంకు సర్వే ప్రకారం స్త్రీ, పురుష నిష్పత్తి ప్రతి 1000 మంది బాలురకు 903 మంది బాలికలు మాత్రమే. స్త్రీ, పురుష నిష్పత్తి ఆర్థికాభివృద్ధికి, సామాజిక సంక్షేమానికి సూచిక. స్త్రీ, పురుష నిష్పత్తిలో అసమానత ఇట్లాగే కొనసాగితే సమాజంలో సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉన్నది.

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'బేటీ బచావో, బేటీ పఢావో' పథకం పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా ఉన్నది. బాలికల పుట్టుక విషయంపై విధంగా ఉంటే చదువు విషయం మరింత దుర్భరంగా ఉన్నది. ప్రాథమిక పాఠశాలలో బాలికల నమోదు 100కు కేవలం 88.7 శాతం మాత్రమే ఉన్నది. సెకండరీస్థాయికి వచ్చే సరికి 52 శాతం ఉండగా ఉన్నత విద్య కొచ్చేసరికి కేవలం 33 శాతం మాత్రమే ఉన్నత విద్యను పూర్తి చేయగలుగుతున్నారు. అంటే నూటికి 67 మంది ఆడపిల్లలు చదువులకు దూరం చేయబడుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా గడిచిన పదేళ్లలో మహిళా కార్మికశక్తి 150 కోట్ల నుంచి 175 కోట్లకు పెరిగింది. స్త్రీలు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 79 శాతం ఆహారఉత్పత్తి చేస్తున్నారు. మన దేశంలో స్త్రీలు సగటున ప్రతిరోజు 4 నుంచి 5 గంటలు లేదా తమ జీవిత కాలం మొత్తంలో 16 శాతం వంటింటిలోనే గడుపుతున్న పరిస్థితి ఉన్నది. అయినా ఇంటి పనికి లెక్కే లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం శ్రామికులలో 40శాతం మంది మహిళలే ఉన్నారు. ప్రత్యేకించి వ్యవసాయరంగంలో పనిచేస్తున్న శ్రామికులలో 43 శాతం మహిళలే. కాని ప్రస్తుతం మహిళలు సంపాదిస్తున్న జీతం పదేళ్ల కిందట పురుషుడు సంపాదించిన దానితో సమానం.

ప్రపంచవ్యాప్తంగా మహిళలకు అన్నిరంగాలలో సమానత్వం రావాలంటే 83 యేండ్లు పడుతుందని 2016లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంచనా వేసింది. కానీ ఇప్పుడా వ్యత్యాసం మరింత పెరిగి ఇంచుమించు వంద సంవత్సరాలు పడుతుందని చెబుతున్నది. అందుకే 'మహిళల హక్కులు మానవ హక్కులే' అనే నినాదం ముందుకు వచ్చింది.

మహిళ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ. ఈ పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించడం ద్వారా మన కేసీఆర్ గారు తెలంగాణ ఆడబిడ్డలకు సుమున్నత గౌరవం ఇచ్చారు. ఆడపిల్ల పుడితేనే భారంగా భావించే సమాజంలో కేసీఆర్ కిట్‌తో పాటుగా రూ. 13,000ల నగదు ప్రోత్సాహకంగా ఇస్తున్నది రాష్ట్ర ప్రభుత్వం. ఈ పథకం వల్ల సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరగడమే కాకుండా, మాతా శిశు మరణాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందంటూ నీతిఆయోగ్ పేర్కొనడం తెలంగాణ ప్రభుత్వ పని తీరుకు అద్దం పడుతున్నది. గతంలో సర్కారు దవాఖానాలలో ప్రసవాల శాతం కేవలం 20 శాతంగా ఉండగా ఇప్పుడు అది 62 శాతానికి పెరిగింది.

ముఖ్యమంత్రి గారు సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా ఈ సంవత్సరం 'ఈచ్ వన్ టీచ్ వన్' పథకాన్ని ప్రవేశపెట్టారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు భద్రత, సౌకర్యాలు కల్పించారు. సగం రెసిడెన్షియల్ పాఠశాలలను బాలికల కోసం స్థాపించారు. అలాగే మహిళల, ఆడపిల్లల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా షీ టీంలను ఏర్పాటు చేసింది. మహిళా కార్మికుల శ్రమను గుర్తించి వారి ఆదాయాలను పెంచడం (అంగన్‌వాడీ, ఆశా) వంటివి మహిళల పట్ల, వారి విధుల పట్ల మన ముఖ్యమంత్రి గారి ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తున్నాయి.

ఆడపిల్లకు పెళ్ళి చేయడం కోసం ఒక కన్న తండ్రి ఎన్ని కష్టాలు పడుతున్నాడో ములుగు మండలంలో ఉన్న భాగ్య తండాలో ప్రత్యక్షంగా చూసి చలించారు ముఖ్యమంత్రి గారు. రాష్ట్రం ఏర్పడ్డాక కళ్యాణ లక్ష్మి, షాదీ ముబాకర్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆడపిల్లల కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. రాష్ట్రంలో వితంతు, ఒంటరి మహిళలు పురుషుల నుంచి సమాజం నుంచి సొంత కుటుంబం నుంచి నిరాదరణకు, అణచివేతకు గురవుతున్నారు. ఈ దుస్థితిని గమనించి ఏ రాష్ట్రంలో లేనివిధంగా వితంతు, ఒంటరి మహిళలకు, బీడి కార్మికులకు, వృద్ధులకు పింఛన్లు ఇస్తూ వారికి అండగా ఉంటున్నారు. మహిళ సంక్షేమానికి ఏటా బడ్జెట్‌లో పదివేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుంది.

విద్యతో వచ్చిన ఆత్మవిశ్వాసం, అవగాహన శక్తితో కొద్దిమంది యువతులు నింగి, నేల, నీరు అన్నిరంగాల్లో అప్రతిహతంగా ముందుకు దూసుకుపోయారు. మహిళా సమానత్వం సాధించడం అంటే పౌర సమాజం లో ఉన్న వివిధ వ్యవస్థలలో ఆధిపత్య భావజాలాన్ని రూపుమాపాలి. అందుకోసం చట్టాలను మార్చాలి. చట్టాలను అర్థవంతంగా అమలు చేయాలి. దానికి అన్నివర్గాల నుంచి సహకారం కావాలి. ప్రబలంగా నాటుకుపోయిన సాంస్కృతిక ప్రమాణాలు, వైఖరిలో కూడా మార్పు తేగలగాలి. దీనికి ముందుండి నడపడానికి దృఢమైన రాజకీయ సంకల్పం, నాయకత్వం కావాలి. అటువంటి ఉద్యమసారథి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వాన మహిళా సంక్షేమం దిశగా రాష్ట్రం పయనిస్తున్నది.



విద్యతో వచ్చిన ఆత్మవిశ్వాసం, అవగాహన శక్తితో కొద్దిమంది యువతులు నింగి, నేల, నీరు అన్నిరంగాల్లో అప్రతిహతంగా ముందుకు దూసుకుపోయారు. మహిళా సమానత్వం సాధించడం అంటే పౌర సమాజంలో ఉన్న వివిధ వ్యవస్థలలో ఆధిపత్య భావజాలాన్ని రూపుమాపాలి. అందుకోసం చట్టాలను మార్చాలి. చట్టాలను అర్థవంతంగా అమలుచేయాలి. దానికి అన్నివర్గాల నుంచి సహకారం కావాలి.

**(వ్యాసకర్త: జడ్పీటీసీ, ములుగు)**

# కరోనాతో ఆర్థికరంగమూ కుదేలు

వాణిజ్యం



**డాక్టర్ రామకృష్ణ బండారు**

చైనాలోని 'వుహాన్ పట్టణంలో బయటపడిన కరోనా వైరస్ క్రమేణా ఇతర దేశాలకు విస్తరిస్తున్నది. ఈ వైరస్ ప్రభావం ప్రపంచవ్యాప్తంగా సుమారు 61 దేశాలలో కనిపిస్తున్నది. చైనాలో అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటివరకు 2800 మంది మరణించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ వైరస్ బాధితుల సంఖ్య వేల సంఖ్యలో ఉన్నది. అయితే ఈ వైరస్ కేవలం మనుషులకే కాదు వాణిజ్యసంస్థలకు కూడా సోకింది! ఇప్పటికే 'ఆర్థిక మందగమనం'తో అల్లాడుతున్న ప్రపంచ ఆర్థికవ్యవస్థకు కరోనా సంక్షోభం 'మూలిగే నక్కపై తాటిపండు' పడినట్లయింది. కరోనా వైరస్ అంతర్జాతీయ వ్యాపారం, వాణిజ్యంపై కూడా తీవ్ర ప్రభావమే చూపిస్తున్నది. వైరస్ వలన ఇప్పటివరకు ప్రపంచ ఆర్థికవ్యవస్థ సుమారు 350 లక్షల కోట్ల మేర నష్టపోయింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తి కర్మాగారంగా విరాజిల్లుతున్న చైనాలో కరోనా వైరస్ వలన పరిశ్రమలు ఉత్పతులను ఆపేశాయి. వైరస్ బారిన పడకుండా ఉండటానికి చైనా పౌరులు ఉద్యోగాలకు కూడా వెళ్లడంలేదు. దాదాపుగా ప్రపంచంలోని అన్ని బ్రాండెడ్ సంస్థలన్నీ చైనాలో తమ ఉత్పత్తి ప్లాంట్లను కలిగి ఉన్నాయి. వైరస్ కారణంగా ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడాయి. ఫలితంగా పరిశ్రమలు నష్టాలను ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది.

కరోనా మహమ్మారి ప్రపంచ పర్యాటకరంగాన్ని కూడా దెబ్బతీస్తున్నది. పర్యాటకం వాటా ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 10.4 శాతం. ప్రపంచ ఉపాధిలో 10 శాతం వాటా కలిగిన అతి పెద్ద అంతర్జాతీయ వ్యాపారం. కానీ కరోనా వైరస్ భయంతో ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. చైనా పర్యటనకు ఇతర దేశస్థులు వెళ్లడం లేదు. ఆ దేశ పర్యాటకులను దాదాపు అన్నిదేశాలు నిషేధించాయి. అలాగే తమ దేశ ప్రజలపై విదేశీ దేశాల పర్యటనపై ఆంక్షలు విధించాయి. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో సుమారు 8.8 ట్రిలియన్స్‌గా ఉన్న పర్యాటకరంగ ఆదాయం ఈ సంవత్సరం భారీగా పడిపోయే అవకాశాలు ఉన్నట్లు 'ప్రపంచ ట్రావెల్ అండ్ టూరిజం కౌన్సిల్' ఆందోళన వ్యక్తం చేసింది. కరోనా వైరస్ ముఖ్యంగా 'ఆసియా ట్రావెల్ అండ్ టూరిజం'పై తీవ్ర ప్రభావం చూపిస్తుననది. పర్యాటకం ప్రధాన వనరుగా ఉన్న థాయిలాండ్ దేశంలో చైనా పర్యాటకుల రాకపై ఆంక్షలు విధించలేదు. కాని థాయిలాండ్ టూరిజం రెండు నెలలుగా వందల కోట్ల రూపాయలు నష్టాలు చవిచూసింది. దీనికికారణం అక్కడికి చైనీయుల సంఖ్యనే కాకుండా ఇతర దేశాల పర్యాటకుల సంఖ్య సైతం కరోనా వైరస్ వలన భారీగా పడిపోవడమే. మలేషియా, సింగపూర్ వంటి దేశాలలోనూ కరోనా వైరస్ భయంతో పర్యాటకుల సంఖ్య తగ్గింది. ఫలితంగా అక్కడి పర్యాటక సంస్థలు భారీగా నష్టపోతున్నాయి. ఇరాన్ దేశంలో కరోనా మరణాలు చోటు చేసుకున్నాయి. అంతేకాదు వైరస్ బాధితుల సంఖ్య పెరుగుతున్నది. దీంతో చుట్టుపక్కల దేశాలైన అర్మీనియా, పాకిస్థాన్, టర్కీ దేశాలు ఇరాన్ దేశ సరిహద్దులు మూసేశాయి. కువైట్, ఆఫ్ఘనిస్థాన్, బహ్రెయిన్, ఒమన్, టర్కీ దేశాలు అంతర్జాతీయ పర్యాటకుల రాకపై ఆంక్షలు విధించాయి. ఇటలీలోనూ ఇదే పరిస్థితి. ఫలితంగా యూరప్ దేశాలు అప్రమత్తమయ్యాయి. తమ దేశ ప్రజల పర్యటనలపై ఆంక్షలు విధిస్తున్నాయి. ఇటలీ ప్రభుత్వం వెనిస్ కార్నివాల్, ఒపెరా షోలు, సాకర్ మ్యాచ్‌లు రద్దు చేసింది. కరోనా వైరస్ కారణంగా అమెరికా ట్రావెల్ అండ్ టూరిజం తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నది. సుమారు 5 బిలియన్ డాలర్ల వరకు ఆదాయం 2020లో నష్టపోతామని అక్కడి పర్యాటక సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కరోనాతో ఫ్రాన్స్‌లో పర్యాటకుల సంఖ్య సుమారు 40 శాతం తగ్గింది అని ఆ దేశం ప్రకటించింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలలోని పర్యాటక ప్రాంతాలు పర్యాటకులు లేక వెల వెల బోతున్నాయి. అన్నిదేశాల 'విమానయాన రంగం' తీవ్ర సంక్షోభంలోకి వెళ్లింది. ఈ వైరస్ వలన ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగం సుమారు 29.3 బిలియన్ల వరకు నష్టపోనుందని 'ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్పోర్టేషన్' అంచనా వేసింది. గత రెండు మాసాలుగా ప్రపంచవ్యాప్తంగా పర్యాటకుల సంఖ్య సుమారు 8 శాతం మేర తగ్గింది.

ప్రపంచ జీడీపీలో సుమారు 16.3 శాతం వాటా ఉన్న చైనా దేశంలో వచ్చిన సంక్షోభం అన్నిదేశాల ఆర్థిక మూలలను కుదుపుతున్నది. కరోనా వైరస్ వలన చైనాలో ఇప్పటికే 15శాతానికి పైగా ఆర్థికవ్యవస్థ దిగజారింది. వైరస్ కారణంగా చైనా మార్కెట్‌కు ఎగుమతి చేసే అమెరికా, భారత్, ఇతర దేశాలు బేజార్ అవుతున్నాయి. ముడిసరుకు కోసం చైనాపై ఆధారపడ్డ దేశాలలోని ఆయా రంగాలు కూడా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి. విడిభాగాలు, యంత్రాలు, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాలు ఇతరత్రా వస్తువుల తయారీకోసం చైనా దిగుమతులపై ఆధారపడ్డ దేశాలలో ఇప్పటికే 5 నుంచి 10 శాతానికి ఆయా వస్తువుల ధరలు పెరిగాయి. చైనాకు ఎగుమతులు నిలిచి, ఆయారంగాలపై ఆధారపడ్డ వారు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు. రోజురోజుకు పరిశ్రమల నష్టాలు పెరిగిపోవడంతో ప్రపంచ స్టాక్ మార్కెట్లు సైతం కుదేలవుతున్నాయి. స్టాక్ మార్కెట్లలో ఆయా కంపెనీల వాటాలు క్షీణిస్తున్నాయి. దానితో అన్నిరంగాల వాటాల విలువలు తగ్గడమే కాకుండా లక్షల కోట్ల రూపాయల 'మదుపరుల' సంపద ఆవిరైపోతున్నది. వైరస్ ఇతర దేశాలకు విస్తరిస్తుండటంతో మును ముందు పరిశ్రమలు నష్టాలను పొందవచ్చని ఆందోళన చెందుతున్నారు. 'మదుపరులు' తమ పెట్టుబడులను బంగారం, వెండి వంటి వాటిపై మళ్లిస్తున్నారు. అందుకే మార్కెట్లో పుత్తడి విలువలో పెరుగుదల కనిపిస్తున్నది. ఇటు 'ఆర్థిక కార్యకలాపాలు' మందగించి చమురు డిమాండు తగ్గి అంతర్జాతీయ ముడిచమురు ధరలు భారీగా పతనమవుతున్నాయి. ఫలితంగా అన్నిదేశాల స్టాక్‌మార్కెట్లు నష్టాలను చవిచూస్తున్నాయి.

ప్రపంచంలో అత్యంత సురక్షితమైన పెట్టుబడిగా భావించే, అమెరికా 'ప్రభుత్వ బాండ్స్' రాబడి కూడా రికార్డుస్థాయికి పడిపోయింది. 2008 సంవత్సరం తరువాత ప్రపంచ మార్కెట్లు ఇంతగా పడిపోవడం ఇదే మొదటిసారి. అంతేకాక, ఎరువులు, పౌల్ట్రీ, ఆక్వా, వ్యవసాయం, తయారీరంగాలకు చెందిన ఎగుమతి, దిగుమతి వ్యాపారం తీవ్రంగా నష్టపోతున్నది. నిరుద్యోగం పెరిగే అవకాశం కూడా ఉన్నది. భవిష్యత్తులో పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని అంతర్జాతీయ వ్యాపార నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఒక దేశంలో వచ్చిన ఆరోగ్య సమస్య ప్రపంచ ఆర్థికవ్యవస్థపై ఇంతగా ప్రభావం చూపించడం ఇదే మొదటిసారి.



ప్రపంచ జీడీపీలో సుమారు 16.3 శాతం వాటా ఉన్న చైనా దేశంలో వచ్చిన సంక్షోభం అన్నిదేశాల ఆర్థిక మూలలను కుదుపుతున్నది. కరోనా వైరస్ వలన చైనాలో ఇప్పటికే 15 శాతానికి పైగా ఆర్థికవ్యవస్థ దిగజారింది. వైరస్ కారణంగా చైనా మార్కెట్‌కు ఎగుమతి చేసే అమెరికా, భారత్, ఇతరదేశాలు బేజార్ అవుతున్నాయి. ముడిసరుకు కోసం చైనాపై ఆధారపడ్డ దేశాలలోని ఆయారంగాలు కూడా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి.

**(వ్యాసకర్త: యూజీసీ పోస్ట్ డాక్టోరల్ ఫెలో,కామర్స్ విభాగం, ఓయూ)**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com



మంగళవారం నిజామాబాద్‌లోని ఓ డివిజన్‌లో మొక్కనాటి ట్రీగార్డు ఏర్పాటు చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా తదితరులు

## అభివృద్ధికి ప్రాధాన్యం

**మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

**పట్టణాలను** పచ్చగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని గృహనిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ నగరంలో ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మేయర్ నీతూకిరణ్‌తో కలిసి మంత్రి పర్యటించారు. మురుగుకాల్వలను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విరివిగా మొక్కలు నాటేందుకు మంగళవారం 'హరితహారం-డే'గా నామకరణం చేసి అందరితో మొక్కలు నాటించడంపై కలెక్టర్ నారాయణరెడ్డిని మంత్రి అభినందించారు.



సిద్దిపేట జిల్లా దుబ్బాకలో స్మృతివనం పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి



ఖమ్మం జిల్లా వైరాలో పర్యటించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

# వడివడిగా ప్రగతివైపు

### ముమ్మరంగా పట్టణ ప్రగతి కార్యాచరణ

### మారుతున్న పట్టణాల రూపురేఖలు

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** పట్టణప్రగతి కార్యాచరణ అమలులో భాగంగా వార్డులు, డివిజన్లలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. అభివృద్ధి పనులతోపాటు పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపడుతుండటంతో పట్టణాల రూపురేఖలు మారిపోతున్నాయి. పట్టణ ప్రగతిలో తొమ్మిదో రోజైన మంగళవారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నా రు.

**పరిశుభ్రతకే పట్టణప్రగతి**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే పట్టణ ప్రగతి లక్ష్యమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. పట్టణ ప్రగతిలో భాగంగా మంగళవారం వారు కరీంనగర్‌లోని 16వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీధులను, మురుగుకాల్వలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలన్నారు. చెట్లతోనే పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలుంటే అందులో పిల్లల కోసం పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వీరి వెంట ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మేయర్ వై సునీల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

**స్వచ్ఛతలో ఆదర్శం: హరీశ్‌రావు**

అభివృద్ధి, సంక్షేమంలో దేశంలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉన్నదని, పట్టణాలు, పల్లెలు సైతం మొదటి స్థానంలో నిలువాలనే సదుద్దేశంతో.. ప్రభుత్వం పల్లెప్రగతి, పట్టణప్రగతి కార్యక్రమాలు చేపట్టిందని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. ప్రజలు తమ పట్టణాలను, గ్రామాలను స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుపాలని కోరారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డితో కలిసి పట్టణప్రగతి పనులను మంత్రి పర్యవేక్షించారు. స్మృతివనంలో మొక్కలు నాటడంతోపాటు రూ.50 లక్షలతో మహిళా భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్త మున్సిపల్ చట్టం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని చెప్పారు. అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతి నెలా పట్టణాలకు రూ.78 కోట్లు, పల్లెలకు రూ.339 కోట్లు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే ఇండ్లులేక అద్దెకుంటున్న వారికి రూపాయి ఖర్చులేకుండా డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందజేస్తామన్నారు. జాగ లేని పేదోళ్లకు డబుల్ బెడ్‌రూం, గుడిసె ఉన్న పేదోళ్లకు అక్కడే ఇల్లు కట్టుకునేందుకు సాయం అందించనున్నదని తెలిపారు. ఈవిషయంలో త్వరలోనే సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారన్నారు.



కరీంనగర్‌లోని 16వ డివిజన్‌లో పర్యటిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు తదితరులు

**పట్టణాభివృద్ధికి కృషిచేయాలి: అల్లోల**

పట్టణాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. నిర్మల్ జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్, బంగల్‌పేట్ తదితర వార్డుల్లో మంగళవారం నిర్వహించిన పట్టణ ప్రగతిలో కలెక్టర్ ముషారఫ్‌అలీఫారూఖీతో కలిసి పాల్గొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిర్మల్‌లోని 42 వార్డుల్లో కౌన్సిలర్లు, ప్రజలు, అధికారులు గుర్తించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు.

**నిరంతరం కొనసాగాలి: పువ్వాడ**

పట్టణ ప్రగతి కార్యక్రమం నిరంతరం కొనసాగాలని, పట్టణాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా వైరాలో ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌తో కలిసి మంత్రి పట్టణప్రగతి కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన వైరా మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. 4వ వార్డులో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాన్ని కూల్చివేసి ఆ స్థలాన్ని అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. వైరా రిజర్వాయర్ వద్ద రూ.5 కోట్లతో చేపడుతున్న మినీ ట్యాంక్‌బండ్ పనులను మంత్రి పరిశీలించారు.

**పట్టణాలను మార్చుకుందాం: మల్లారెడ్డి**

'మనం మారుదాం.. మన పట్టణాలను మార్చుకుందాం' అని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణప్రగతిలో భాగంగా మంగళవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లిలో కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లుతో కలిసి సుమారు రూ.2.64 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. పట్టణ ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకొని పట్టణాలను తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధికి చిరునామాగా మార్చుతున్నదన్నారు.



మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లిలో శ్మశానవాటిక నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి. చిత్రంలో కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ వార్డులో పర్యటిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూకీ



కర్రపెండలాన్ని పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## కర్రపెండలంతో అధికలాభాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కర్రపెండలం, ఆముదం పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. కర్రపెండలం సాగుకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మంచి డిమాండ్ ఉన్నదని చెప్పారు. మంగళవారం తమిళనాడులోని సేలం సమీపంలోని ఏతాపూర్‌లో కర్రపెండలం, ఆముదం పరిశోధన కేంద్రాలను తెలంగాణ విత్తనాభివృద్ధిసంస్థ ఎండీ డాక్టర్ కేశవులుతో కలిసి మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. పంటమార్పిడితో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. వర్షాధారంతోపాటు ఆరుతడి పంటగా కూడా కర్రపెండలం సాగుచేసుకోవచ్చని చెప్పారు. కర్రపెండలం నుంచి సగ్గుబియ్యం, గంజిపొడి, చిప్స్ తయారుచేసుకోవచ్చని చెప్పారు. వస్త్రపరిశ్రమతోపాటు 18 రకాల వస్తువులు తయారీలోనే దీన్ని ఉపయోగిస్తున్నారన్నారు. ఏడు నుంచి పది నెలల కాలంలో పంట చేతికొస్తుందని.. ఆరుతడితో ఎకరాకు 15 టన్నుల దిగుబడి వస్తుందని చెప్పారు.

## వేడుకొన్న వెంటనే..

- నిరుద్యోగులకు ఉపాధి
- మంత్రి కేటీఆర్ హామీని నేరవేర్చిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఇద్దరికి ఉద్యోగాలు

**మహబూబ్‌నగర్, నమస్తేతెలంగాణ:** తన కొడుకుకు ఉపాధి కల్పించాలని ఓ తల్లి మంత్రి కేటీఆర్‌ను వేడుకున్న తొమ్మిది రోజుల్లోనే ఉద్యోగం కల్పించారు. గత నెల 24న పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు జిల్లాకేంద్రానికి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వచ్చారు. అనంతరం ఆయన పాతతోట ప్రాంతంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పర్యటించారు. ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో వేణమ్మ అనే గృహిణి తమ గోడును మంత్రుల ముందు వెళ్లబోసుకున్నది. తనకు ముగ్గురు కుమారులని.. వీరిలో ఒక్కరికైనా ఉద్యోగం ఇప్పించాలని ప్రాధేయపడింది. వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్.. ఎలక్ట్రీషియన్ కోర్సు పూర్తిచేసిన సతీష్‌కు ఉద్యోగం ఇప్పించాలని పక్కనే ఉన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సూచించారు. ఇచ్చిన హామీ మేరకు మంగళవారం సతీష్‌కుమార్‌కు జిల్లా జనరల్ దవాఖానలో ఎలక్ట్రీషియన్‌గా అవుట్ సోర్సింగ్ పద్ధతిపై ఉద్యోగఅవకాశం కల్పిస్తూ నియామక పత్రాన్ని కలెక్టర్ వెంకట్రావుతో కలిసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. కాగా చైతన్య అనే మహిళ సైతం తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని వేడుకోగా.. ఆమెకూ ప్రభుత్వ దవాఖానలో ఉద్యోగం కల్పిస్తూ నియామకపత్రం అందజేశారు. తమకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించడంపై ఆనందం వ్యక్తం చేసిన సతీష్, చైతన్య మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



సతీష్‌కు ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ వెంకట్రావు

## సింగరేణి పరీక్షపై విచారణ

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సింగరేణి సంస్థలో 68 మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఈఅండ్‌ఎం) పోస్టుల రాత పరీక్షలో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ పట్టుబడిన ఘటనపై విచారణ కొనసాగుతున్నది. రోజుకో మలుపు తిరుగుతున్న ఈ రాత పరీక్ష వ్యవహారంలో సింగరేణి అధికారుల పాత్ర ఉన్నట్టు కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్ష రాసేందుకు ఢిల్లీలోని ఏజెంట్ ద్వారా విమానంలో హైదరాబాద్‌కు.. అక్కడి నుంచి కార్లలో కొత్తగూడేనికి చేరుకున్న హర్యానాకు చెందిన ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితోపాటు ముగ్గురు డ్రైవర్లు, ఇద్దరు గైడ్ మీడియేటర్లను కూడా పోలీసులు విచారిస్తున్నారు. అయితే ఒక కారులో వచ్చిన వారు మాత్రమే పోలీసుల అదుపులో ఉన్నారని తెలిసింది. మిగతా రెండు కార్లలో వచ్చిన వ్యక్తులెవరు?.. వారు ఎవరి స్థానంలో పరీక్షలు రాశారనే విషయం తెలియాల్సి ఉంది. ఈ పరీక్షల గుట్టు రట్టు చేసేందుకు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ సునీల్‌దత్ సమగ్రంగా విచారిస్తున్నట్టు సింగరేణి అధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు. నిందితులు ఒక్క సింగరేణి పరీక్షలే కాకుండా ఎంసెట్, నీట్, గేట్, జేఈఈ మెయిన్ తదితర పోటీ పరీక్షలు కూడా రాస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలావుండగా సోమవారం భోజన విరామ సమయం తరువాత సింగరేణి కార్పొరేట్ సేఫ్టీ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న హరీశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది.

## రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

**జీఎంల సమావేశంలో సింగరేణి సీఎండీ శ్రీధర్ ఆదేశాలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నెలాఖరుతో పూర్తవుతున్నందున రోజుకు 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితోపాటు రవాణాచేయాలని జీఎంలను సింగరేణి సీఎండీ శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంగళవారం అన్ని ఏరియాల జీఎంలు, డైరెక్టర్లతో నెలవారీ ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ..బొగ్గు ఉత్పత్తితోపాటు ఓపెన్‌కాస్ట్ గనుల్లో రోజుకు కనీసం 13 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించాలని ఆదేశించారు.

**● పునరావాసం దిశగా..**



కాళేశ్వరం ప్యాకేజీ-10లోని అనంతగిరి ముంపు బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళ వారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి ముంపు గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ముంపునకు గురయ్యే 118 కుటుంబాల్లో ఖాళీ చేయని ఆరు కుటుంబాల వారితో ఎమ్మెల్యే మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి ఇండ్లు ఖాళీ చేయించారు. - ఇల్లంతకుంట

## దళితుల భూముల ఆక్రమణ దుర్మార్గం

**రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి**

**ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు**



గువ్వల బాలరాజు

**అచ్చంపేట రూరల్:** దళితుల భూములను అక్రమంగా కబ్జా చేసుకుంటూ.. మంత్రి కేటీఆర్ ఫాంహౌస్‌పై దాడికి పూనుకున్న రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. గోపన్‌పల్లిలో లక్ష్మయ్య అనే రైతు వద్ద 31 గుంటల భూమి కొన్న రేవంత్ 1.29 ఎకరాలు కొన్నట్టు రికార్డులు సృష్టించడం దుర్మార్గపు చర్య అన్నారు. మంత్రి కేటీఆర్ ఫాంహౌస్‌ను లీజుకు తీసుకున్నట్టు ఆధారాలున్నా రేవంత్ అసంబద్ధ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 'వందల ఎకరాల భూస్వామిని' అంటూ సంకలు గుద్దుకున్న నువ్వు హైదరాబాద్ సమీపంలో కబ్జాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇకనైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు.

## రేవంత్‌ను అరెస్ట్ చేయాలి

**ఎమ్మార్పీఎస్ నేత మేడి పాపయ్య**



మేడి పాపయ్య

**ముషీరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ భూములు కబ్జాచేసిన కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి తన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి ఇతరులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఇంచార్జి మేడి పాపయ్య మాదిగ ధ్వజమెత్తారు. కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించిన రేవంత్‌రెడ్డిని వెంటనే అరెస్టుచేసి, భూములను పేదలకు పంచాలని డిమాండ్‌చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రోడ్లను ఆక్రమించి గేట్లు పెట్టుకోవడమే కాకుండా ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములుగా చిత్రీకరించి రియల్ దందా నడిపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ తన భూబాగోతాన్ని కప్పిపుచ్చుకొనేందుకు మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ కవితపై ఆరోపణలుచేసి తప్పించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఆక్రమించుకున్న భూములను అధికారులు స్వాధీనం చేసుకోని పక్షంలో వాటిని కాపాడుకొనేందుకు ఎమ్మార్పీఎస్ ముందుకు వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## గోదావరి పరుగులు

**కాళేశ్వరం లింక్-1, 2లో దిగ్విజయంగా ఎత్తిపోతలు**

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** గోదారమ్మ మురిసిపోతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా దిశను మార్చుకొని ఎదురెక్కుతూ వందల కిలోమీటర్లమేర పాలకడలిలా విస్తరిస్తున్నది. ఇక్కడి లింక్ -1,2లో మోటర్లు దిగ్విజయంగా నడుస్తుండగా, గోదావరి అజేయంగా రైతన్న బీళ్లకు పరుగులు తీస్తున్నది. దిగువన భూపాలపల్లి జిల్లాలో లక్ష్మి పంప్‌హౌజ్‌లో ఎత్తిపోతలు కొనసాగుతుండగా, ఇక్కడ పెద్దపల్లి జిల్లాలోనూ పంపులు నిర్విరామంగా నడుస్తున్నాయి. మంథని మండలం కాసిపేటలోని సరస్వతి పంప్‌హౌజ్‌లో మంగళవారం 2వ మోటర్ ద్వారా ఎత్తిపోతల కొనసాగుతున్నది. 2,900 క్యూసెక్కుల నీరు పార్వతి బరాజ్‌లోకి చేరుతున్నది. పార్వతి పంప్‌హౌజ్ ద్వారా ఎగువన ఎల్లంపల్లి బరాజ్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఇక్కడ 3, 6వ మోటర్లను నడిపిస్తుండగా, ఒక్కో మోటర్ ద్వారా 2,610 క్యూసెక్కుల చొప్పున 5,220 క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి బరాజ్‌లోకి చేరుతున్నది. ఇక లింక్-2లో భాగంగా ధర్మారం మండలం నందిమేడారంలోని నందిపంప్‌హౌజ్‌లో 3, 4వ మోటర్ల ద్వారా మొత్తం 6,300 క్యూసెక్కులు నంది రిజర్వాయర్‌లోకి తరలుతున్నది. ఇక్కడి నుంచి కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్‌కు తరలుతున్నాయి. ఇక్కడ 2, 4వ పంపులతో మొత్తం 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నాయి. మంగళవారం సాయంత్రం 6 వరకు ఇక్కడ 13.525 టీఎంసీలు ఎత్తిపోసినట్టు అధికారులు తెలిపారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా జగిత్యాల జిల్లా రాంపూర్‌లో నిర్మించిన పంప్‌హౌజ్ నుంచి 4, 7వ యూనిట్ల నుంచి నీటిని ఎత్తిపోస్తున్నారు.



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్ నుంచి గ్రావిటీ కాల్వలో నిండుగా ప్రవహిస్తున్న కాళేశ్వర జలాలు

**ఎస్సారార్@ 25.873 టీఎంసీలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి ఎల్‌ఎండీకి మంగళవారం 6,441 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 25.873 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎల్‌ఎండీ రిజర్వాయర్‌లోకి మంగళవారం 7,759 క్యూసెక్కులు వస్తుండగా, 5,838 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్లింది. ఎల్‌ఎండీలో ప్రస్తుతం 11.574 టీఎంసీలు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

## చింతలపాలెంలో భూప్రకంపనలు

**రిక్టర్ స్కేలుపై 2.8గా నమోదు**

**చింతలపాలెం:** సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలకేంద్రం, పలు గ్రామాల్లో మంగళవారం భూమి కంపించింది. కొద్ది రోజులుగా వస్తున్న భూప్రకంపనాలు ఆగిపోవడంతో ప్రజలు ప్రశాంతంగా ఉన్న సమయంలో మరోసారి మంగళవారం 12 సార్లు భూమి కంపించినట్టు స్థానికులు తెలిపారు. మధ్యాహ్నం రెండుసార్లు భారీ శబ్దాలతో కంపించడంతో ప్రజలు భయాందోళనకుగురయ్యారు. రిక్టర్‌స్కేలుపై 2.8గా నమోదైనట్టు తాసిల్దార్ కమలాకర్ తెలిపారు.

## 8న టీయూడబ్ల్యూజే మహాసభలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర మహాసభలు ఈ నెల 8న హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. మంగళవారం సచివాలయంలో జరిగిన సెక్రటేరియట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. న్యాయపరమైన సమస్యల కారణంగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడంలో ఆలస్యం అవుతున్నదని చెప్పారు. జర్నలిస్టులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నమస్తే తెలంగాణ

# జిందగీ

బుధవారం 4 మార్చి 2020 WWW. NTNEWS.COM /nt.zindagi





# పిల్లలకోసం గురువైన తల్లి

**అవసరం.. మనిషితో ఏ పనైనా చేయిస్తుంది, ఎంతటి కష్టానైన్నా ఎదుర్కొనే శక్తినీ ఇస్తుందనడానికి ఈమె ఓ ఉదాహరణ. ఎందుకంటే అమెరికా నుంచి అర్థాంతరంగా ఇండియాకు వచ్చి బిడ్డలకు చదువు చెప్పేందుకు తానే ఓ గురువుగా మారింది మరి. తన పిల్లలకు ఇష్టమైన రోబోటిక్స్ చెప్పేందుకు కంప్యూటర్లతో కుస్తీ పట్టింది. ఇంటర్‌నెట్‌ను జల్లెడ పట్టింది. తన బిడ్డలతో పాటు పేద విద్యార్థులనూ ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి, అంతర్జాతీయ వేదికలపై వారిని విజేతలుగా నిలబెట్టింది. ఆమె వరంగల్‌కు చెందిన దేవులపల్లి ప్రసూన అలియాస్ రోబోటిక్స్ ప్రసూన.**

**సమీప** భవిష్యత్ అంతా రోబోలదే. ఉద్యోగావకాశాలు మొదలుకొని ఉపాధి, వైద్యం, సాంకేతిక రంగాల్లో రోబోల ప్రాధాన్యం పెరిగిపోతున్నది. అందుకే రోబోటిక్స్ విద్యపై ప్రపంచం మొత్తం దృష్టిపెడుతున్నది. ఈ విద్యలో మెళు కువలు నేర్చుకునేందుకు మన భావితరం కూడా అంతే ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. మెరుగైన నైపుణ్యం కలిగిన రోబోటిక్స్ విద్య పూర్తిస్థాయిలో మనకు అందుబాటులోకి రాలేదు. అందుకే ఓ తల్లిగా పిల్లలకు బంగారు భవిష్యత్ అందించాల్సిన ప్రసూన.. రోబోటిక్స్ గురువుగా అవ తారం ఎత్తింది. ఇందుకోసం ఎన్నో నిద్రలేని రాత్రులను త్యాగం చేసింది. దాని ఫలితంగా ప్రసూన శిక్షణ ఇచ్చిన విద్యార్థులంతా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రోబో టిక్స్‌లో అద్భుతాలు సృష్టిస్తున్నారు.

### ఎవరీ ప్రసూన?

వరంగల్ జిల్లా హన్మకొండ ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన దేవులపల్లి రవికుమార్, ప్రసూన దంపతులు ఉద్యోగరీత్యా అమెరికాలోని క్యాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. 2008లో వారి కుమారులు సుహాస్ (2వ తరగతి), అర్నవ్ (1వ తరగతి) అక్కడే మిచిగాన్ సిటీలోని లారెన్స్ యూనివర్సి టీలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. బిడ్డల ఆస క్తిని గమనించిన తల్లితండ్రులు వారికి రోబొటిక్స్‌లో శిక్షణ ఇప్పించడం మొదలు పెట్టారు. అనుకోకుండా కొన్ని కార ణాలరీత్యా ప్రసూన దంపతులు పిల్లలతో సహా 2010లో హైదరాబాద్‌కు వచ్చేశారు. నగరంలోని మియాపూర్‌లో స్థిరపడ్డారు. ఆ సమయంలో ఇక్కడ రోబోటిక్స్‌పై అంతగా అవగాహన లేకపోవడం, ఎక్కడా ఒక్క శిక్షణ కేంద్రం లేక పోవడంతో తల్లిస్థానంలో ఉన్న ప్రసూన గురువు బాధ్య తలు స్వీకరించింది. బీఎస్సీ మైక్రో బయాలజీ చేసిన ప్రసూన అమెరికాలోని స్కూల్స్‌లో వలంటీర్‌గా పనిచే సింది. ఆ అనుభవంతో రోబోటిక్స్‌పై దృష్టి సారించింది. ఇంటర్నెట్‌తో పాటు అమెరికాలోని మిత్రులు, రోబోటి క్స్‌లో నైపుణ్యం కల్గిన వారి సహకారంతో తాను రోబోటి క్స్‌లో మెళకువలను నేర్చుకున్నది. ఆ సబ్జెక్టును వారి పిల్ల లకు నేర్పించడం మొదలు పెట్టింది. దీంతో సుహాస్, అర్న వ్‌లో రోబోటిక్స్‌లో ఆరితేరారు. అంతర్జాతీయ స్థాయి వేది కలపై సత్తా చాటడం మొదలు పెట్టారు.

### అన్నీ తానై..

నేర్చుకున్న విద్యను కేవలం తమ పిల్లలకు మాత్రమే పరి మితం చేయకుండా నిరుపేద విద్యార్థులకు బోధించాలని నిర్ణయించుకుంది ప్రసూన. దీంతో మియాపూర్, మదీన గూడ ప్రభుత్వ పాఠశాలలోని కొందరు చురుకైన విద్యా ర్థులను ఎంపిక చేసుకున్నది. వారికి రోబోటిక్స్‌లో శిక్షణ ఇవ్వడం మొదలు పెట్టింది. రోబోటిక్స్ అంటే ఖర్చుతో కూడుకున్న విద్య. రోబో తయారీ కిట్ రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. ఆ కిట్‌లను సైతం స్వయంగా తానే సమకూర్చుకొని పాఠశాల విద్యార్థులకు శిక్షణ కొనసాగించింది. 2016లో ఐఐటీ హైదరాబాద్‌లో రీజినల్ స్థాయి రోబో కాంపిటేషన్‌కు సన్నాహాలు జరుగు తుండగా.. మియాపూర్, మదీనగూడ ప్రభుత్వ పాఠశాల లతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో 16 టీమ్‌లను సిద్ధం చేసి పోటీలకు పంపించింది.

### 100 మందికి పైగా శిక్షణ..

నాలుగేండ్లలో మియాపూర్, మదీనగూడ ప్రభుత్వ పాఠ శాలల నుంచి దాదాపు 100 మందికి పైగా విద్యార్థులకు రోబోటిక్స్‌లో శిక్షణ ఇచ్చింది ప్రసూన. 2017లో మియా పూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన టీమ్ అంతర్జాతీయ స్థాయి రోబో ఫెస్ట్‌కు ఎంపికయి, అమెరికా వెళ్లే స్థోమత లేక ఆగిపోయారు. గతేడాది గుర్‌గావ్‌లో జరిగిన వరల్డ్ రోబోట్ ఒలంపియాడ్‌లో మియాపూర్, మదీనగూడ విద్యార్థులు స్పెషల్ జ్యూరీ అవార్డు దక్కించుకున్నారు. ఈ ఏడాది జనవరిలో ఆగాఖాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరి గిన 'ఫస్ట్ లెగో లీగ్'లో క్రియేటీవ్ ప్రోగ్రామింగ్, ఇన్నోవే షన్ ప్రాజెక్ట్ అవార్డులు కైవసం చేసుకున్నారు ప్రసూన విద్యార్థులు. అదే నెలలో హైదరాబాద్‌లోని కీస్టోన్ స్కూల్‌లో జరిగిన రిజీనల్ రోబో ఫెస్ట్‌లో మియాపూర్ స్కూల్‌కు చెందిన కార్తీక్, అమరేశ్వర్, శకాంక్(6వ తరగ తి)ల బృందం ఈ ఏడాది మేలో అమెరికాలోని మిచిగాన్ సిటీ లారెన్స్ యూనివర్సిటీలో జరిగే వరల్డ్ రోబో ఫెస్ట్‌కు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 22, 23 తేదీల్లో చెన్నైలోని వెళ్ల మాల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రసూన స్టూడెంట్స్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఈ పోటీ ఫలితాలను రిజర్వులో ఉంచారు.

... వినయకుమార్ పుట్ట
(చందానగర్ – నమస్తే తెలంగాణ)

#### జూలైలో రోబో ఫెస్ట్



నా శిష్యులు జాతీయస్థాయి పోటీల్లో గెలిచి, అంతర్జాతీయ స్థాయి రోబోఫెస్ట్‌కు ఎంపికవ్వడం గర్వ కారణం. మన హైద రాబాద్‌లో జాతీయ స్థాయి రోబో కాంపి టేషన్స్ జరగాలన్నదే నా ఆకాంక్ష. జూలైలో హైటెక్స్‌లో నేషనల్ రోబో ఫెస్ట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రోబో టిక్స్ పట్ల నగరంలో ఇంకా అవగాహన, కొత్త దనం అవసరం. రోబోటిక్స్ వల్ల క్రియేటివిటీ, ట్రబుల్ షూటింగ్, కాన్ఫిడెన్స్, కమ్యూనికేషన్స్, టీమ్ వర్క్ పెరుగుతాయి.

**- ప్రసూన,**
టిక్స్ రోబోటిక్స్ వ్యవస్థాపకురాలు

#### మా సత్తా చాటుతాం



మాకు రోబోటిక్స్ అంటే ఏంటో తెలియదు. అలాంటిది ఇప్పుడు వరల్డ్ రోబో ఫెస్ట్‌కు ఎంపి కయ్యే స్థితికి తీసుకెళ్లింది ప్రసూన మేడం. రెండు సంవత్సరాలుగా మాకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నది. వరల్డ్ రోబో ఫెస్ట్‌కు వెళ్లేందుకు దాతలు సహకరిస్తే ఖచ్చితంగా మా సత్తా చాటుతాం. అంతర్జాతీయ వేదికపై భారతదేశ జెండాను రెపరెపలాడిస్తాం.

**- కార్తీక్, అమరేశ్వర్, శశాంక్.**
వరల్డ్ రోబో ఫెస్ట్‌కు ఎంపికైన విద్యార్థులు

#### ఆర్థిక వనరుల లేమి



మా విద్యార్థులు సైతం ప్రసూన ఆలో చనలకు అనుగు ణంగా రాణిస్తూ జాతీయ, అంతర్జా తీయ స్థాయి పోటీ లకు ఎంపికవుతు న్నారు. త్వరలో అమెరికా మిచిగాన్ సిటీలోని లారెన్స్ యూనివర్సిటీలో జరుగనున్న వరల్డ్ రోబో ఫెస్ట్‌కు నిరుపేద విద్యార్థులు ఎంపిక య్యారు. వారికి తగిన ఆర్థిక వనరులు లేక సత మతమవుతున్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చిన్నారు లకు చేయుతనందిస్తే బాగుంటుంది.

**- సయ్యద్ యూసుఫ్,**
ప్రధానోపాధ్యాయుడు, మదీనగూడ పాఠశాల

## అక్షరదీపంతో వెలుగులు



**అక్కడి మహిళలు పట్టపగలు ఇంట్లో నుంచి ఒంటరిగా బయటకు అడుగు పెట్టడానికి వెనకాడుతుంటారు. సామాజిక అంశాలపై సరైన అవగాహన లేక పలు సమస్యలతో సతమతమవుతుం టారు. వీటన్నింటికీ కారణం అక్షరాస్యత లేకపోవడమేనని గ్రహిం చింది ఆ జిల్లా కలెక్టర్. అక్కడి గ్రామీణ ప్రాంతాల్లో అక్షరదీపంతో వెలుగులు నింపింది.**

మధ్యప్రదేశ్‌లోని తికంగర్ జిల్లా గ్రామీణ ప్రాంతంలోని మహిళలు సరైన విద్య లేక వెనుకబడుతున్నారు. అటువంటి వారిలో సరికొత్త మార్పు తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టింది జిల్లా కలెక్టర్ హర్షికా సింగ్. 2012 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె గతేడాది తికంగర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టింది. జిల్లాలోని సమస్యలను తెలుసుకోవడానికి ప్రత్యేకంగా పరి శోధన చేసింది. గ్రామీణ ప్రాంతంలో ప్రసూతి మరణాల సంఖ్య ఎక్కువగా ఉన్నది. చదువు మధ్యలో మానేసిన వారితోపాటు అసలు అక్షరాస్యత లేని వారు మరింతమంది ఉన్నారు. పురుషాధిక్యత, సరైన శుభ్రత పాటించకపోవడం వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఆమె పరిశోధనలో వెల్లడైంది. మహిళల్లో అక్షరాస్యత లేకపోవడమే కారణమనే విషయాన్ని గ్రహించింది. వెంటనే గ్రామీణ ప్రాంతాల్లో అక్ష రాస్యతను పెంచేందుకు సిద్ధమయింది హర్షికా సింగ్. 'మ హిళా జ్ఞానాలయాలు' పేరుతో ప్రతి గ్రామపంచాయతీలో ఓ భవనాన్ని నిర్మించింది. స్థానికంగా డిగ్రీ చదివిన వారిని ఉపా ధ్యాయులుగా నియమించింది. సామాజిక అంశాలపై వర్క్ షాప్ నిర్వహించింది. వయోజన విద్యను ప్రోత్సహించేలా గ్రామస్తుల్లో చైతన్యం తీసుకువచ్చింది. పొలం పనులకు వెళ్లే వారు, ఇంటి దగ్గర ఉండే మహిళలకు వారి తీరిక సమ యాల్లో గంటపాటు పాఠాలు నేర్చుకునేలా తరగతులను ఏర్పాటు చేసింది. అలా వందల గ్రామాల్లోని మహిళలను అక్షరాస్యులుగా మార్చి వారి జీవితాల్లో కొత్త వెలుగులను నింపింది. 'విద్య అనేది జ్ఞానాన్ని ఇవ్వడమేకాకుండా, సామా జిక అంశాలపై చైతన్యం పెంచుతుందని హర్షిక చెబుతు న్నారు. మరికొన్ని గ్రామాల్లో అక్షరాస్యత పెంచేపనిలో నిమ గ్నమైంది హర్షికాసింగ్.

## ఉప్పు ఎక్కువైతే?



- సూప్‌లో అనుకోకుండా ఉప్పు ఎక్కువైతే.. సగం తరిగిన ఆలూముక్కను సూప్‌లో వేయాలి. 15 నిమిషాల తర్వాత తక్కువ మంటతో వేడి చేస్తే సరిపోతుంది. తర్వాత ఆలుముక్కను తీసేయొచ్చు.
- పుదీనా, మిరియాలపొడి వంటి వాటిని సూప్‌లలో ఎక్కువగా చేర్చండి. అప్పుడు ఉప్పు తక్కువ పడుతుంది.
- సూప్‌లు చిక్కగా రావాలంటే.. మీకు నచ్చిన కూరగాయల్ని ఉడికించి మిక్సీలో వేసి గ్రైండ్ చేయండి. దాన్ని సూప్‌లో కలిపితే బాగుంటుంది.
- ఖాళీ అయిన నెయ్యి, నూనె ప్యాకెట్లలో పప్పులు ఉంచితే ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.
- ధనియాలు పురుగు పట్టకుండా ఉండాలంటే వాటిని కడాయిలో కాసేపు వేడిచేసి ఆపై డబ్బాలో నిల్వచేస్తే చాలాకాలం వరకు నిల్వ ఉంటాయి.


## సద్గురు మెచ్చిన అనన్యభట్



**ఫోక్ సింగర్‌గా పేరుతెచ్చుకున్న అనన్య గతేడాది రిలీజ్ అయిన సినిమాలో పాటపాడి తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ఇప్పుడు మళ్లీ భక్తి పాట పాడి సద్గురు నుంచి ప్రశంసలు అందుకున్నది. కన్నడ భాషలో పాడిన ఈ పాట ఇప్పుడు బాగా వైరల్ అవుతుంది.**

అనన్యభట్.. ఈ పేరు చాలామందికి తెలియకపోవచ్చు. కానీ కేజీఎఫ్ సినిమాలో 'తరగని బరువైన.. వరమని అనుకుంటూ' అమ్మ గురించిన ఈ పాటంటే అందరికీ గుర్తుకొస్తుంది. ఈ పాట పాడింది బెంగళూరుకు చెందిన అనన్య. ఇప్పుడు మళ్లీ తన పాటతో ప్రేక్షకులను మెప్పిస్తున్నది. అది కూడా శివుడి భక్తి పాట. సద్గురుగా పిలువబడే జగ్గీ వాసుదేవ్ దగ్గర తన బృందంతో కలిసి పాడింది. అందుకు సద్గురు 'అనన్య బెంగళూరు నుంచి వచ్చింది. శివుడిని ప్రార్థిస్తూ 'సోజుగడ సుజు మల్లిగే' అంటూ కన్నడ భాషలో తనదైన స్టైల్‌లో పాడిన పాటతో నా మనసు దోచుకున్నది' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయనే కాదు ఆ పాటకు నెటిజన్లు కూడా ఫిదా అయ్యారు. ఈ పాట ఇప్పుడు బాగా పాపులర్ అయింది. అనన్య పాడే ప్రతిపాటకు ప్రాణంపోస్తుంది. ఈమెకు ఇండస్ట్రీలో అభిమానులు ఎక్కువే. అనన్య సంగీతంలోనే కాదు డ్యాన్స్, డ్రాయింగ్, అల్లికలు, స్కేటింగ్ అన్నింటిలోనూ ముందుంటుంది. చిన్నతనంలో సమ్మర్‌క్యాంప్‌లో మాండ్య రమేష్, రాజు అనంతస్వామి వంటివారు అనన్యకు సంగీతం నేర్పించారు. 'నేను పాటలకే పరిమితం కాదు. రేపు నా గొంతు పోతే నేను వేరే పనిచేయడానికైనా రెడీ! ఖాళీగా కూర్చోను' అంటున్నది అనన్య. పాటపాడే అవకాశం సులువుగానే వస్తుంది. కానీ దాన్ని నిలబెట్టుకోవడం చాలా కష్టం అంటున్నది అనన్య. ప్రస్తుతం హిందుస్తానీ మ్యూజిక్ నేర్చుకుంటున్నది. అనన్యకు సిద్ శ్రీరామ్, ఏఆర్ రెహమాన్, రిహాన్న, అడెలె, టేలార్ స్విఫ్ట్ సింగర్లంటే ఇష్టం.

## జుంకాలు అదిరేట్టు



**ఆడవాళ్లు బాగా రెడీ అయితేనే మనస్ఫూర్తిగా ముఖం మీద చిరునవ్వు పూస్తుంది. ఆ నవ్వు మరింత విరబూయాలంటే.. స్టైల్ స్టేట్‌మెంట్‌గా నిలిచే జుంకాలు పెట్టాల్సిందేనంటున్నారు ఫేషనిస్టులు.**





మెడలో ఏం లేకున్నా కూడా పెద్ద పెద్ద జుంకాలతో ఇప్పుడు సెలెబ్రిటీలు హొయలు పోతున్నారు. అయితే క్రీ.పూ. 2000వ సంవత్సరంలో ఇలాంటి జుంకాలు వేసుకుంటుండేవాళ్లట. దానికి కాస్త అప్‌గ్రేడ్ వెర్షన్‌లా ఇప్పటి కళాకా రులు తమ నైపుణ్యాన్ని చూపిస్తున్నారు. పట్టుచీర, మోడ్రన్ డ్రెస్, ఫార్మల్‌వేర్, చుడీదార్.. ఇలా ఏ డ్రెస్ మీదకైనా, ఎలాంటి అకేషన్లలోనైనా వీటిని ధరిం చొచ్చు. పెద్ద హూప్స్, అసెమిట్రిక్, జామెట్రిక్ డిజైన్‌లో ఉన్న స్టడ్స్, వింటేజ్ జువెలరీ ఇప్పుడు నడుస్తున్న ట్రెండ్‌లో భాగమయ్యాయి. డిస్కో డికేడ్‌లో ఇలాంటి జుంకాల కలెక్షన్‌ని కచ్చితంగా మీ పౌచ్‌ల్లో దూర్చేయండి.

## పుదీనాతో ముఖసౌందర్యం



- పుదీనా ఆకుల్ని మెత్తగా పేస్ట్ చేసి అందులో కొంచెం పసుపు కలుపాలి. ఈ మిశ్ర మాన్ని ముఖానికి గోరువెచ్చని నీటితో కడిగిన తర్వాత రాయాలి. 15 నిమిషాల తర్వాత చల్లటినీటితో కడిగేసుకుంటే ముఖం మృదువుగా మారుతుంది.
- గుడ్డులోని తెల్లసొనను కొన్ని పుదీనా ఆకుల పేస్ట్ కలిపి దానిని ముఖానికి రాసు కోవాలి. ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా తరుచూ చేస్తే ముఖంపై మచ్చలు తొలిగిపోతాయి. కొత్తగా మొటిమలు రాకుండా ఉంటాయి.
- పుదీనాలో ఉండే శాలిసైలిక్ ఆమ్లం మొటిమలు రాకుండా కాపాడుతుంది. దీని వల్ల ముఖం కాంతివంతంగా మారుతుంది.
- పుదీనా రసానికి పొప్పడి రసం కలుపాలి. ఈ మిశ్రమాన్ని చర్మ వ్యాధులు వచ్చిన చోట రాసుకోవాలి. దీంతో చాలా ప్రయోజనం ఉంటుంది.
- పుదీనా చర్మం ముడతలు పడకుండా చేస్తుంది. త్వరగా వృద్ధాప్య ఛాయలు రాకుండా చూడడంలో సాయపడుతుంది. చర్మం నునుపుదేలడానికి ఇది పాటించదగిన చిట్కా.
- దీని ఆకులతోనే కాదు. వాటి ఆకులతో తయారు చేసిన నూనె మార్కెట్లో దొరుకుతుంది. ఇది జుట్టు చక్కగా ఎదిగేందుకు తోడ్పడుతుంది.
- పుదీనా ఆయిల్ వాడిన వారు చుండ్రు సమస్య నుంచి బయటపడవచ్చు. ఇది మాడు మీద పొరలు పొరలుగా పొట్టు ఊడకుండా సంరక్షిస్తుంది.

## చంద్రవంక బొట్టు పెట్టి..



నిండైన తిలకం పెట్టడం మనకు ఏనాటి నుంచో వస్తున్న ఆనవా యతీ. కానీ మహారాష్ట్ర వాళ్లు మాత్రం అర్ధచంద్రాకారపు బొట్టు పెడతారు. తెలుగింటి కోడ లైన నమ్రత పుట్టింటి ఆచారా లను అప్పుడప్పుడూ పాటిస్తుం టుంది. ఇటీవల జయసుధ కొడుకు పెండ్లి విందులో ఇలా అర్ధచంద్రాకారపు బొట్టులో మెరి సింది. అయితే ఈ బొట్టుకు ఒక అర్థం ఉందని శాస్త్రం చెబుతు న్నది. మృదుస్వభావులు, చాలా నెమ్మదస్తులు, ఎలాంటి విషయా లనైనా చాలా బ్యాలెన్స్‌డ్‌గా చూసుకొనే వాళ్లకు ఇండికేషన్‌గా ఈ బొట్టు పెడతారని అంటుం టారు. ఆ బొట్టు ఏమో గానీ నమ్రతను చూస్తే మాత్రం ఈ మాటలు నిజమే అనిపిస్తుం టుంది కదా! దివ్యరెడ్డి డిజైన్ చేసిన డ్రెస్‌లో, ముత్యాల చోక ర్‌తో ఈ ఫంక్షన్‌లో నమ్రత అందరి దృష్టినీ ఆకర్షించింది.


నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 4 మార్చి 2020

# నందినిరెడ్డి దర్శకత్వంలో..


నాగచైతన్య

**'ల**వ్‌స్టోరీ' తర్వాత నాగచైతన్య చేయబోయే సినిమా ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. తాజా సమాచారం ప్రకారం దర్శకురాలు నందినిరెడ్డితో నాగచైతన్య ఓ సినిమా చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'ఓ బేబీ' చిత్రంలో కుటుంబ విలువల్ని హృద్యంగా ఆవిష్కరించి చక్కటి విజయాన్ని అందుకున్నారు నందినిరెడ్డి. యాక్షన్ హంగులకు సమకాలీన ప్రేమకథను మిళితం చేస్తూ ఓ పాయింట్‌ను సిద్ధం చేసిన ఆమె ఇటీవలే నాగచైతన్యను కలిసి వినిపించినట్లు సమాచారం. కథాంశంలోని కొత్తదనం నచ్చడంతో ఆయన ఈ సినిమా చేయడానికి అంగీకరించినట్లు తెలిసింది. స్వప్న సినిమాస్ పతాకంపై స్వప్నదత్, ప్రియాంకదత్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు సమాచారం. మిక్కీ జే మేయర్ సంగీతాన్ని సమకూర్చుతున్నారు. ప్రస్తుతం శేఖర్‌కమ్ముల దర్శకత్వంలో నాగచైతన్య నటిస్తున్న 'లవ్‌స్టోరీ' చిత్రీకరణ జరుపుకుంటున్నది.

# మహారాణి ఎవరు?


రెజీనా

**వి**భిన్నమైన కథాంశాలు, పాత్రలతో ప్రయోగాలకు ప్రాధాన్యతనిస్తూ సినిమాలు చేస్తున్నది రెజీనా. ఆమె కథానాయికగా కార్తిక్‌రాజు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్నది. ఈ చిత్రానికి 'నేనే నా..?' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రాజశేఖర్‌వర్మ నిర్మిస్తున్నారు. రెజీనా ఫస్ట్‌లుక్‌తో పాటు టైటిల్‌ను మంగళవారం హీరో వరుణ్‌తేజ్ విడుదలచేశారు. ఇందులో ఇనుప చువ్వలతో కూడిన తలుపుల మధ్య బందీగా ఉన్న మహారాణిగా రెజీనా సరికొత్తగా కనిపిస్తున్నది. నిర్మాత మాట్లాడుతూ 'మిస్టరీ థ్రిల్లరిది. రెజీనా ఆర్కియాలజిస్ట్‌గా నటిస్తున్నది. ఆమెను కొత్త కోణంలో ఆవిష్కరిస్తుంది. యాక్షన్ సన్నివేశాల కోసం రెజీనా ప్రత్యేక శిక్షణ తీసుకుంది. చిత్రీకరణ శరవేగంగా జరుగుతున్నది' అని తెలిపారు.

# ప్రణయ దృశ్యకావ్యం


అమృతా అయ్యర్, ప్రదీప్

**వ్యా**ఖ్యాత ప్రదీప్ మాచిరాజు హీరోగా పరిచయమవుతున్న చిత్రం '30రోజుల్లో ప్రేమించటం ఎలా?'. మున్నా దర్శకుడు. అమృతా అయ్యర్ కథానాయిక. ఎస్వీ ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్వీ బాబు నిర్మిస్తున్నారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో విడుదల చేయనున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ప్రదీప్ పాత్ర రెండు పార్శ్వాల్లో సాగుతుంది. భావోద్వేగభరితంగా సాగే ప్రేమకథా చిత్రమిది. మహేష్‌బాబు విడుదల చేసిన 'నీలి నీలి ఆకాశం..' పాట యాభై మిలియన్ల వ్యూస్ సాధించి విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఓ ప్రణయ దృశ్యకావ్యంలా దర్శకుడు ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు' అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: దాశరథి శివేంద్ర, సంగీతం: అనూప్‌రూబెన్స్, పాటలు: చంద్రబోస్.

# నరసింహలో రమ్యకృష్ణలా


భానుశ్రీ

**ర**మాకాంత్, భానుశ్రీ, అవంతిక నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'సముద్రుడు'. నగేష్ నారదాసి దర్శకుడు. బదావత్ కిషన్, శ్రీరామోజు జ్ఞానేశ్వర్, సోములు నిర్మించారు. మంగళవారం హైదరాబాద్‌లో దర్శకుడు వి.సముద్ర చిత్ర ట్రైలర్‌ను విడుదలచేశారు. ఆయన మాట్లాడుతూ 'రమాకాంత్ నా సినిమాలన్నింటిలో నటించాడు. వాస్తవికతకు దగ్గరగా సరికొత్తగా సాగుతూ ట్రైలర్ ఆసక్తిని పంచుతున్నది' అని అన్నారు. 'జాలర్ల జీవనశైలి నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రమిది. తెలుగు తెరపై ఇప్పటివరకు ఎవరూ స్పృశించని సరికొత్త కథాంశంతో తీశాం' అని రమాకాంత్ తెలిపారు. భానుశ్రీ మాట్లాడుతూ ''నరసింహ'లో రమ్యకృష్ణ పోలిన పాత్రలో నటించాను' అని చెప్పింది. హైదరాబాద్, చీరాలలో చిత్రీకరణ జరిపామని, మే నెలాఖరున సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతలు అన్నారు.



# ఎవరినీ లెక్క చేయను!


సోనమ్‌కపూర్

**మ**హిళా సాధికారత, సామాజిక స్వేచ్ఛ గురించి తన గళాన్ని వినిపించడానికి ఎప్పుడూ ముందుంటుంది సీనియర్ బాలీవుడ్ కథానాయిక సోనమ్‌కపూర్. తన అభిప్రాయాల్ని ఎవరూ ఎలా తీసుకున్నా లెక్కచేయని నైజం ఆమెది. తాజాగా ఓ మహిళా మాస పత్రిక ముఖచిత్రంపై సోనమ్‌కపూర్ తళుక్కున మెరిసింది. ఈ ఫొటోల్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. 'ఎవరో నిర్ణయించినట్లుగా జీవితాన్ని సాగించవొద్దు. కొత్త దారుల్లో ప్రయాణించాలంటే కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిందే. అప్పుడే మన శక్తియుక్తులు బయటకు వస్తాయి. విజయాలు సాధించగలుగుతాం. భవిష్యత్తు తరాల మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తాం' అని చెప్పింది సోనమ్‌కపూర్. కెరీర్ ఆరంభంలో తన గురించి హీరోలు రకరకాలుగా మాట్లాడుకునేవారని గుర్తుచేసుకుంది. తన ప్రవర్తన పొగరుగా ఉంటుందని, ప్రతి ఒక్కరికి హద్దుల్ని నిర్ణయిస్తానని చాటుగా విమర్శించేవారని..అయితే వృత్తిని మాత్రమే ప్రేమిస్తూ ఆధిపత్యాన్ని లెక్కచేయని తత్వమే తనను ఉన్నత స్థాయికి తీసుకొచ్చిందని పేర్కొంది. ప్రస్తుతం హీరోలందరూ తన పట్ల గౌరవ భావాన్ని కనబరుస్తున్నారని చెప్పుకొచ్చిందీ భామ.

# ప్రభాస్ సైంటిఫిక్ థ్రిల్లర్

**'బా**హుబలి' సిరీస్ విజయాలతో పాన్ ఇండియా స్టార్‌గా మారిన ప్రభాస్.. ఆ తరహా కథల కోసమే అన్వేషిస్తున్నాడు. ఆ క్రమంలోనే 'మహానటి' ఫేమ్ నాగ్‌అశ్విన్ చెప్పిన ఓ సైంటిఫిక్ థ్రిల్లర్ కథాంశం ప్రభాస్‌ను ఆకట్టుకోవడంతో త్వరలోనే ఆ చిత్రం పట్టాలెక్కనుంది. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించనున్న ఈ చిత్రం కోసం ప్రభాస్ 70 కోట్ల పారితోషికంతో పాటు లాభాల్లో వాటా కూడా తీసుకోనున్నారని సమాచారం. ఈ చిత్రాన్ని షూటింగ్ మొదలైనప్పటి నుంచి పన్నెండు నెలల్లో పూర్తిచేయాలని ప్రభాస్ దర్శక, నిర్మాతలకు కండీషన్ కూడా పెట్టాడట. ఒకవేళ చిత్రీకరణ ఆలస్యమైతే అందుకు సంబంధించిన పారితోషికాన్ని కూడా చెల్లించాలని ప్రభాస్ కోరినట్లుగా తెలిసింది. 400 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సంవత్సరం చివరలో చిత్రీకరణ ప్రారంభించి 2022 వేసవిలో చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

# ధైర్యాన్నిచ్చిన సినిమా ఇది


రక్షిత్, నాగశౌర్య, శ్రీవిష్ణు, నక్షత్ర

**'1970** నాటి కాలంలోకి నన్ను తీసుకెళ్లిన చిత్రమిది. సినిమా చూశాను కాబట్టే ఆ మాట ధైర్యంగా చెబుతున్నాను' అని అన్నారు హీరో నాగశౌర్య. రక్షిత్, నక్షత్ర జంటగా నటించిన చిత్రం 'పలాస 1978'. కరుణకుమార్ దర్శకుడు. ఈ నెల 6న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి హీరోలు నాగశౌర్య, శ్రీ విష్ణు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాగశౌర్య మాట్లాడుతూ 'వాస్తవిక కథలతో సినిమాలు చేయాలని ఉన్నా అంతర్లీనంగా తెలియని భయం ఉంటుంది. ఇలాంటి సినిమాలు ధైర్యాన్నిస్తాయి' అన్నారు. తెలుగు సినిమాపై బలమైన ముద్రను వేసే చిత్రమవుతుందని శ్రీవిష్ణు పేర్కొన్నారు. 'నలభై ఏళ్ల కెరీర్‌లో ఇదే నా ఉత్తమ చిత్రమని విశ్వాసంతో చెబుతున్నాను. వైవిధ్యమైన కథల్ని ప్రస్తుతం ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఆ కోవలో ఈ సినిమాను విజయవంతం చేస్తారనే నమ్మకముంది' అని చిత్ర సమర్పకుడు తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'వెట్రిమారన్ లాంటి దర్శకులు తెలుగులో ఉన్నారని గుర్తుచేసే సినిమా ఇది. నటీనటులంతా తమ పాత్రలకు ప్రాణంపోశారు' అని తెలిపారు. భావోద్వేగభరిత ప్రయాణమిదని, ఇందులో తనకు తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని చిత్ర దర్శకుడు కరుణకుమార్ పేర్కొన్నారు.

# శివన్ ప్రేమకథ


సాయితేజ, తరుణీసింగ్

**క**ల్వకోట సాయితేజ, తరుణీసింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'శివన్'. 'ది ఫినామినల్ లవ్‌స్టోరీ' ఉపశీర్షిక. శివన్ దర్శకుడు. సంతోష్‌రెడ్డి లింగాల నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ఈ నెల 13న విడుదలకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'యువతకు కావాల్సిన అన్ని అంశాలతో పాటు మాస్ ఎలిమెంట్స్ సినిమాలో ఉన్నాయి. లవ్‌స్టోరీ నేపథ్యంలో నడిచే సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. కథ, కథనాలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతాయి. అన్ని వర్గాలను మెప్పిస్తుంది' అన్నారు.

# రామసక్కని సందేశం


బ్రహ్మానందం

**'క**నీస బాధ్యతల్ని విస్మరించే నేటి యువతరానికి మంచి సందేశాన్ని అందించే చిత్రమిదని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే అంశాలు మెండుగా ఉన్నాయి' అని అన్నారు ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు. చమ్మక్‌చంద్ర, సలీంషేక్ హీరోలుగా నటిస్తున్న చిత్రం 'రామసక్కనోళ్లు'. ఫహీం సర్కార్ దర్శకుడు. సతీష్‌కుమార్ సాత్పడి నిర్మాత. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల మంత్రి హరీష్‌రావు విడుదలచేశారు. నిర్మాత మాట్లాడుతూ 'పెద్ద మనుషుల ముసుగులో కొందరు చేస్తున్న అన్యాయాల్ని నలుగురు యువకులు ఎలా ఎదుర్కొన్నారన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. మాతృభూమి రుణాన్ని ఏ విధంగా తీర్చుకున్నారనే సందేశంతో తెరకెక్కిస్తున్నాం. యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఈ సినిమా నిలుస్తుంది. సెన్సార్ పూర్తయింది. యు.ఎ సర్టిఫికెట్ లభించింది. త్వరలో విడుదల తేదీని వెల్లడిస్తాం' అని అన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, హైదరాబాద్‌లలో చిత్రీకరణ జరిపామని, మేఘనా చౌదరి పాత్ర ప్రధానాకర్షణగా ఉంటుందని దర్శకుడు పేర్కొన్నారు. షాయాజీషిండే, బ్రహ్మానందం, నాగినీడు, రఘుబాబు, బ్రహ్మాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఘంటాడి కృష్ణ, ఛాయాగ్రహణం: జగన్.

# ఆ లోటును భర్తీ చేస్తుంది


విశ్వాంత్

**'ఇ**ప్పటివరకు కెరీర్‌లో పెద్ద కమర్షియల్ సక్సెస్‌ను అందుకోలేకపోయినా మంచి సినిమాలు చేశాననే గౌరవాన్ని సంపాదించుకున్నాను. నటుడిగా ఆ గుర్తింపు సంతృప్తినిచ్చింది' అని అన్నారు విశ్వాంత్. 'కేరింత', 'మనమంతా' చిత్రాలతో ప్రశంసలు దక్కించుకున్న విశ్వాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ పిట్ట కథ'. భవ్య క్రియేషన్స్ సమర్పణలో ఆనందప్రసాద్ నిర్మిస్తున్నారు. చందు ముద్దు దర్శకుడు. ఈ నెల 6న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో విశ్వాంత్ మాట్లాడుతూ 'దర్శకుడు చంద్రశేఖర్ యేలేటి ద్వారా ఈ సినిమాలో అవకాశం వచ్చింది. ఆయనపై నమ్మకంతో కథ వినకుండా నటించడానికి అంగీకరించాను. రెగ్యులర్ లవ్, థ్రిల్లర్, ఎంటర్‌టైనర్‌లకు భిన్నంగా సరికొత్త స్క్రీన్‌ప్లేతో ఈ సినిమా సాగుతుంది. ఇందులో చైనా నుంచి వచ్చిన క్రిష్ అనే యువకుడిగా కనిపిస్తాను. పల్లెటూరి నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. ముక్కోణపు ప్రేమకథతో ఆద్యంతం థ్రిల్‌ను పంచుతుంది. కెరీర్‌లో కమర్షియల్ హిట్ లేదనే లోటును ఈ సినిమా భర్తీ చేస్తుందనే నమ్మకముంది. 'మనమంతా' తర్వాత చంద్రశేఖర్ యేలేటితో చాలా రోజులు ప్రయాణం చేశాను. మంచి కథల్ని ఎన్నుకోవడంలో ఆ జర్నీ ఉపయోగపడింది. ప్రస్తుతం 'కాదల్', 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' అనే సినిమాలు చేస్తున్నాను' అని తెలిపారు.






నమస్తే తెలంగాణ
# యువ
[ కరీంనగర్ ]
బుధవారం 4 మార్చి 2020

## నవ్వుకొందాం


**బౌలర్ :** నేను అవతలి జట్టును ఒక్క సింగిల్ రన్ కూడా తీయనివ్వలేదు తెలుసా?

**విలేకరి :** మరి జట్టు ఎలా గెలిచింది?

**బౌలర్ :** ఏవో ఫోర్లు, సిక్స్‌లు కొట్టుకొని గెలిచారంతే..



## మంచిమాట



మన మనసులోని భావనలు మనల్ని భయపెట్టేవిగా ఉండవచ్చు. ఒక్కోసారి పరిసరాల నుంచి పారిపోయేలా చేయవచ్చు. నిజానికి అవన్నీ పేకమేడలే. వాటికి బలమైన పునాది అంటూ ఏమీ లేదు. ఈ విషయాన్ని గ్రహించి వాటిమీది నుంచి దృష్టి మరల్చితే వాటంతటవే కుప్పకూలిపోక తప్పదు.

**- భగవాన్ రమణ మహర్షి**


## వాట్సప్ మెసేజ్

గుడిలో మంత్రాలను, మసీదులో నమాజును, చర్చిలో ప్రేయర్‌ను గౌరవించినట్లు ఆంబులెన్స్‌ను గౌరవించి దారివ్వండి. ఆ ప్రాణం నిలబడాలని ఎవరో ఒకరు దేవుడిని ప్రార్థిస్తుంటారు.




## ఏం డైలాగ్ గురూ..

మనలో ఉన్నప్రేమ ఎన్నో ఇవ్వాలనుకుంటుంది. తీసుకోవాలనుకుంటుంది. ఎంత ఇచ్చినా.. ఎంత పొందినా తక్కువే అనిపిస్తుంది. అందుకే ప్రేమ ఎప్పుడూ విశ్రాంతిని కోరుకోదు. తను తిరిగిపొందే ప్రేమకోసం ఎదురుచూస్తూనే ఉంటుంది.



**సినిమా: రచయిత**

---

హైదరాబాద్‌లో చిన్న కంపెనీ పెట్టాలనుకుంటున్నారా? సొంతంగా స్టార్టప్ ప్రారంభించాలనుకుంటున్నారా? ఇంటి అద్దెలు, ఫర్నీచర్, కరంట్ బిల్, ఇలా ఎన్నో వ్యయ ప్రయాసలు భరించలేమని భయపడుతున్నారా? ఇకపై ఆ భయం అవసరమే లేదు. మీకు ఎన్ని సీట్లు కావాలంటే అన్ని సీట్లు, ఎంతంటే అంత స్థలం ఫర్నీచర్‌తో సహా ఇవ్వడానికి కొన్ని కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. మీరు చేయాల్సిందల్లా అక్కడికెళ్లి పని చేసుకోవడమే! దీన్నే 'కో-వర్కింగ్ ఆఫీస్ స్పేస్' అంటారు. విదేశాల్లో ఉన్న ఈ కల్చర్ ఇప్పుడిప్పుడే హైదరాబాద్‌లోనూ వేళ్లూనుకుంటున్నది. మీకు స్థలం ఇవ్వడానికి ఎన్నో కంపెనీలు మరెన్నో ఆఫర్లతో రెడీగా ఉన్నాయి.



### మూడు రకాల ప్యాకేజీలు

**1** **హార్డ్ డెస్క్:** హార్డ్ డెస్క్‌లో భాగంగా రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేసుకునే వీలుంటుంది.

**2** **డెడికేటెడ్ డెస్క్:** ఇందులో రోజులో ఎన్ని గంటలైనా భవనంలో ఎక్కడైనా పనిచేసుకునే వెసులుబాటు ఉంటుంది. దీనికి గాను ఒక్కో సీటుకు నెలకు రూ.8 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

**3** **ప్రైవేట్ క్యాబిన్:** ఇందులో నిర్ణీత స్థలంలో క్యాబిన్ ఏర్పాటు చేస్తారు. సీటుకు నెలకు రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే కో వర్కింగ్ స్పేస్ తీసుకున్న వారు సంస్థ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో మీటింగ్ రూం, ప్లేయింగ్ రూమ్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

# అగ్గువకు 'కంపెనీ' ఇస్తాం

**హ**రీష్ ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కొన్నేండ్లు ఓ ప్రముఖ కంపెనీలో పనిచేశాడు. ఓ చిన్న కారణం చూపి అతడిని ఉద్యోగంలోంచి తీసేశారు. సొంతగా కంపెనీ పెట్టాలనుకున్నాడు. కొండాపూర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. దానికి ఆరు నెలల అడ్వాన్స్, ఏడాదికి 10 శాతం అద్దె పెరుగుదల అని భవన యజమానితో అగ్రిమెంట్ రాసుకున్నాడు. ఫర్నీచర్ తయారు చేయించాడు. ఆఫీస్ మెయింటనెన్స్, ఇంటర్నెట్ ఇలా అన్నీ సమకూర్చుకునే సరికి తలప్రాణం తోకకు వచ్చింది. కంపెనీ ప్రారంభానికి ముందే చేతిలో చిల్లిగవ్వ లేకుండా అయ్యింది. అప్పు చేసి ఎలాగోలా కంపెనీని నెట్టుకొచ్చాడు. తాను సంపాదించేదాంట్లో సగానికిపైగా అద్దె, ఇతర బిల్లుల చెల్లింపునకే సరిపోయేది. కొన్నాళ్లకు కంపెనీ నష్టాల్లో పడిపోయింది. ఫర్నీచర్, కంప్యూటర్స్ సగం ధరకే అమ్మేశాడు. అప్పుల్లో కూరుకుపోయాడు. నగరంలో చిన్న చిన్న కంపెనీలు పెట్టి హరీష్‌లా ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొన్నవారే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. మీరు కంపెనీ పెట్టాలనుకుంటే గది అద్దెకు తీసుకోవాల్సిన అవసరం లేదు. కరంటు బిల్, ఆఫీస్‌బాయ్, మెయింటనెన్స్ ఇలా ఏ పనీ చేయాల్సిన అవసరం లేదు. సంబంధిత కంపెనీకి ఒక్క ఫోన్ చేస్తే చాలు సీటు చొప్పున మీకు స్థలాన్ని లీజుకిస్తారు. ఇందులో ఎన్నో సౌకర్యాలు కూడా ఉన్నాయి.

### కో వర్కింగ్ స్పేస్

ఒకే భవనంలో వందలాది కంపెనీలు కార్యకలాపాలు జరుపుతాయి. దీన్నే కో వర్కింగ్ స్పేస్ అంటారు. కో వర్కింగ్ స్పేస్‌లో భాగంగా సీటును రిజర్వ్ చేసుకున్నవారు ఇంటర్నెట్, కరెంట్ బిల్, ఏసీ, కాన్ఫరెన్స్ రూం, పార్కింగ్ ప్లేస్, వాటర్, వాచ్‌మన్, ఆఫీస్‌బాయ్ ఇలా అన్నింటినీ పొందవచ్చు. కేవలం సీటుకు కేటాయించిన ధరను కడితే చాలు. అంటే ఆఫీస్‌ను వాళ్లు ఇస్తారు. మనం అక్కడకు వెళ్లి మన పని మనం చేసుకుంటే సరిపోతుందని అర్థం.

### ఎవరికి ప్రయోజనం?

ఇప్పుడిప్పుడే కంపెనీలు ప్రారంభించేవారికి, చిన్న చిన్న కంపెనీల నిర్వహణకు కోవర్కింగ్ ఆఫీస్ స్పేస్ చాలా ఉపయోగకరం. ఎందుకంటే ముందుగా పెద్దమొత్తంలో అడ్వాన్స్ చెల్లించాల్సిన పని లేదు. మరే ఇతర పెట్టుబడి అవసరం ఉండదు. ఒకవేళ అప్పటికప్పుడు కంపెనీ మూసుకొని వెళ్లాల్సి వచ్చినా పెద్దగా నష్టం ఉండదు. ఈవిధానం వల్ల ఔత్సాహిక కంపెనీస్థాపకులకు లాభం చేకూరుతుంది. అంతేకాకుండా కోవర్కింగ్ ఆఫీస్ స్పేస్ నిర్వాహకులకు సైతం లాభం జరుగుతుంది. ఒక స్థలాన్ని ఓ కంపెనీకి లీజుకు ఇస్తే నెలనెలా కొంత మొత్తం మాత్రమే వస్తుంది. అదే స్థలాన్ని పలుకంపెనీలకు సీట్ల చొప్పున లీజుకిస్తే అధిక లాభం. ఈ విధానం వల్ల ఔత్సాహిక కంపెనీ ప్రారంభకులకు, కోవర్కింగ్ ఆఫీస్ స్పేస్ యజమానులకు ఇరువురికీ లాభం చేకూరుతుంది.

### ఏమేం సౌకర్యాలు?

కోవర్కింగ్ ఆఫీస్ స్పేస్ కోసం ఆధార్‌కార్డు, కంపెనీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పాన్ కార్డు, జీఎస్టీ సర్టిఫికెట్ తప్పనిసరి. చిన్న స్టార్టప్‌లకు ఆధార్ ఒక్కటి సరిపోతుంది. కో వర్కింగ్ స్పేస్‌లో భాగంగా ఒక సీటు నుంచి వెయ్యి సీట్ల వరకు బుక్ చేసుకోవచ్చు. ఏసీ, విద్యుత్, ఆఫీస్ మెయింటెనెన్స్, పార్కింగ్, వాటర్, ఇంటర్నెట్, కేఫ్, మీటింగ్ రూం, కాన్ఫరెన్స్ రూం, వెయిటింగ్ రూం సౌకర్యాలుంటాయి. మరికొన్ని కో వర్కింగ్ కంపెనీలు పబ్, జిమ్, ప్లేయింగ్, ప్రేయర్ రూమ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్, రెస్టారెంట్స్ ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నాయి.

### ఎంత చెల్లించాలి?

ఇది వరకు కో వర్కింగ్ స్పేస్ అనేది విదేశాలకు మాత్రమే పరిమితం. కానీ గత ఏడాది, రెండేళ్లుగా హైదరాబాద్‌లో సైతం ఈవిధానం విస్తృతంగా అందుబాటులోకి వచ్చింది. ఐటీ కంపెనీలు ఎక్కువగా ఉన్న గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ ఏరియాల్లో 50కి పైగా కోవర్కింగ్ స్పేస్ కంపెనీలు ఉన్నాయి. ఇవి విభిన్న ఆఫర్లతో ఆకట్టుకుంటున్నాయి. కో వర్కింగ్ స్పేస్ విధానంలో కనిష్ఠంగా ఒక రోజు నుంచి గరిష్ఠంగా ఏడాది వరకు సీట్‌ను లీజుకు తీసుకోవచ్చు. ఒక సీటుకు రోజుకు రూ.150 చార్జి చేస్తారు. నెలకైతే రూ.4 వేల నుంచి ప్యాకేజీల వారీగా రూ.10 వేల వరకు చార్జి చేస్తారు.



### ఆకట్టుకునే వాతావరణం

ఒక కంపెనీలో పనిచేసేవారికి ఒకేరకమైన యూనిఫాం. రోజూ వాళ్లమొఖాలు వాళ్లు మాత్రమే చూసుకోవాలి. కానీ కో వర్కింగ్ ఆఫీస్ స్పేస్‌లో స్నేహపూరిత వాతావరణం ఎక్కువ. పలురకాల కంపెనీలు ఒకే దగ్గర ఉండడం వల్ల కొత్త స్నేహితులు పరిచయమయ్యే అవకాశం ఉంది. విభిన్న మనస్కులు ఒకే దగ్గర ఉండడం వల్ల కొత్త ఐడియాలు పుట్టుకొచ్చే అవకాశం కూడా ఉంది. అంతేకాకుండా ఆకట్టుకునే వాతావరణం కూడా ఇక్కడ సిద్ధంగా ఉంటుంది. విభిన్న రకాల ఇంటీరియర్‌తో ఆఫీస్‌లను రెడీ చేసి ఉంచుతారు. పలు కోవర్కింగ్ కంపెనీలు ప్రత్యేకమైన ఆఫర్లు కూడా అందిస్తున్నాయి.



**చిన్న కంపెనీలకు ప్రయోజనం**

కో వర్కింగ్ ఆఫీస్ స్పేస్‌కు హైదరాబాద్‌లో చాలా డిమాండ్ ఉంది. ఎక్కువ శాతం చిన్న చిన్న కంపెనీలే కో వర్కింగ్ స్పేస్ కావాలని మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. సింగిల్ డెస్క్ నుంచి వందలాది డెస్క్‌లు ఇవ్వడానికి రెడీగా ఉన్నాం. స్టార్టప్స్ పెట్టాలనుకునే వారికి కో వర్కింగ్ ఆఫీస్ స్పేస్ మంచి వేదిక. మా దగ్గర 11 నెలల అద్దె చెల్లిస్తే 12 నెలలు ఉండొచ్చు. ఇలాంటి మరెన్నో ఆఫర్లు ఉన్నాయి. కార్యాలయ నిర్వహణ, భవన నిర్వహణ అన్నీ మేం చూసుకుంటాం. కేవలం మీరొచ్చి పనిచేసుకొని వెళ్తే సరిపోతుంది. వివరాలకు 8977597049లో సంప్రదించవచ్చు.

**– నిఖిల్ దూబే, సీఈవో, ఇన్‌క్లూడ్ స్పేస్, కొండాపూర్**



**... పడమటింటి రవికుమార్**

---

## టెక్నాలెడ్జీ

### ఇన్‌స్టాలో కొత్త ఫీచర్




ఇన్‌స్టాగ్రామ్ సరికొత్త ఫీచర్‌ను లాంచ్ చేయనుంది. అరుదుగా ఇంటరాక్ట్ అయ్యే ప్రొఫైళ్లను ఎంపిక చేసి వాటిపై యూజర్లకు అన్‌ఫాలోను చూపించనున్నది. దీని ద్వారా క్లోజ్‌గా ఉన్న స్నేహితులతో గ్రూప్ ఏర్పాటు చేయడానికి, ఆక్టీవ్‌గా లేని ఫాలోయర్లను అవాయిడ్ చేసేందుకు సహకరిస్తుంది. మీ న్యూస్ ఫీడ్‌ను ఎవరు ఫాలో అవుతున్నారు, ఎవరు ఫాలో కావడం లేదు అనే విషయాలను ఈ ఫీచర్ తెలియజేస్తుంది. మీతో ఎవరు ఎక్కువగా ఇంటరాక్ట్ అవుతున్నారో దాన్ని బట్టి సలహాలు ఇస్తుంది. అలాంటి అంశాలన్నింటినీ మేనేజ్ చేసుకోవచ్చ'ని తాజా ఫీచర్ గురించి వివరిస్తూ ఇన్‌స్టాగామ్ సీఈఓ ఆడమ్ ముసోరి ట్వీట్ చేశారు.

### రెడ్‌మీ నోట్ 9


వరుసగా స్మార్ట్ ఫోన్లను విడుదల చేస్తూ ట్రెండ్ కొనసాగిస్తున్న షావోమీ తాజాగా మరో ఫోన్‌ను విడదల చేసేందుకు సిద్ధమైంది. ఈనెల 12న రెడ్‌మీ నోట్ 9, రెడ్‌మీ నోట్ 9 ప్రో పేరుతో రెండు మోడళ్లను మార్కెట్‌లోకి తేనుంది. ఈ కొత్త మోడళ్ల ఫీచర్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందామా?



- **స్క్రీన్ :** 6.4 అంగుళాలు, గొర్రెల్లా గ్లాస్ ప్రొటెక్షన్
- **ప్రాసెసర్ :** స్నాప్ డ్రాగన్ 720జీ
- **ఆపరేటింగ్ సిస్టమ్ :** వీ9.0
- **ర్యామ్ :** 6జీబీ..
- **స్టోరేజీ:** 32జీబీ
- **రియర్ కెమెరా :** 48+8+2+2 ఎంపీ
- **ఫ్రంట్ కెమెరా :** 13 ఎంపీ
- **బ్యాటరీ :** 5000 ఎంఏహెచ్

### కరోనా..
#### ఆన్‌లైన్‌లో ఇవి చేయకండి!

ప్రస్తుతం ప్రపంచాన్ని కరోనా వైరస్(కొవిడ్-19) వణికిస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లో కూడా దీనికి సంబంధించిన కేసు ఒకటి నమోదైంది. అయితే దీనికి సంబంధించి పుకార్లు మాత్రం ఆన్‌లైన్‌లో చాలానే హల్‌చల్ చేస్తున్నాయి. ఆన్‌లైన్‌లో దీనికి సంబంధించి తప్పుడు సమాచారం అందుబాటులో ఉంది. కరోనా వైరస్ వ్యాధికి సంబంధించి మీరు ఆన్‌లైన్‌లో చేయకూడని పనులు ఇవే!



- కరోనా వైరస్ నుంచి మిమ్మల్ని కాపాడేందుకు ప్రత్యేకమైన మాస్క్ లేవీ అందుబాటులో లేవు. కాబట్టి ఆన్‌లైన్‌లో కరోనా వైరస్ నుంచి కాపాడే మాస్క్‌లు అంటూ ఏవైనా కనిపిస్తే వెంటనే నమ్మేసి కొనేయకండి.
- కరోనా వైరస్‌కు ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి మందునూ కనిపెట్టలేదు. కాబట్టి కరోనాకు మందు కనిపెట్టాం అంటూ ఏవైనా యాడ్స్ కనిపించినావాటిని కొనుగోలు చేయకండి. మీ డబ్బును కాజేసేందుకు వారు వేసిన పథకం మాత్రమే.
- కరోనా వైరస్‌కు సంబంధించి ఇంటర్నెట్లో కనిపించే సమాచారంలో చాలా వరకు అసత్యాలే. కాబట్టి మీరు ఏ వెబ్‌సైట్లో పడితే ఆ వెబ్‌సైట్లో కరోనా వైరస్‌కు సంబంధించిన సమాచారాన్ని వెతక్కండి. అందులో ఉన్న సమాచారం కూడా అసత్యం అయ్యే అవకాశం ఉంది. మీకు దగ్గర్లో ఉండే వైద్యులను సంప్రదించి దీనికి సంబంధించిన సమాచారాన్ని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోండి.
- కరోనా వైరస్‌కు సంబంధించి ఎటువంటి అధికారిక టెస్ట్ కిట్స్ కూడా లేవు. కాబట్టి మీకు ఇటువంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే హాస్పిటల్‌కు వెళ్లండి. అంతే కానీ కిట్ కొనుక్కుని ఇంట్లోనే పరీక్షించుకుందాం లాంటి నిర్ణయాలు తీసుకోకండి. ఎంతో మంది ఆన్‌లైన్‌లో ఫేక్ కరోనా వైరస్ కిట్లను విక్రయిస్తున్నారు.
- కరోనా వైరస్‌కు సంబంధించి వాట్సాప్ మెసేజ్‌లు, టిక్‌టాక్ వీడియోల ద్వారా నకిలీ సమాచారాన్ని వైరల్ చేస్తున్నారు. ఇటువంటి విషయాల్లో జాగ్రత్త.
- సోషల్ మీడియాలో ఫాలోయింగ్ ఉన్న వారు కరోనాకు సంబంధించి నకిలీ సమాచారాన్ని అందిస్తునారు. వాటిని నమ్మి ఇబ్బందుల పాలుకావద్దు!
- ఆన్‌లైన్‌లో మీకు కరోనా వైరస్ గురించి ఏవైనా వార్తలు కనిపించినా, లేకపోతే మీకు వాట్సాప్‌లో ఎవరైనా వాటిని పంపించినా వెంటనే వాటిని షేర్ చేయకండి. ధ్రువీకరించబడని వార్తలు మిగిలిన వారిలో భయాన్ని పెంచుతాయి. ఫేక్ న్యూస్ స్ప్రెడ్ చేస్తే ప్రభుత్వం శిక్ష విధించేందుకు సిద్ధమైంది జాగ్రత్త.
- సైబర్ నేరగాళ్లు కరోనాను క్యాష్ చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇతర ప్రముఖ సంస్థల పేరిట ఈ-మెయిల్స్ పంపించి మీ వద్ద నుంచి డబ్బులు కాజేయాలని ప్రయత్నిస్తారు. కాబట్టి ఇటువంటి విషయాల్లో కూడా జాగ్రత్త వహించండి.

---

## పోలీస్.. టీచర్!

**మైసూరు సమీపంలోని చమరాజ్‌నగర్. 29 ఏండ్ల మధుసూదన్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నాడు. తీరికలేని డ్యూటీ. అందరూ ఇలా తీరికలేదు అంటే పేదరికాన్ని ఎవరు రూపుమాపుతారు? అంటూ టీచర్‌గా మారాడు.**



**ఒ**కవైపు డ్యూటీ.. మరోవైపు సమాజ సేవ చేస్తూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. ఇంతకూ ఇతడేం చేస్తాడంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్తున్నాడు. ప్రతీరోజు ఉదయం 6.45 నుంచి 8.30 వరకు రాత్రి 9 గంటలకు పాఠ్యాంశాలు బోధిస్తున్నాడు. పాఠ్యాంశాలే కాదు.. వ్యక్తిత్వ వికాసంపై కూడా పిల్లలకు అవగాహన కల్పిస్తున్నాడు. గుడిని బడిగా మార్చి విద్యా ప్రమాణాల్ని అందిస్తున్న మధు 2015లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఆయన క్యాంప్‌లో ప్రస్తుతం 40 మంది విద్యార్థులు ఉన్నారు. ఇలా పాఠాలు బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడాయన.

## శభాష్ రుషికేశ్



**ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా ఎంతోమంది విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడుతున్నారు. అటువంటి మరణాలను నివారించేందుకు ముందుకొచ్చాడు ఓ యువకుడు. ఎలక్ట్రానిక్స్ సబ్జెక్టులో డిగ్రీ లేకపోయినా కరంటు ప్రమాదాలను నివారించే ఉపాయాన్ని కనిపెట్టి నేషనల్ అవార్డు అందుకున్నాడు.**



**కే**రళలోని అలప్పుజాకు చెందిన రిషికేశ్ పెద్దగా చదువుకోలేదు. చిన్నప్పటి నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలను రిపేరు చేస్తూ ఉండేవాడు. సబ్జెక్టు పరంగా థియొరీ తెలియకపోయినా ఎలక్ట్రానిక్ చోక్స్, ట్యూబ్‌లైట్లు, ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్లు బాగు చేస్తుండేవాడు. విద్యుత్ ప్రమాదాలతో ఎంతో మంది చనిపోతున్నారు. దీనికి పరిష్కారాన్ని చూపాలనుకున్నాడు. అనేక ప్రయోగాలు చేసి వైర్‌లెస్ విద్యుత్ సరఫరా డిస్‌కనెక్ట్ వ్యవస్థను రూపొందించాడు. రిషికేశ్ కరంటు స్తంభాలు ఎక్కే అవసరం లేకుండానే ఓ పరికరాన్ని తయారు చేశాడు. ఇది అధిక వోల్టేజి, విద్యుత్ ప్రమాదాల నుంచి కాపాడుతుంది. 11 మీటర్ల దూరం నుంచి విద్యుత్ ప్రవాహాన్ని నిలిపివేసేలా దీనిని తయారు చేశాడు రిషి. ఎంతోమంది ప్రాణాలను కాపాడే పరికరాన్ని రూపొందించిన రిషికేశ్ ప్రతిభను కేంద్ర ప్రభుత్వం గుర్తించి జాతీయ పురస్కారాన్ని అందించింది. ఎటువంటి డిగ్రీ లేకుండానే అద్భుతమైన పరికరాన్ని రూపొందించిన రుషిని అందరూ ప్రశంసిస్తున్నారు.

---

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

**హిందుస్థాన్ ఉర్వారక్ & రసాయన్ లిమిటెడ్ (హెచ్‌యూఆర్‌ఎల్)లో ఇంజినీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

### బిట్స్‌లో ఎంబీఏ

**బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బిట్స్) ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.**

- **కోర్సు:** మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ)
- **అర్హతలు:** డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు క్యాట్, జీమ్యాట్/ జీఆర్‌ఈలలో వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.
- **ఎంపిక విధానం:** క్యాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** https://bitmesra.ac.in

### సింగరేణిలో ఎంటీలు

**ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)లో ఎంటీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం పోస్టులు:** 42
- **పోస్టు:** మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఎంటీ)
- **విభాగాలవారీగా ఖాళీలు:** ఫైనాన్స్ అండ్ అకౌంట్స్-20, పర్సనల్ (పురుషులు మాత్రమే)18, లీగల్-4 ఉన్నాయి.
- అర్హతలు, అనుభవం, వయస్సు, జీతభత్యాల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **వెబ్‌సైట్:** https://scclmines.com

### హెచ్‌యూఆర్‌ఎల్ లో ఇంజినీర్లు

- **మొత్తం ఖాళీలు:** 90
- **విభాగాలవారీగా ఖాళీలు:** కెమికల్ ఇంజినీరింగ్-38, మెకానికల్ ఇంజినీరింగ్ -25, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్-15, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్-12
- **అర్హతలు:** కెమికల్ ఇంజినీరింగ్/మెకానికల్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీఈ/బీటెక్/బీఎస్సీ (ఇంజినీరింగ్) ఉత్తీర్ణత.




- **ఎంపిక:** గేట్-2019 స్కోర్ ద్వారా
- **వయస్సు:** 28 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** www.hurl.net.in

### ఢిల్లీ నిట్‌లో

**ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
- **మొత్తం ఖాళీలు:** 12
- **సబ్జెక్టులు:** సీఎస్, ఈఈ, ఈసీఈ, మెకానికల్
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ, ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 30
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** ఏప్రిల్ 6
- **వెబ్‌సైట్:** https://nitdelhi.ac.in

### ఈసీఐఎల్‌లో

**హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **పోస్టు:** టెక్నికల్ ఆఫీసర్
- **మొత్తం ఖాళీలు:** 8
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం.
- **వయస్సు:** 2020, జనవరి 31 నాటికి 30 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 9
- **వెబ్‌సైట్:** http://careers.ecil.co.in

నమస్తే తెలంగాణ
# ఆట
12
[ కరీంనగర్ ]
బుధవారం 4 మార్చి 2020
WWW.NTNEWS.COM

# కరోనా క్రీనీడ

## టోక్యో ఒలింపిక్స్ నిర్వహణపై సందిగ్ధం

### షెడ్యూల్ ప్రకారమేనన్న ఐవోసీ



**కరోనా వైరస్ కరాళ నృత్యం చేస్తున్నది. చైనాలో పుట్టి శరవేగంగా విస్తరిస్తున్నది. ప్రాణాంతకంగా మారిన ఈ వైరస్ మహమ్మారి వల్ల లక్షల మంది ప్రభావితం అవుతూనే ఉన్నారు. కరోనా వల్ల ఇప్పటికే పలు క్రీడా టోర్నీలు వాయిదా పడుతుండగా, అసలు టోక్యో ఒలింపిక్స్ జరుగుతాయా లేదా అన్నది సందిగ్ధంలో పడింది. వైరస్ ప్రభావం ఇలాగే కొనసాగితే విశ్వక్రీడల నిర్వహణ కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, షెడ్యూల్ ప్రకారం కాకపోయినా..ఈ యేడాదిలోనే నిర్వహిస్తామని జపాన్ ధీమా వ్యక్తం చేస్తున్నది. మరోవైపు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నది. ఒకవేళ పరిస్థితులు చేయిదాటితే ఏంటన్న దానిపై ఇప్పటికిప్పుడే తుది నిర్ణయానికి రాలేకపోతున్నది.**

**లుసానే/టోక్యో:** క్రీడా ప్రపంచంపై ప్రమాదకర కరోనా వైరస్(కొవిడ్-19) ప్రభావం అంతకంతకూ తీవ్రమవుతున్నది. చైనా నుంచి 60కు పైగా దేశాలకు ఈ వైరస్ వ్యాప్తిచెందింది. చైనాలో ఇప్పటికే 3,100 మందికి పైగా మృతి చెందగా.. దక్షిణకొరియా, ఇటలీ, ఇరాన్‌లో వైరస్ వేగంగా వ్యాపిస్తున్నది. ఈ ఏడాది జులై 24 నుంచి ఆగస్టు 9వరకు ఒలింపిక్స్ జరగాల్సిన జపాన్‌లోనూ 230 కరోనా కేసులు నమోదవడం సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తున్నది. విశ్వక్రీడల నిర్వహణే సందిగ్ధంలో పడింది. ఈ విషయంపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ)వరుస ప్రకటనలు చేస్తున్నా పూర్తి స్పష్టత మాత్రం ఇవ్వడం లేదు. మరోవైపు జపాన్ క్రీడా శాఖ మాత్రం విశ్వక్రీడలు వాయిదా పడతాయనేలా వ్యాఖ్యలు చేస్తున్నది. ప్రస్తుతం ఒలింపిక్ క్వాలిఫికేషన్స్‌తో పాటు చాలా టోర్నీలు రద్దు లేదా వాయిదా పడుతున్నాయి. కొన్ని టోర్నీలు జరుగుతున్నా వాటికి ప్రేక్షకులు రాకపోవడంతో మైదానాలు ఖాళీగా కనిపిస్తున్నాయి.

**ఎప్పుడైనా నిర్వహించొచ్చు: జపాన్ మంత్రి**

జూలైలో విశ్వక్రీడల కోసం ఏర్పాట్లు చేస్తున్నామని ఐవోసీ చెప్పగా.. జపాన్ క్రీడా శాఖ మంత్రి సీకో హషిమొటో మాత్రం వాయిదా పడొచ్చనేలా వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది ఏ సమయంలోనైనా ఒలింపిక్స్ నిర్వహించే వెసులుబాటు ఉందంటూ చెప్పారు. పార్లమెంట్ ఎగువ సభలో ఎదురైన ఓ ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. '2020లో నిర్వహించలేకుంటేనే విశ్వక్రీడలను రద్దు చేసే అధికారం ఐవోసీకి ఉంటుంది. ఈ క్యాలెండర్ ఏడాది ముగిసేలోపు ఎప్పటికైనా వాయిదా వేసుకోవచ్చని దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు' అని హషిమొటో బదులిచ్చారు. మరోవైపు ఐవోసీ మాత్రం షెడ్యూల్ ప్రకారమే ఒలింపిక్స్ జరుగుతాయని చెబుతున్నది.



**ఏర్పాట్లు చేస్తున్నాం : ఐవోసీ**

మరో ఐదు నెలల్లో జరగాల్సిన టోక్యో ఒలింపిక్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఐవోసీ మంగళవారం ప్రకటించింది. లుసానేలో రెండు రోజుల పాటు జరిగిన ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం అనంతరం ఐవోసీ అధ్యక్షుడు థామస్ బాచ్ మాట్లాడాడు. ప్రస్తుతమైతే జూలైలోనే ఒలింపిక్స్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పాడు. ఏవైనా తుది నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తే అది జూన్‌లోనే అని వెల్లడించాడు. జూన్ 15-17 మధ్య ఎగ్జిక్యూటివ్ బోర్డు మరోసారి సమావేశం కానుంది.

### నో షేక్ హ్యాండ్స్

అనారోగ్యం ప్రబలుతున్న కారణంగా తదుపరి శ్రీలంక పర్యటనలో ఆటగాళ్లతో కరచాలనం చేయకూడదని నిర్ణయించుకున్నట్టు ఇంగ్లండ్ క్రికెట్ జట్టు కెప్టెన్ జో రూట్ చెప్పాడు. గతేడాది డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనలో తొలి టెస్టు సందర్భంగా 10మంది ఆటగాళ్లు, నలుగురు సహాయక సిబ్బంది జ్వరం బారిన పడడంతో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు చెప్పాడు. బ్యాక్టీరియా, క్రిములను నివారించేందుకు తమ వైద్య బృందం ఈ సూచనలు చేసిందని చెప్పాడు. అయితే సఫారీలతో సిరీస్‌లో అనారోగ్యం నుంచి ఇంగ్లండ్ ఆటగాళ్లు త్వరగానే కోలుకోగా.. నాలుగు టెస్టుల సిరీస్‌ను ఆ జట్టే కైవసం చేసుకుంది. అయితే ప్రస్తుతం కరోనా వైరస్ సైతం వ్యాపిస్తుండడంతో మరింత జాగ్రత్తగా ఉండాలని ఇంగ్లండ్ అనుకుంటున్నది. ఎన్‌బీఏ సైతం ఆటగాళ్లను హెచ్చరించింది. అభిమానులకు కరచాలనాలు, హైఫైలు ఇవ్వొద్దని సూచించింది.


రూట్

### ఐపీఎల్‌పైనా ప్రభావం!

ఈ నెల 29న ప్రారంభం కానున్న ఐపీఎల్ 13వ సీజన్‌పై కూడా కరోనా వైరస్ ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. ఆగ్నేయాసియా నుంచి ప్లేయర్లెవరూ టోర్నీలో పాల్గొనకున్నా.. మ్యాచ్‌లకు ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరవ్వడమే కాస్త ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంది. భారత్‌లో ఇప్పుడిప్పుడే కరోనా కేసులు నమోదవుతున్న తరుణంలో వ్యాధి వ్యాప్తిపై ఆందోళనలు రేకెత్తుతున్నాయి. అయితే, ఈ నెల 12న ప్రారంభం కానున్న దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌తో పాటు ఐపీఎల్‌కు కరోనా వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ చెప్పాడు. అసలు ఆ అంశం గురించి సమావేశంలో చర్చించలేదని తెలిపాడు. ప్రస్తుతానికి వైరస్ వల్ల ఎలాంటి ముప్పు లేదని, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని ఐపీఎల్ చైర్మన్ బ్రిజేశ్ పటేల్ కూడా వెల్లడించాడు.



కరోనా వైరస్ ప్రభావానికి సజీవ సాక్షమిది. టోక్యోలో ప్రేక్షకులు లేకుండా బోసిపోయిన స్టేడియంలో జరుగుతున్న బేస్‌బాల్ మ్యాచ్

## పాండ్య పది సిక్సులు



**నవీ ముంబై:** గాయం నుంచి కోలుకున్న టీమ్ ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య డీవై పాటిల్ టీ20కప్‌లో ధనాధన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. ఎప్పుడెప్పుడు జాతీయజట్టులోకి రావాలా అని చూస్తున్న పాండ్య అవకాశాన్ని రెండు చేతుల అందిపుచ్చుకున్నాడు. టోర్నీలో రిలయన్స్-1 జట్టు తరఫున ఆడుతున్న హార్దిక్ మంగళవారం కాగ్‌తో జరిగిన మ్యాచ్‌లో 39 బంతుల్లోనే 105 పరుగులు చేసి సత్తాచాటాడు. ఏకంగా పది సిక్సర్లు బాదడంతో పాటు ఎనిమిది ఫోర్లు కొట్టాడు. ఏ ఒక్క బౌలర్‌ను విడిచిపెట్టకుండా బంతిని వీర బాదుడు బాదాడు. బౌండరీలే లక్ష్యంగా చెలరేగడంతో తొలుత బ్యాటింగ్ చేసిన రిలయన్స్-1 జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 252పరుగులు చేసింది. అనంతరం హార్దిక్ పాండ్య బౌలింగ్‌లోనూ రాణించి ఐదు వికెట్లు తీయడంతో కాగ్ 151పరుగులకే ఆలౌటైంది. రిలయన్స్-1 101 పరుగుల తేడాతో లీగ్ దశలో తన ఆఖరి మ్యాచ్‌లో భారీ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌ను చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ప్రత్యక్షంగా వీక్షించాడు. ఐదు నెలల క్రితం వెన్నుకు శస్త్రచికిత్స చేయించుకున్న పాండ్య అప్పటి నుంచి అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన సంగతి తెలిసిందే.

## టాప్‌లోనే టీమ్ఇండియా

**దుబాయ్:** న్యూజిలాండ్‌తో ముగిసిన టెస్టు సిరీస్‌ను భారత జట్టు 0-2తో కోల్పోయినా.. ఐసీసీ తాజా టీమ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నది. ప్రస్తుతం టీమ్ఇండియా 116 పాయింట్లతో టాప్‌లో ఉంటే.. కివీస్ 110 పాయింట్లతో రెండో స్థానానికి చేరింది. ఆస్ట్రేలియా (108) మూడో ర్యాంక్‌లో ఉంది. సిరీస్‌లో ఘోరంగా విఫలమైన భారత సారథి విరాట్ కోహ్లీ (886 పాయింట్లు) బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉండగా.. ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ (911 పాయింట్లు) టాప్‌లో కొనసాగుతున్నాడు. ఆసీస్ టెస్టు సంచలనం లబుషేన్ (827) మూడో స్థానానికి ఎగబాకగా.. న్యూజిలాండ్ కెప్టెన్ విలియమ్సన్ నాలుగో స్థానానికి పడిపోయాడు. టాప్‌టెన్‌లో భారత్ నుంచి కోహ్లీతో పాటు పుజారా (7వ ర్యాంక్) మాత్రమే చోటు దక్కించుకున్నాడు. బౌలింగ్ విభాగంలో ఆసీస్ పేసర్ కమిన్స్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. బుమ్రా ఏడో ర్యాంక్‌కు చేరుకున్నాడు.

## బ్రిటన్‌కు కాసులపంట




**లండన్:** గతేడాది ఇంగ్లండ్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్.. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థకు కాసుల పంట కురిపించింది. టోర్నీ వల్ల మొత్తం 350మిలియన్ పౌండ్లు ఆర్థిక వ్యవస్థకు చేకూరింది. ప్రపంచకప్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు ఊహించిన దాని కంటే ఎక్కువ మంది అభిమానులు ఇంగ్లండ్‌కు రావడంతో వివిధ మార్గాల్లో ఆదాయం సమకూరింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ టోర్నీని 160కోట్ల మంది వీక్షించగా.. డిజిటల్ కంటెంట్‌కు 406కోట్ల వీక్షణలు వచ్చాయి. వన్డే ప్రపంచకప్ అన్ని విధాల విజయవంతమైందని ఐసీసీ సీఈవో షాహ్నీ చెప్పారు.

## హారికకు తొలి డ్రా

**లూసానే:** ఫిడే మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీని భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక డ్రాతో మొదలుపెట్టింది. తొలి రౌండ్‌లో స్వీడన్ వెటరన్ ప్లేయర్ క్రామ్లింగ్‌తో జరిగిన గేమ్‌ను హారిక డ్రా చేసుకుంది. మొత్తం 37 ఎత్తుల్లో గేమ్ డ్రాగా ముగిసింది. 12 మంది పోటీపడుతున్న టోర్నీలో అత్యధిక పాయింట్లు సాధించిన ఇద్దరు క్యాండిడేట్స్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తారు. రెండు గ్రాండ్‌ప్రి టోర్నీలు ముగిసిన తర్వాత తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి 293పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నది.

## భారత్ వెనుకంజ

**దుబాయ్:** ఫెడ్‌కప్ టెన్నిస్ టోర్నీని భారత్ నిరాశాజనకంగా ప్రారంభించింది. మంగళవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్‌లో రుతుజ భోసలే, అంకితా రైనా.. చైనా ప్లేయర్ల చేతిలో పరాజయం పాలవడంతో భారత్ 0-2తో వెనుకంజలో నిలిచింది. రుతుజ 4-6, 2-6తేడాతో ప్రపంచ 35వ ర్యాంకర్ షువాయ్ జెంగ్ చేతిలో పరాజయం పాలైంది. అనంతరం మరో సింగిల్స్‌లో అంకిత 6-1, 2-6, 4-6తేడాతో క్వింగ్ వాంగ్ చేతిలో పోరాడి ఓడింది. భారత్ బుధవారం ఉజ్బెకిస్థాన్‌తో తలపడనుంది.



## ప్రిక్వార్టర్స్‌లో గౌరవ్, అశిష్

### ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్

**అమన్(జోర్డాన్):** ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీ తొలి రోజు భారత బాక్సర్లు అదరగొట్టారు. మంగళవారం జరిగిన వేర్వేరు బౌట్లలో విజయాలతో గౌరవ్ సోలంకి(57కి), అశిష్ కుమార్ (75కి) ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ విజేత అయిన గౌరవ్ 5-0తో అకిల్‌బెక్ ఎసెన్‌బెక్(కిర్గిస్థాన్)పై అలవోక విజయం సాధించాడు. ఆది నుంచి తనదైన ఆధిపత్యం ప్రదర్శించిన సోలంకి.. ప్రత్యర్థి బాక్సర్‌పై తనదైన పంచ్‌లతో విరుచుకుపడ్డాడు. పదునైన పంచ్‌లకు తోడు జాబ్స్, హుక్స్‌తో చెలరేగడంతో ప్రత్యర్థి నుంచి సమాధానం లేకపోయింది. మరో బౌట్‌లో అశిష్ కుమార్..కన్‌చీ వి(తైవాన్)ను 5-0తో చిత్తుచేశాడు. మెరుగైన ప్రాక్టీస్ వల్లే తాను ఈ విజయం సాధించానని బౌట్ తర్వాత అశిష్ అన్నాడు. క్లీన్ పంచ్‌లతో విరుచుకుపడుతూ పాయింట్లు కొల్లగొట్టాడు. ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరే వారికి టోక్యో ఒలింపిక్స్ బెర్తు దక్కుతుంది. భారత స్టార్లు అమిత్ పంగల్, మేరీకోం బుధవారం బరిలోకి దిగనున్నారు.

## 13 ఏండ్ల తర్వాత..

### రంజీ ఫైనల్ చేరిన బెంగాల్



**కోల్‌కతా:** భారీ లక్ష్యఛేదనలో బ్యాట్స్‌మెన్ వైఫల్యాల బాటవీడకపోవడంతో.. కర్ణాటక ఘోర పరాజయం మూటగట్టుకుంది. బెంగాల్‌తో జరిగిన రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో కర్ణాటక 174 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఫలితంగా 13 ఏండ్ల తర్వాత బెంగాల్ జట్టు ప్రతిష్ఠాత్మక టోర్నీ ఫైనల్లో అడుగుపెట్టింది. సౌరవ్ గంగూలీ అరంగేట్రం చేసిన 1989-90 సీజన్‌లో విజేతగా నిలిచిన బెంగాల్ జట్టు.. చివరిసారిగా 2007 ఫైనల్లో ముంబై చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 352 పరుగుల లక్ష్యఛేదనలో.. ఓవర్‌నైట్ స్కోరు 98/3తో మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటక 177 పరుగులకు ఆలౌటైంది. బెంగాల్ పేసర్ ముఖేష్ (6/61) అదరగొట్టాడు.

## భారత్ x ఇంగ్లండ్

**మహిళల టీ20 ప్రపంచకప్ సెమీస్ బెర్తులు ఖరారు ▪ మరో పోరులో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ఢీ**

**సిడ్నీ:** పది జట్లతో ప్రారంభమైన మహిళల పొట్టి ప్రపంచకప్ నాకౌట్ దశకు చేరింది. గ్రూప్-ఏ నుంచి భారత్, ఆస్ట్రేలియా సెమీస్‌లో అడుగుపెట్టగా.. గ్రూప్-బి నుంచి దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ చోటు దక్కించుకున్నాయి. 8 పాయింట్లతో గ్రూప్-ఏలో అగ్రస్థానంలో నిలిచిన టీమ్ ఇండియా.. 6 పాయింట్లతో గ్రూప్-బిలో రెండో స్థానంలో నిలిచిన ఇంగ్లిష్ జట్టుతో గురువారం సెమీస్‌లో తలపడనుంది. గత ప్రపంచకప్ సెమీస్‌లో భారత జట్టు ఇంగ్లండ్ చేతిలోనే ఓడిన విషయం తెలిసిందే. రెండో సెమీస్ కూడా గురువారమే జరుగనుంది. లీగ్‌లో భాగంగా మంగళవారం జరగాల్సిన రెండు మ్యాచ్‌లు రద్దయ్యాయి. గ్రూప్-బిలో దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ మధ్య జరుగాల్సిన మ్యాచ్ ఒక్క బంతి పడకుండానే రద్దు కాగా.. పాకిస్థాన్, థాయ్‌లాండ్ మధ్య జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా నిలిచిపోయింది.



**ఫుల్‌ఫామ్‌లో భారత్..**

లీగ్‌దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన టీమ్ ఇండియా అజేయంగా సెమీఫైనల్లో అడుగుపెట్టింది. 2018 సెమీఫైనల్లో ఇంగ్లండ్ చేతిలోనే ఓటమి పాలై.. ఇంటిదారిపట్టిన భారత్ మరోసారి సెమీస్‌లో ఆ జట్టునే ఢీకొట్టనుంది. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లోనే డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను సొంతగడ్డపైనే చిత్తు చేసిన హర్మన్ బృందం ఫుల్‌ఫామ్‌లో ఉంది.

**ఆసీస్.. ఏడోసారి**

మహిళల క్రికెట్‌లో తిరుగులేని ఆధిపత్యం కనబరిచే ఆస్ట్రేలియా.. డిఫెండింగ్ చాంపియన్ హోదాతో మెగాటోర్నీలో అడుగుపెట్టింది. తొలి మ్యాచ్‌లో టీమ్ఇండియా చేతిలో ఓడినా.. వెంటనే పుంజుకొని మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో జయభేరి మోగించింది. ఇప్పటి వరకు ఆరుసార్లు ప్రపంచకప్ ఆడిన ఆస్ట్రేలియా అందులో అన్నింటా సెమీస్ చేరింది.

**సఫారీల రాతమారేనా..**

మెగాటోర్నీ చరిత్రలో ఇప్పటి వరకు కేవలం ఒక్కసారే సెమీఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు.. ఈసారి చాంపియన్‌గా నిలువాలని కృతనిశ్చయంతో ఉంది. గ్రూప్‌లో భాగంగా ఆడిన తొలి మూడు మ్యాచ్‌ల్లోనూ దక్షిణాఫ్రికా విజయం సాధించగా.. చివరి మ్యాచ్ రద్దైంది.సెమీస్‌లో బలమైన ఆసీస్‌ను ఎదుర్కోవాల్సి రావడం ప్రొటీస్‌కు పరీక్ష పెట్టే అంశమే!

**జోరుమీదున్న ఇంగ్లండ్..**

మహిళల ప్రపంచకప్‌లో ఆసీస్ తర్వాత బలమైన జట్టుగా గుర్తింపు ఉన్న ఇంగ్లండ్ ఇప్పటి వరకు జరిగిన ఆరు మెగాటోర్నీల్లో ఓ సారి విజేతగా నిలిచి మరో మూడుసార్లు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. లీగ్ దశలో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిన ఇంగ్లిష్ జట్టు.. ఆ తర్వాత హ్యాట్రిక్ విజయాలతో నాకౌట్‌కు దూసుకొచ్చింది. సెమీస్‌లో వరుసగా రెండోసారి భారత్‌ను ఢీకొననుంది.



రోడ్ సేఫ్టీ వరల్డ్ సిరీస్ కోసం మంగళవారం ప్రాక్టీస్ మొదలుపెట్టిన మాస్టర్ సచిన్ టెండూల్కర్

## తమీమ్ రికార్డు సెంచరీ

**సిలెట్:** ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ తమీమ్ ఇక్బాల్ (158; 20 ఫోర్లు, 3 సిక్సర్లు) రికార్డు శతకంతో చెలరేగడంతో జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో బంగ్లాదేశ్ 4 పరుగుల తేడాతో నెగ్గి.. మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా.. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. బంగ్లా తరఫున వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన రికార్డును మెరుగుపరిచిన తమీమ్‌తో పాటు ముష్ఫికర్ రహీమ్ (55), మహ్ముదుల్లా (41) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 318 పరుగులు చేసింది. చివరి ఓవర్‌లో జింబాబ్వే విజయానికి 20 పరుగులు కావాల్సి ఉండగా.. తిరిపానో (28 బంతుల్లో 55 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) రెండు భారీ సిక్సర్లతో బంగ్లాను భయపెట్టినా.. చివర్లో ఒత్తిడికి గురికావడంతో జింబాబ్వే ఓటమి పాలైంది. కమునుకమ్వే (51), వధెవేరే (52), సికందర్ రజా (66) అర్ధశతకాలు సాధించారు.